




www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM సిటీ



పార్టీలతో సంబంధాలున్న సిఇసి... ఎన్నికలను నిష్పక్షపాతంగా ఎలా నిర్వహిస్తారు? 07
తక్షణమే ఆయన రాజీనామా చేయాలి : ప్రియాంకా గాంధీ

'సర్'లో జ్ఞానేశ్ కుమార్‌వి 'ఏకపక్ష నిర్ణయాలు'
ఇటీవల జరిగిన ఎన్నికల రద్దుపై సుప్రీం పరిశీలించాలి: సిబల్

మమత వర్గం టిఎంసి ఎమ్మెల్యే కారుపై దాడి
రెండు రోజుల్లో రెండు సార్లు దాడులు : కునాల్ ఘోష్



సంపుటి 29, సంచిక: 99 | సోమవారం | 28-09-2026 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00





## నేటి నుంచి 3 రోజులు
# బ్యాంకుల సమ్మె

- వారానికి ఐదు రోజుల పని విధానం, ఇతర పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్
- ప్రభుత్వ రంగ బ్యాంకులపై తీవ్ర ప్రభావం
- చెక్కు క్లియరెన్సులు, డిపాజిట్లు సహా బ్యాంకింగ్ సేవలకు అంతరాయం

**న్యూఢిల్లీ :** దేశ వ్యాప్తంగా బ్యాంకు యూనియన్లు మూడు రోజుల పాటు సమ్మెకు పిలుపునిచ్చాయి. వారానికి ఐదు రోజుల పని విధానం, ఇతర పెండింగ్‌లో ఉన్న డిమాండ్ల సాధన కోసం సమ్మె చేపట్టనుండడంతో ఈనెల 28, 29, 30న చెక్ క్లియరెన్స్, నగదు ఉపసంహరణలు, డిపాజిట్లతో సహా బ్యాంకింగ్ సేవలకు అంతరాయం కలిగే అవకాశం ఉంది. ఈ ప్రభావం ప్రధానంగా ప్రభుత్వ రంగ బ్యాంకులు, పాతతరం ప్రైవేట్‌రంగ బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులపై పడే అవకాశం ఉంది. అయితే డిజిటల్ బ్యాంకింగ్, ఇతర ఆన్‌లైన్ సేవలు అందుబాటులోనే ఉండే అవకాశం ఉంది. కొన్ని ప్రైవేట్ రంగ బ్యాంకులు తెరిచే అవకాశముంది. ఈనెల 11న జరిగిన ఒక రోజు దేశవ్యాప్త సమ్మె తర్వాత మరోసారి మూడు రోజుల సమ్మె జరుగుతోంది. చాలా ప్రభుత్వ తరువాయి 12లో



## ఆర్‌టిసి తెలంగాణ వర్కర్స్ యూనియన్‌కు
# కాంగ్రెస్ మద్దతు అధర్మం

## ఐఎన్‌టియుసిని పక్కన పెట్టి మరో సంఘానికి మద్దతు ఎందుకు ఇచ్చారో చెప్పాలి

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్
- అధికార పార్టీ ఎన్ని కుట్రలు చేసినా ఇయు విజయం తథ్యమని వెల్లడి
- ఆర్‌టిసి గుర్తింపు సంఘం ఎన్నికలను రాజకీయ రణంగా మార్చొద్దు
- ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించాలని విజ్ఞప్తి

ప్రజాపక్షం/హైదరాబాద్

అధికార పార్టీ కాంగ్రెస్ ఎన్ని కుట్రలు చేసినా ఆర్‌టిసి యూనియన్ గుర్తింపు ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్ విజయం ఖాయమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ధీమా వ్యక్తం చేశారు. ఆర్‌టిసి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు రాజకీయ రణరంగంగా మార్చకుండా స్వేచ్ఛగా, ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఆదివారం సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్ధూంభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాబు, ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్నలతో కలిసి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ కమ్యూనిస్టు మద్దతు ఉన్న ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్‌ను ఓడించేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ తనది కాని యూనియన్‌కు అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. ఏ యూనియన్ అయినా ఎన్నికల్లో పోటీ చేయవచ్చని, అయితే ఒక సంఘాన్ని బలహీన పర్చి మరో సంఘాన్ని గెలిపించే ప్రయత్నాలు చేయడం సరికాదని అన్నారు. ఆర్‌టిసి పుట్టుక నుంచి కార్మిక ఉద్యమంతో ఎఐటియూసికి పేగుబంధం ఉందని, ఈ ఎన్నికల్లో కార్మికులు ఎంప్లాయిస్ యూనియన్‌కే పట్టం కడుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

**'కమ్యూనిస్టు మద్దతు ఉన్న యూనియన్ గెలవకూడదా?'**

ఆర్‌టిసి గుర్తింపు సంఘం ఎన్నికలలో కమ్యూనిస్టు మద్దతు ఉన్న యూనియన్ గెలవకూడదన్న ఉద్దేశంతో కాంగ్రెస్ వ్యవహరించడం సరికాదన్నారు. కాంగ్రెస్ పార్టీ కోసం ఎంప్లాయిస్ యూనియన్ నేతలు, ఆర్‌టిసి కార్మికులు గతంలో ప్రచారం చేశారని, ఎన్నికల సమయంలో ఇంటింటికీ తిరిగి మద్దతు కోరారని గుర్తుచేశారు. అయితే ఇప్పుడు అదే కార్మిక సంఘాల తరువాయి 8లో

## అర్హత ఉన్న యుఎల్‌సి కేసులు
# పరిశీలించి క్రమబద్ధీకరించాలి

- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశం
- దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యల నుంచి ప్రజలకు విముక్తి కల్పిస్తామని స్పష్టీకరణ



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ పట్టణ భూ గరిష్ఠ పరిమితి చట్టం (యుఎల్‌సి) కింద పాక్షికంగా క్రమబద్ధీకరించిన, క్రమబద్ధీకరించని కాలనీలకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి, అర్హత ఉన్న కేసులను నిబంధనల ప్రకారం క్రమబద్ధీకరించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు గతంలో జారీ చేసిన జిఒ నంబర్ 455, 456, 747, 92 కింద వచ్చిన పెండింగ్ యుఎల్‌సి దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలని మెమో నంబర్ 48062/యుఎల్‌సి/ఎ1/ 20261ను జారీ చేసినట్లు ఆయన ఆదివారం ఒక ప్రకటనలో తరువాయి 8లో

## నిర్ణయాలన్నీ ఏకగ్రీవమైతే
# అభ్యంతరాలు ఎందుకొచ్చాయి?

- రాజకీయంగా సిఇసి జ్ఞానేశ్ కుమార్‌ను సమర్థించొద్దు
- ప్రజలకు సమాధానం చెప్పాలి
- మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి డిమాండ్



ప్రజాపక్షం/హైదరాబాద్

భారత ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వ్యవహారశైలిపై ప్రశ్నలు తలెత్తినప్పుడు ఆయనను రాజకీయంగా సమర్థించడం కాకుండా, ప్రజలకు సమాధానాలు చెప్పాలని నీటిపారుదలశాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు.ఇసి నిర్ణయాలన్నీ ఏకగ్రీవమైతే అభ్యంతరాలు ఎందుకు వచ్చాయో ప్రజలకు వివరించాలన్నారు. సిఈసి బిజెపి నాయకుడు కాదని, ఎన్నికల సంఘం ఆ పార్టీ అనుబంధ సంస్థ కాదని పేర్కొన్నారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న వ్యక్తికి రాజకీయ పార్టీ కవచం అవసరం లేదని, ప్రజల విశ్వాసమే రక్షణగా తరువాయి 8లో



## ప్రభుత్వం, ఉద్యోగుల మధ్య
# భయాందోళనలుండొద్దు

- పరస్పర గౌరవంతోనే సమస్యలు పరిష్కారం
- గత ప్రభుత్వానిది అణిచివేత ధోరణి అయితే మాది ప్రేమను పంచే ప్రజా సర్కార్
- ప్రతి మండలానికి ఒక తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు ప్రభుత్వం కార్యాచరణ
- **ఎస్‌టియు 80వ వసంతోత్సవాల్లో మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టీకరణ**
- తెలంగాణ ఉద్యమంలో ఉపాధ్యాయుల త్యాగాలు ప్రభుత్వం ఎప్పటికీ మరువబోదని వ్యాఖ్య
- కొన్ని సంఘాలకు అధికారం పంచన చేరడం అలవాటైంది: కూనంనేని

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రభుత్వం, ఉద్యోగుల మధ్య భయాలు, ఆందోళనలు ఉండకూడదని, ప్రేమాభిమానాలు, పరస్పర గౌరవంతోనే సమస్యలు పరిష్కారమవుతాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. భయం, అణచివేత ధోరణి గత పాలకులదని, తమది సాటి మనుషులను గౌరవించే ప్రజా ప్రభుత్వమని అన్నారు. రాష్ట్రంలోని ప్రతి మండలానికి ఒక తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోందన్నారు. గత పదేళ్ల పాలనలో రూ.25 వేల కోట్ల ఉద్యోగుల బకాయిలను తమ ప్రజా ప్రభుత్వం రూ.11 వేల కోట్లకు తగ్గించిందని వివరించారు నాటి తెలంగాణ ఉద్యమంలో ఎస్‌టియు ఉపాధ్యాయులు చేసిన త్యాగాలను ప్రభుత్వం తరువాయి 12లో




## ఎఐఎస్‌ఎఫ్ 90వ వార్షికోత్సవాలు
# హనుమకొండ ముస్తాబు




- నేటి నుండి మూడు రోజులపాటు కార్యక్రమాలు
- నేడు పబ్లిక్ గార్డెన్ నుండి కెయు వరకు భారీ విద్యార్థి ప్రదర్శన
- హాజరు కానున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎఐఎస్‌ఎఫ్ జాతీయ, రాష్ట్ర నేతలు

ప్రజాపక్షం/హనుమకొండ

ఎఐఎస్‌ఎఫ్ 90వ రాష్ట్ర స్థాయి వార్షికోత్సవాలకు చారిత్రక నగరం హనుమకొండ ముస్తాబు అయింది. ఈ నెల 28, 29, 30 తేదీలలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవాల ఏర్పాట్లను నాయకులు పూర్తి చేశారు. మూడు రోజుల పాటు జరుగనున్న ఈ ఎఐఎస్‌ఎఫ్ ఉత్సవాలలో భాగంగా మొదటిరోజు సోమవారం హనుమకొండలో భారీ విద్యార్థి ప్రదర్శన నిర్వహించనున్నారు. స్థానిక పబ్లిక్ గార్డెన్ నుండి కాకతీయ యూనివర్సిటీ వరకు ప్రదర్శన నిర్వహించిన అనంతరం కేయూ ఆడిటోరియంలో ఏఐఎస్‌ఎఫ్ 90వ వార్షికోత్సవం బహిరంగ సభ జరుగుతుంది. ఈ బహిరంగ సభకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎఐఎస్‌ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ సిరంగి రాజన్, మాజీ జాతీయ అధ్యక్షులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో పాటు జాతీయ, రాష్ట్ర నాయకులు పాల్గొంటారు. ఉత్సవాలలో రెండవ రోజు మంగళవారం ఎఐఎస్‌ఎఫ్ మాజీ ముఖ్య నాయకుల సమ్మేళనం కాజీపేట బాల వికాస కేంద్రంలో జరుగుతుంది. ఈ సమ్మేళనంలో మాజీ ఎఐఎస్‌ఎఫ్ నాయకులు అయిన మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి, మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా, ప్రముఖ హైకోర్టు న్యాయవాదులు, డాక్టర్‌లు, ఇంజినీర్లు, రాజకీయ నాయకులు తదితరులు పాల్గొంటారు. ఈ సందర్భంగా వివిధ రంగాలలో రాణిస్తున్న ఎఐఎస్‌ఎఫ్ మాజీ నాయకులను ఘనంగా సన్మానించనున్నారు. అలాగే నేటి తరువాయి 8లో

## విద్యార్థినిపై అత్యాచారం ఆరోపణలు
# లవ్లీ ప్రొఫెషనల్ వర్సిటీలో ఉద్రిక్తత

- క్యాంపస్‌లో విధ్వంసం సృష్టించి, ఆస్తులు ధ్వంసం చేసిన విద్యార్థులు
- ఢిల్లీ-అమృత్‌సర్ జాతీయ రహదారి దిగ్బంధనం



**ఫగ్వారా :** పంజాబ్‌లోని ఫగ్వారాలో ఉన్న లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ప్రాంగణంలో ఒక విద్యార్థినిపై బయటి వ్యక్తి అత్యాచారం చేశాడన్న ఆరోపణల నేపథ్యంలో, ఆదివారం తెల్లవారుజామున ఆ యూనివర్సిటీ విద్యార్థులు క్యాంపస్‌లో విధ్వంసం సృష్టించి, ఆస్తులను ధ్వంసం చేసి, జాతీయ రహదారిని దిగ్బంధించారు. ఢిల్లీ—అమృత్‌సర్ జాతీయ రహదారిని దిగ్బంధించడంతో భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఈ ఘటనకు సంబంధించి విద్యార్థులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుర్తు తెలియని వ్యక్తిపై అత్యాచారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై తరువాయి 12లో

## కొత్త మిలిటరీ టెక్నాలజీతో
# ప్రతిఘటిస్తాం



- హోర్ముజ్‌లో జోక్యం అమెరికాకు కలగా మిగిలిపోతుంది
- మాకళ్ళు గప్పి వెళ్ళే నౌకలకు ఇక భద్రత ఉండదు
- చర్చలతోనే యుద్ధ పరిష్కారం : ఇరాన్ వెల్లడి

**టెహ్రాన్:** దురాక్రమణ దారులను సరికొత్త మిలిటరీ టెక్నాలజీ ద్వారా ప్రతిఘటిస్తామని ఇరాన్ సాయుధబలగాల సీనియర్ అధికార ప్రతినిధి, బ్రిగేడియర్ జనరల్ అబోల్ ఫజల్ షెకార్చీ హెచ్చరించారు. హోర్ముజ్ జలసంధి విషయంలో జోక్యం ఇకమీదట శత్రువుకు కలగానే మిగిలిపోతుందన్నారు. ఇరాన్‌ను తప్పించుకుని దొడ్డిదారిన వెళ్ళాలనుకునే నౌకలకు ఇక భద్రత ఉండబోదని స్పష్టం చేశారు. ''పశ్చిమాసియాను వదిలివెళ్ళిపోవడం తప్ప అమెరికా సైన్యాలకు మరోమార్గంలేదు, వారు ఎంత త్వరగా వెళ్ళిపోతే వారికి అంగ భద్రత, మంచి జరుగుతుంది, వారు వెళ్ళిపోయాక పశ్చిమాసియాకు పూర్తి భద్రత చేకూరుతుంది'' అన్నారు. అదేసమయంలో ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాఘ్చీ కూడా ఆదివారం టెహ్రాన్‌లో స్పందిస్తూ, చర్చల ద్వారా మాత్రమే యుద్ధ సమస్య పరిష్కారం అవుతుందని స్పష్టం చేశారు. మధ్యవర్తులు అందజేసే తుది సందేశం కోసం తాము ఎదురుచూస్తున్నామని, దానిని బట్టే ఒక నిర్ణయం తీసుకుంటామన్నారు. అంతకుముందు శనివారం ఆరాఘ్చీ న్యూయార్క్ నుండి టెహ్రాన్ తిరిగి వెళ్ళేముందు పత్రికాగోష్ఠిలో, హోర్ముజ్ జలసంధిని తెరిచేందుకు, శాంతి చర్చల పునఃప్రారంభానికి ఏడు రోజుల ప్రణాళిక ప్రకటించారు. చర్చలు విజయవంతం కావాలంటే యుద్ధం వల్ల ఏర్పడిన అపనమ్మకాన్ని తరువాయి 8లో





08

## కోహ్లీ మరో మైలురాయి..

వన్డేల్లో 15వేల పరుగులతో రికార్డు!

# 'అంటరానితనం' అరాచకాన్ని అక్షరాలతో నిలదీసిన ఆనంద్

ఆధునిక భారతీయ ఆంగ్ల సాహిత్యంలో ప్రసిద్ధ నవలా రచయితలు ముగ్గురు ఉన్నారు. ఈ 'త్రయం'లో, ఆర్‌కె నారాయణ్, రాజారావుతోపాటు ముల్క్ రాజ్ ఆనంద్ (1905–2004) పేరు చేరుతుంది. భారతీయులు ఆంగ్లంలో రచనలు చేయడం కొత్తకాకపోయినా, ఈ ముగ్గురు రంగ ప్రవేశం చేయక ముందు, ఆ తర్వాత గణనీయమైన మార్పును గమనించవచ్చు. అప్పటి వరకూ ఆంగ్లంతోసహా భారతీయ సాహిత్యం ఎక్కువగా కల్పనకే పరిమితమై ఉండేది. అందువల్ల యూరోపియన్లు భారతదేశాన్ని అడవులు, మాంత్రికులు, పాములతో నిండిన దేశంగా చూసేవారు. వీరికి ముందు భారతీయ సాహిత్యం ప్రధానంగా చరిత్ర, శృంగారం వంటి అంశాల చుట్టూనే తిరిగేది. భారతీయ సమాజంలోని వాస్తవికతకు, అక్కడ జీవిస్తున్న ప్రజల జీవితాలకు అది చాలా దూరంగా ఉండేది. భారతీయ ఆంగ్ల సాహిత్యాన్ని అద్భుత కథలు, కల్పిత గాథల సాహిత్యంగా మాత్రమే పరిగణించే ధోరణిని తొలగించేందుకు ఈ త్రయం చేసిన కృషి అసాధారణం. ఆర్‌కె నారాయణ్, రాజా రావు, రవీంద్రనాథ్ ఠాగూర్ వంటి రచయితలు సాహిత్యం ద్వారా 'బ్రిటిష్ రాజ్' భారతీయులపై జరుగుతున్న బాధలు, అణచివేతలకు స్వరాన్ని ఇచ్చారు. తద్వారా సాహిత్యంలో కొంత వాస్తవికతను తీసుకురావడానికి ప్రయత్నించారు. అయితే ఆనంద్ వారితో కొంత భిన్నమైన మార్గాన్ని అనుసరించాడు. గాంధీజీ, ఆయన నైతిక విలువలు, జీవన విధానం ఆనంద్‌పై గాఢమైన ప్రభావం చూపాయి. ఆర్‌కె నారాయణ్‌కు ఆనంద్‌కు మధ్య దృక్పథంలో స్పష్టమైన తేడా ఉన్న విషయం వారి రచనలను చదివిన వారికి సులభంగానే అర్థమవుతుంది. నారాయణ్ తన నవలల్లో ప్రధానంగా మధ్యతరగతి (కామన్ మ్యాన్) జీవితాన్ని చిత్రిస్తే, ఆనంద్ భారతీయ సమాజంలోని శతాబ్దాల నాటి బాధలు, వేదనలు అనుభవిస్తున్న అణగారిన, పీడిత వర్గాల జీవితాన్ని వెలుగులోకి తీసుకురావడానికి ప్రయత్నించాడు. మహాత్మా గాంధీ ఒకసారి అంటరానితనం, కులవ్యవస్థలను హిందూమతంపై పడిన మాయని మచ్చలుగా అభివర్ణించారు. భారతీయ సమాజంలో దీర్ఘకాలంగా కొనసాగుతున్న కులవ్యవస్థ, అంటరానితనం వంటి దురాచారాలు సమాజాన్ని తీవ్రంగా దెబ్బతీశాయనేది తిరుగులేని వాస్తవం. శతాబ్దాలుగా సామాజిక సంస్కర్తలు ఎన్నో ప్రయత్నాలు చేసినప్పటికీ ఈ దురాచారాలను పూర్తిగా నిర్మూలించలేకపోయారు. 1930 దశకాల్లో ఆనంద్ భారతీయ సాహిత్య రంగంలోకి ప్రవేశించారు. ఆ దశాబ్దంలో భారతదేశంలో రాజకీయ పరిణామాలు తీవ్రంగా సాగాయి. 1930లో మహాత్మా గాంధీ సత్యాగ్రహ ఉద్యమాలను ప్రారంభించారు. అనంతరం మూడు రౌండ్ టేబుల్ సమావేశాలు జరిగాయి. ఆ సమావేశాలు దేశవ్యాప్తంగా తీవ్ర స్పందనను రేకెత్తించాయి. 1935లో భారత ప్రభుత్వ చట్టం ఆమోదం పొందింది. అంటరానివారిగా పరిగణించిన ప్రజల విముక్తి, అభ్యున్నతి కోసం గాంధీజీ చేపట్టిన ఉద్యమాలు ఆ తరువాత మరింత వేగం పుంజుకున్నాయి. ఆయన వారిని 'హరిజనులు' (దేవుని పిల్లలు) అని పిలిచారు. 1936లో 1935 భారత ప్రభుత్వ చట్టం ప్రకారం రాష్ట్ర శాసనసభలకు ఎన్నికలు జరిగాయి. మొత్తంగా చూస్తే, 1930ల నాటి భారతదేశం తీవ్రమైన రాజకీయ, సామాజిక పరిణామాలతో ఉడికిపోతున్న ఒక 'మిశ్రమ పాత్ర'లా కనిపించింది. కుల ఆధిపత్యాన్ని అనుభవిస్తున్న వర్గాలు భారత సమాజంలోని అత్యంత దురదృష్టకరమైన వర్గాలపై చూపుతున్న విచక్షణారహిత వివక్షను ఆనంద్ గమనించాడు. ఆరోజుల్లో, అంటరానివారంటూ దూరంగా విసిరివేయబడిన వర్గాలకు కనీస మానవ అవసరాలు కూడా అందుబాటులో ఉండేవి కావు. పౌర సౌకర్యాల గురించి చెప్పనవసరం లేదు. హిందూ సామాజిక వ్యవస్థలో ఉన్నత కులంలో జన్మించినప్పటికీ, ఈ ప్రజలు తరతరాలుగా అనుభవిస్తున్న దౌర్జన్యాన్ని, అణచివేతను ఆనంద్ తీవ్రంగా వ్యతిరేకించాడు. తన రచనల ద్వారా ఖండించాడు. 1937లో వెలువడిన తన 'టూ లీవ్స్ అండ్ ఎ బడ్' (రెండు ఆకులు మరియు ఒక మొగ్గ) ముందుమాటలో ఆనంద్ తన సాహిత్యంలోని నాయకులు, నాయకురాళ్లు అంటే తనకు ఎంతో ఇష్టమని అన్నాడు. వారు వాస్తవ జీవితంలోని మనుషుల ప్రతిబింబాలని, తన బాల్యం, యవ్వనంలో తాను




వారిని ప్రత్యక్షంగా తెలుసుకున్నానని ఆయన పేర్కొన్నాడు. ఇంకా, 'వారు నా మాంసంలో మాంసం, నా రక్తంలో రక్తం' అని వ్యాఖ్యానించారు. వారి జీవితాలు పుట్టుక నుంచి కాటి వరకూ అనేకానేక శారీరక, మానసిక హింసల మధ్య సాగుతున్న వైనాన్ని ఆనంద్ గమనించాడు. బాధ, సామాజిక అన్యాయం, అవమానం, అవహేళన, దూషణలతో వారి జీవితాలు ముడిపడి ఉన్నాయని గ్రహించాడు. వారి జీవితాల్లో బాధ, దుఃఖం వెంటాడే రెండు దుర్మార్గాలుగా పేర్కొన్నాడు. ఆనంద్ అంటరానివారి సామాజిక వాతావరణాన్ని, దుస్థితిని, సంక్లిష్ట పరిస్థితులను నిశితంగా పరిశీలించి, తన నవలల్లో వాటిని యథాతథంగా ప్రతిబింబించాడు. ఇందుకు ఉదాహరణగా ఆయన తొలి నవల 'అన్‌టచ్‌బుల్' (అంటరానివాడు)ను ప్రస్తావించాలి. ఆయనకు ఎనలేని కీర్తి ప్రతిష్టలను ఆర్జించి పెట్టిన 'అన్‌టచ్‌బుల్స్' ఒక విశిష్టమైన నవల. జేమ్స్ జాయిస్ రచనల్లో ఎక్కువగా కనిపించే 'చైతన్య స్రవంతి' పద్ధతిని ఉపయోగిస్తూ, బలూషా పట్టణంలో నవలానాయకుడు బఖా జీవితంలో ఒకే రోజులో జరిగిన సంఘటనలను ఈ నవల వివరిస్తుంది. అంటరానివారి కుటుంబంలో జన్మించిన బఖా కులవివక్షతో నిండిన సమాజానికి బలైన యువకుడు. అతడు పారిశుధ్య కార్మికుల సమాజానికి చెందినవాడు. అతని శరీరం దృఢంగా ఉంటుంది. కండలు బలంగా ఉంటాయి. 'అతని శరీరంలోని ప్రతి కండరమూ రాయిలా గట్టిగా, కదలిక వచ్చినప్పుడు అద్దంలా మెరుస్తూ కనిపించేది. చూసిన ప్రతి ఒక్కరూ ఎంత నైపుణ్యం కలిగిన పనివాడు! అని అనుకునేవారు. అతని పని అపరిశుభ్రమైనదైనా, అతడు మాత్రం తాను వీలైనంత శుభ్రంగా ఉండేవాడు' అని వివరిస్తాడు ఆనంద్. అయితే తాను చేయాల్సిన, సమాజం తనపై బలవంతంగా రుద్దిన పనిని చేయడానికి బఖాకు ఇష్టం ఉండదు. తన వ్యక్తిగత పరిశుభ్రతను త్యాగం చేసి మరుగుదొడ్లను శుభ్రం చేయాలి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి. అయినప్పటికీ అతడిని పదేపదే అవమానిస్తూ అపవిత్రుడు, మలినుడు అని పిలుస్తారు. తీవ్ర పక్షపాతంతో కూడిన సమాజం దృష్టిలో అతడు ఒక బరువును మోసే జంతువు మాత్రమే. అతని సోదరి పరిస్థితి కూడా భిన్నంగా ఏమీ ఉండదు. ఆమె కుల ఆధిపత్య వర్గాల ఇళ్లకు వెళ్లి పనులు చేసి, అవమానాలతో తిరిగి రావాల్సి వస్తుంది. చివరకు నిరాశ, ఆగ్రహంతో బఖా తన తండ్రితో 'వాళ్ల మురికిని మనం శుభ్రం చేస్తాం కాబట్టే, మనల్ని వాళ్లు కేవలం మురికిగానే భావిస్తున్నారు' అంటాడు. సమాజానికి సహాయం చేయడానికి ప్రయత్నించినా అది అతడిపై కనికరం చూపదు. ఒక సందర్భంలో బఖా హాకీ ఆడుతున్నప్పుడు ఒక చిన్న బాలుడు గాయపడతాడు. బఖా ఆ బాలుడిని పైకి లేపుతాడు. వెంటనే ఆ బాలుడి తల్లి ఆగ్రహంతో 'అపవిత్రం! అపవిత్రం!' అని కేకలు వేస్తుంది. ఈ సంఘటన బఖాను తీవ్ర నిరాశకు గురిచేస్తుంది. అయితే మహాత్మా గాంధీ ఆ ప్రాంతానికి వచ్చినప్పుడు బఖాలో ఒక ఆశాకిరణం కనిపిస్తుంది. గాంధీజీ అంటరానివారిని 'హరిజనులు'లుగా 'దేవుని మనుషులు'గా చూడాలని ప్రజలకు పిలుపునిస్తారు. తమ జీవితాల్లో సామాజిక దురాచారాలకు చోటివ్వకూడదని కూడా ఆయన ప్రజలను కోరుతారు. మొత్తం మీద ఈ నవలలో సమాజంలోని కఠోరమైన, నగ్నమైన వాస్తవాలను బయటపెట్టే అనేక సంఘటనలు కనిపిస్తాయి. వాటిలో అంటరానివారు అనుభవించే బాధ, దోపిడీ, అవమానం, వారి ఆత్మగౌరవాన్ని ఛిద్రం చేసే పరిస్థితులు అత్యంత ప్రధానమైనవి.

## 'బావి సంఘటన'

నవలలోని 'బావి సంఘటన' అంటరానితనం అనే దురవస్థను హృదయవిదారకంగా చిత్రిస్తుంది. గ్రామంలోని బావి నుంచి నీళ్లు తెచ్చుకోవడానికి బఖా సోదరి వెళుతుంది. అంటరానిదిగా భావించడం వల్ల ఆమె బావిని లేదా అక్కడి ఏ వస్తువునూ తాకడానికి అనుమతి లేదు. అందువల్ల ఎవరో తనకు కొద్దిగా నీళ్లు ఇస్తారని ఆమె ఎదురుచూస్తుంది. చివరకు గ్రామ పూజారి ఆమెకు నీళ్లు ఇస్తాడు. అనంతరం శుభ్రం చేయడానికి తన ఇంటికి రావాలని ఆమెను కోరుతాడు. ఇంటి చుట్టూ ఎవరూ లేరని చూసి ఆమె అక్కడికి వెళ్లినప్పుడు, పూజారి ఆమెను లైంగికంగా వేధించడానికి ప్రయత్నిస్తాడు. పరిస్థితిని తనకు అనుకూలంగా మలుచుకోవడానికి పూజారి ప్రయత్నిస్తాడు. ప్రజలు అక్కడికి చేరుకున్నప్పుడు ఆ పూజారి ఏమాత్రం పశ్చాత్తాపం లేకుండా ఆ అమాయక బాలికే తన మఠాన్ని అపవిత్రం చేసిందని ఆరోపించడం ద్వారా అత్యంత దారుణంగా వ్యవహరిస్తాడు. ఈ సంఘటనను మానవతా దృష్టితో పరిశీలిస్తే, సమాజంలో బలవంతుడిదే న్యాయంగా మారిన పరిస్థితి కనిపిస్తుంది. బలహీనులైన అంటరానివారికి న్యాయం అందదు. నిజం, మానవత్వం, నైతికత గురించి బోధించాల్సిన పూజారి చివరకు బాధితురాలినే దోషిగా నిలబెట్టే దుర్మార్గుడిలా మారుతాడు. నవల మొత్తంలో, బఖా, అతని కుటుంబం అనేక సందర్భాల్లో అవమానకరమైన ప్రవర్తనను ఎదుర్కొంటారు.

## 'బజార్ సంఘటన'

'బజార్ సంఘటన' కూడా ఈ నవలలో అంతే ప్రభావవంతమైనదిగానూ, హృదయాన్ని తాకేదిగానూ ఉంటుంది. బఖా ఎదురయ్యే ప్రతి అవమానాన్ని భరించాల్సి వస్తుంది. మార్కెట్‌లో అనుకోకుండా, అమాయకంగా ఒక కులీనుడిని తాకడమే అతడు చేసిన 'నేరం'. దానికి అతడు 'పంది కుక్క', 'మురికి కుక్క', 'దుర్మార్గుడా' వంటి దూషణలు ఎదుర్కొంటాడు. బఖా తిరిగి ఎదురు చెప్పలేదు. తల వంచుకుని, ఏదో గొణుగుతూ ఆ మాటలను భరించాల్సి వస్తుంది. 'ఈ మురికి కుక్క నన్ను ఢీకొట్టింది' అని ఆ వ్యక్తి అన్నప్పుడు బఖా పరిస్థితిని చూసి పాఠకుడికి అతనిపై అమితమైన సానుభూతి కలుగుతుంది. అదేవిధంగా 'దేవాలయ సంఘటన' కూడా హృదయాన్ని కదిలిస్తుంది. బాధితుడైన బఖాపై పాఠకుడు జాలిపడతాడు. ఈ నవలలో బఖా ఒక వ్యక్తి మాత్రమే కాదు.. ఒక సామాజిక వర్గానికి ప్రతినిధి కూడా. అణచివేతకు, నిరాశకు, నిరాదరణకు గురైన వర్గానికి అతడు ప్రతిరూపం. అంటరానివారిగా ముద్రపడిన అనేకమంది దురదృష్టవంతులలో అతడు ఒకడు. వారి విధి బాధను అనుభవించడమే అన్నట్టుగా మారింది. ఆధిపత్య కులాలకు చెందిన ప్రజల అవమానాలు, అవహేళనలు, మానసిక హింసను వారు భరించాల్సి వచ్చింది. ఈ అంటరానివారు సమాజంలో తమకు స్థానం లేదని భావించే పరిస్థితిని కల్పించారు. సమాజం నుంచి వెలివేయబడినట్టుగా జీవించారు. ఇలాంటి పరిస్థితులు నేటికీ ఏదో ఒక రూపంలో కొనసాగుతునే ఉన్నాయి.

– సత్యశ్రీ

## ముల్క్‌రాజ్ జీవన ప్రస్థానం..



ముల్క్‌రాజ్ ఆనంద్ (12 డిసెంబర్ 1905–28 సెప్టెంబర్ 2004) భారతీయ ఆంగ్ల సాహిత్యంలో ప్రముఖ నవలా రచయిత, కథకుడు. సంప్రదాయ భారతీయ సమాజంలోని పేదలు, అణగారిన వర్గాలు ఎదుర్కొన్న దోపిడీ, పేదరికం, కులవివక్ష, అవమానాలను ఆయన తన రచనల్లో లోతుగా చిత్రించారు. ఆధునిక భారతీయ ఆంగ్ల సాహిత్యంలో ఆయన నవలలు, కథలు క్లాసిక్లుగా గుర్తింపు పొందాయి. పేషావర్ (ప్రస్తుతం పాకిస్తాన్‌లో ఉంది)లో హిందూ ఖత్రి కుటుంబంలో జన్మించిన ఆనంద్ అమృత్‌సర్ ఖాల్సా కాలేజీలో చదివి 1924లో పట్టా పొందాడు. అనంతరం ఇంగ్లాండ్ వెళ్లి యూనివర్సిటీ కాలేజ్ లండన్‌లో చదువుకున్నాడు. కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో తత్వశాస్త్రంలో పిహెచ్‌డి చేశాడు. బెర్ట్రాండ్ రస్సెల్, ఇంగ్లీష్ అనుభవవాదులపై ఆయన పరిశోధన సాగింది. ఆ కాలంలో బ్లూమ్స్‌బరీ బృందం సభ్యులతో ఆయనకు స్నేహం ఏర్పడింది. జెనీవాలో లీగ్ ఆఫ్ నేషన్స్‌కు చెందిన మేధో సహకార సంస్థలో కూడా ఉపన్యాసాలు ఇచ్చాడు. ఆనంద్ సాహిత్య ప్రస్థానానికి కులవ్యవస్థతో ముడిపడిన కుటుంబ విషాదం ప్రేరణగా నిలిచింది. ముస్లిం మహిళతో కలిసి భోజనం చేసినందుకు కుటుంబం వెలివేసిన ఒక అత్త ఆత్మహత్య చేసుకోవడం ఆయనను తీవ్రంగా ప్రభావితం చేసింది. ఈ అనుభవం ఆయన తొలి గద్యరచనకు నేపథ్యమైంది. 1935లో వెలువడిన 'అన్‌టచ్‌బుల్' నవల ఆయనకు అంతర్జాతీయ ఖ్యాతిని తెచ్చింది. ఒకే రోజులో మరుగుదొడ్లను శుభ్రం చేసే బఖా అనే దళిత యువకుడు ఎదుర్కొనే అవమానాలను ఈ నవల చిత్రిస్తుంది. 'కూలీ' (1936), 'టూ లీవ్స్ అండ్ ఎ బడ్' (1937) వంటి రచనల్లోనూ పేదలు, కార్మికుల జీవితాలను కేంద్రంగా చేసుకున్నారు. పంజాబీ, హిందుస్తానీ భాషల నుడికారాన్ని ఆంగ్లంలో సృజనాత్మకంగా ఉపయోగించడం ఆయన ప్రత్యేకత. 1930–40 దశకాల్లో ఆనంద్ భారత స్వాతంత్ర్య ఉద్యమానికి మద్దతుగా పనిచేశాడు. లండన్‌లో రచయితగా, జర్నలిస్టుగా జీవిస్తూ భారత స్వాతంత్ర్యానికి ప్రచారం చేశాడు. స్పానిష్ అంతర్యుద్ధ సమయంలో జర్నలిస్టుగా పనిచేశాడు. రెండో ప్రపంచ యుద్ధంలో బిబిసికి స్క్రిప్ట్‌రైటర్‌గా సేవలు అందించాడు. జార్జ్ ఆర్వెల్‌తో స్నేహం ఏర్పడింది. పికాసోతో కూడా ఆయనకు స్నేహం ఉండేది. 1947లో భారత్‌కు తిరిగి వచ్చిన తరువాత ఆయన నవలలు, కథలు, కవిత్వం, వ్యాసాలు, ఆత్మకథాత్మక రచనలు కొనసాగించాడు. 'ది విలేజ్', 'ఎక్రాస్ ది బ్లాక్ వాటర్స్', 'ది స్వోర్డ్ అండ్ సికిల్', 'ది ప్రైవేట్ లైఫ్ ఆఫ్ యాన్ ఇండియన్ ప్రిన్స్' అనేవి ఆనంద్ ముఖ్య రచనల్లో కొన్ని. 1950లో ఆయన 'మార్గ్' అనే కళాసాహిత్య పత్రికను స్థాపించాడు. ఆనంద్ జీవితాంతం సోషలిస్టు భావజాలాన్ని సమర్థించారు. సాహిత్యం, రాజకీయాలు పరస్పరం విడదీయలేనివని ఆయన నమ్మాడు. ప్రోగ్రెసివ్ రైటర్స్ అసోసియేషన్ స్థాపక సభ్యుల్లో ఆయన ఒకడు. 1951 నుంచి 'సెవెన్ ఏజెస్ మ్యాన్' పేరుతో ఏడు భాగాల ఆత్మకథాత్మక నవల రాయడం ప్రారంభించి నాలుగు భాగాలను పూర్తి చేశాడు. పార్సీ శాస్త్రీయ నృత్యకారిణి షిరీన్ వజీఫ్దార్‌ను 1950లో వివాహం చేసుకున్న ఆనంద్, పుణేలో 28 సెప్టెంబర్ 2004న న్యూమోనియాతో 98 ఏళ్ల వయసులో మరణించాడు. భారతీయ ఆంగ్ల సాహిత్యంలో అణగారిన మనుషుల జీవితాలను ప్రధాన సాహిత్య విషయంగా నిలబెట్టిన రచయితగా ఆయనకు విశిష్ట స్థానం ఉంది.

# దళిత జాతి అణిచివేతను ధిక్కరించిన 'కవి చక్రవర్తి'

(గుర్రం జాషువా జయంతి నేడు)

**'రాజు మరణించె నొక తార రాలిపోయె**
**సుకవి మరణించె నొక తార గగన మెక్కె**
**రాజు జీవించు రాతి విగ్రహములయందు**
**సుకవి జీవించు ప్రజల నాల్కలయందు'**



అని 'ఫిరదౌసి' కావ్యంలో రాజు కంటే కవి గొప్ప అని ఎలుగెత్తి చాటిచెప్పిన ఘనుడు గుర్రం జాషువ. ఈ కావ్యం జాషువా జీవితానికి ప్రతిబింబం. 19 వ శతాబ్దం చివరి దశలో సామాజిక ప్రయోజనం కోసం భావకవిత్వ రీతి నుంచి పక్కకు జరిగి, మూఢాచారాలతో భ్రష్టుపట్టిన ఆనాటి పెత్తందార్ల అధర్మాలకు అడ్డుకట్టగా నూతన ఒరవడితో తన రచనలు కొనసాగించిన కవి జాషువా. ప్రజల్లో తన రచనల ద్వారా చైతన్యాన్ని రగిల్చిన 'కవి చక్రవర్తి' జాషువా. 1895 సెప్టెంబర్ 28న ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాలో వినుకొండ మండలంలోని చాట్రగడ్డపాడు గ్రామంలో గుర్రం వీరయ్య, లింగమ్మ దంపతులకు జన్మించిన 'కవి సామ్రాట్' జాషువాను, ఆయన 131వ జయంతి సందర్భంగా ఉభయ తెలుగు రాష్ట్రాలు గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తల్లిదండ్రులు వేర్వేరు కులాలకు చెందినవారు కావడంతో, జాషులా విద్యార్థి దశలోనే సమాజం నుంచి అనేక కష్టాలు, అవమానాలు, చీత్కారాలు ఎదుర్కొన్నాడు. తండ్రిది యాదవ కులం. తల్లి మాదిగ. ఫలితంగా జాషువాకు వివక్ష తప్పలేదు. అయినా, పరిస్థితులను ఎదిరించి నిలిచాడు. అనేక రచనలు చేసి, కవిగా తనను తాను నిరూపించుకున్నాడు. కోకొల్లలుగా ఖండకావ్యాలు రాశాడు. వాటిలో 'గబ్బిలం', 'ఫిరదౌసి', 'క్రీస్తు చరిత్ర' ముఖ్యమైనవి. ఇదే కోవలో లఘుకావ్యాలు కూడా ఉన్నాయి. 'ఫిరదౌసి' కావ్య వృత్తాంతంలో వేదన భరితం కనిపిస్తుంది. పర్షియన్ చక్రవర్తి గజిని మహ్మద్ ఆస్థానంలో కవి ఫిరదౌసి, అతని రాజు మాటకొక బహుమానం ఇస్తానని చెప్తాడు. దీనితో కవి పదేళ్లు శ్రమించి మహాకావ్యం రాస్తాడు. చివరికి అసూయపరుల మాటలు విని రాజు తాను ఇచ్చిన మాటను తప్పుతాడు. ఆవేదనతో ఆ కవి ఆత్మహత్య చేసుకుంటాడు. అక్కడ కవి హృదయాన్ని జాషువా స్వయంగా అనుభవించినట్లు రాస్తాడు. కవి తనలోని ఆవేదనలు సమాజానికి తెలియపరచడమే జాషువా రచనల సారాంశంగా ఉంటాయనడానికి ఇదో నిదర్శనం. సమాజంలోని హెచ్చుతగ్గులను వెతికి దానికి గల కారణాలను పరిశీలించి, అనేక కోణాల నుంచి ఆలోచించి, తన కంఠంలోని ఆవేదనను కవిత్వ మార్గంగా ఎంచుకుంటాడు జాషువా. ఆ క్రమంలో వచ్చిందే 'గబ్బిలం'. దళితులకు జరుగుతున్న అన్యాయాలను ఎలుగెత్తి చాటడం కోసం జాషువా ఈ కావ్యం రాశాడు. ఇది కాళిదాసు 'మేఘసందేశం' తరహాలో సాగుతుంది. అయితే ఇందులో సందేశాన్ని పంపేది యక్షుడు కాదు.. ఒక అంటరాని కులానికి చెందిన కథానాయకుడు (గబ్బిలం). అతను తన గోడును సమాజానికి వినిపించడమే ఇందులోని కథాంశం.

'నాదు కన్నీటి కథ సమన్వయము సేయనార్ద్ర హృదయంబు గూడ కొంత వసరంబు' అని గబ్బిలం గురించి జాషువా వాపోయాడు. ఉత్తమ జాతి పక్షులుగా పిలువబడే హంసలు, పావురం, చిలుకలను పక్కకు తీసి సమాజంలోకి అతి వేగంగా దూసుకుపోయేలా 'గబ్బిలం' కవి కళ్లకు దళితంగానే కనిపించింది. జాషువా రచనలు అగ్రరాజ్యాధికారం తుదముట్టించే దిశలో కొనసాగాయి. దళితులకు తిండి, బట్టలతో పాటు స్వేచ్ఛా జీవనం కూడా దుర్భేద్యంగా ఉండేది ఆనాటి కాలంలో. 'కఠిన చిత్తుల దురాగములు ఖండించి కనికర మొలకించు కులమునాది' అందుకే 'నిమ్న జాతుల కన్నీటి నీరదములు పిడుగులై దేశమును కాల్చివేయును' అని హెచ్చరించాడు. గర్జించాడు. శాసించాడు. చతుర్వర్ణ వ్యవస్థను నిలదీస్తూ జాషువా విప్లవ మూర్తిగా, మానవతాదిగా సాక్షాత్కరించాడు. పంచమ కులం ఎక్కడుందని ఆవేదనకు గురయ్యాడు.

'ముసలి వాడైన బ్రహ్మకు పుట్టినారు నలుగురు కుమారులనుట విన్నాను గాని వసరమునకన్న హీనుడ భాగ్యుడు.. యైదవ కులస్థు డెవరమ్మా, సావిత్రి?' అంటూ తన పద్యాలను తెలుగు సాహిత్య చరిత్రలో దళిత సాహిత్యానికి మార్గదర్శకంగా రాశాడు జాషువా. అయితే కులం ద్వారా కలిగిన అవమానం, దారిద్ర్యంతో జాషువా హృదయం ద్రవించింది. అందుకే, 'ఆ యభాగ్యుని రక్తంబు నాహరించి యినుప గజ్జెల తల్లి జీవనము సేయు గసరి బుసగొట్టు నాతని గాలిసోక నాల్గు పడగల హైందవ నాగరాజు' అంటూ సమాజ రుగ్మతను తీవ్ర స్వరంతో నిరసిస్తాడు. 'విశ్వనరుడను నేను నాకు తిరుగులేదు' అని తన వీర కవిత్వాన్ని యావత్ ప్రపంచానికి ఒక చక్కని అక్షర పూలమాలలుగా అందించాడు. 'గబ్బిలం'లో కష్టజీవి గురించి చెప్తూ,

'వాని రెక్కల కష్టంబు లేని నాడు సస్యరమ పండి పులకింప సంశయించు వాడు చెమ్మటలోడ్చి ప్రపంచమునకు భోజనము బెట్టు వానికి భుక్తి లేదు' అని ఆవేదన వ్యక్తం చేస్తాడు.

'చిక్కిన కాసుచే దనివి జెందు నమాయకుడెల్ల కష్టముల్ బొక్కెడు బువ్వతో మరచిపోవు క్షుధానల దగ్ధమూర్తి నల్దిక్కులు గల్గు లోకమున ధిక్కరియున్న యరుంధతీ సుతుండొక్కడు జన్మమెత్తె భరతోర్వరకుం కడగొట్టు బిడ్డడై' అంటాడు.

'ముప్పు గటించి వీని కులమున్ గలిమిన్ గబలించి దేహమున్ బిప్పియొనర్చు నీ భరత వీరుని పాదము కందకుండగా జెప్పులు గుట్టి జీవనము సేయును గాని నిరాకరింప లేదెప్పుడు నప్పు వడ్డది సుమీ భరతావని వీని సేవకున్' అనే పద్యంలో కష్టజీవి (దళితుని) కష్టాలను, కులపరంగా వారు అనుభవించిన బాధలను వివరిస్తాడు. జాషువా కవిత్వంలో జాలి, దయ, కరుణలు కనిపిస్తాయి. నిజానికి జాషువా జీవితం నుండి అతని కవిత్వం వికసించింది. తన రచనల ద్వారా అణగారిపోతున్న పేద సమాజాన్ని మార్చాలి అనుకున్నాడు. ఆ కోవలోనే ప్రయత్నించాడు. జాషువా అతని రచనలలో కసి గానీ, ద్వేషం గానీ లేదు. ఉన్నది కేవలం ప్రతిఘటన మాత్రమే. జాషువా సత్య హరిశ్చంద్ర నాటకంలో 'స్మశానవాటిక'లో కవి హృదయం ఈ విధంగా ఘోషిస్తుంది అంటాడు.

**'ఇచ్చోటనే సత్కవీంద్రుని కమ్మని కలము, నిప్పులలోన గఱగిపోయె!**
**ఇచ్చోటనే భూములేలు రాజన్యుని యధికారముద్రిక లంతరించె!**
**ఇచ్చోటనే లేత యిల్లాలి నల్లపూసల సౌరు, గంగలో గలిసిపోయె!**
**ఇచ్చోట.. నెట్టి పేరెన్నికం గనుగొన్న చిత్రలేఖకుని కుంచియ, నశించె!**
**ఇది పిశాచులతో నిటాలేక్షణుండు గజ్జె గదలించి యాడు రంగస్థలంబు**
**ఇది మరణదూత తీక్షణమౌ దృష్టులొలయ నవని బాలించు భస్మసిం-హాసనంబు'** అంటూ ఎంతో లోతైన తత్వాన్ని బోధిస్తాడు. పాలకులైనా... పాలితులైనా, ధనికులైనా... పేదలైనా, కవులైనా... సగటు జీవులైనా, అంతా ఒకటేననే భావాన్ని జాషువా హరిశ్చంద్రుడి పాత్రతో చెప్పిస్తాడు.

'ఎన్నో యేండ్లు గతించిపోయినవి గానీ, యీ శ్మశానస్థలిన్ గన్నుల్ మోడ్చిన మందభాగ్యుడొకడైనన్ లేచిరా, దక్కటా! యెన్నాళ్ళీచలనంబు లేని శయనం? బేతల్లు లల్లాడిరో! కన్నీటంబడి క్రాగిపోయినవి నిక్కంబిందు పాషాణముల్' అంటూ, ఈ స్మశానవాటికలో కొన్ని వందల, వేల ఏండ్లుగా నిద్రిస్తున్నవారు ఒక్కరు కూడా లేచి రాలేదని గుర్తుచేస్తాడు. ఇంకా ఎన్ని సంవత్సరాలు ఈచలనంలేని నిద్ర అంటూ ఆవేదన వ్యక్తం చేస్తాడు. రుద్రభూమిలో తమబిడ్డలను పోగొట్టుకున్న తల్లుల రోదనలతో నిండిన కన్నీళ్ళకు వల్లకాడులోని రాళ్లు కాగిపోయాయని చింతించాడు. జాషువా తన సుదీర్ఘ కవితా ప్రస్థానంలో తన జీవనయానంలోని వేదనా భరితగాథల్ని కవిత్వంగా, పద్యాలుగా అల్లుకున్నాడు. సమతారాగం ఆలపించాడు. కులాన్ని నిరసించాడే గాని కులవాదిగా మారలేదు. జాషువాకు 1970లో ఆంధ్ర విశ్వవిద్యాలయం 'కళాప్రపూర్ణ' బిరుదును అందించి తనను తాను గౌరవించుకుంది. భారత ప్రభుత్వం 'పద్మభూషణ' పురస్కారంతో ధన్యతనొందింది. 'కవి కోకిల', 'కవి విశారద', 'కవి దిగ్గజ', 'నవయుగ కవిచక్రవర్తి' వంటి బిరుదులు అందుకున్న జాషువా తెలుగు సాహితీ ప్రపంచంలో చిరంజీవి. తెలుగు సాహిత్యం ఉన్నంతకాలం, జాషువా పేరు వినిపిస్తునే ఉంటుంది. ఆయన రచనలు ప్రకాశిస్తునే ఉంటాయి.

– కందుకూరి దేవదాసు, 9949937745

# చరిత్రకు కథా రూపం..

చదవాల్సిన పుస్తకం




చరిత్రను పిల్లలకు ఎలా చెప్పాలి? రాజులు, యుద్ధాలు, రాజవంశాలు, తేదీల వరుసగా చెప్పాలా? లేక ఒక దేశం అనుభవించిన వేల సంవత్సరాల ప్రయాణాన్ని మనుషుల కథగా వినిపించాలా? అన్నది ప్రశ్న. ముల్క్‌రాజ్ ఆనంద్ రాసిన 'ది స్టోరీ ఆఫ్ ఇండియా' ఈ రెండో మార్గాన్ని ఎంచుకున్న అరుదైన పుస్తకం. (తెలుగులో ఈ పుస్తకాన్ని 'భారతదేశ కథ' పేరుతో మద్దులూరి రామకృష్ణ అనువదించగా, నవచేతన పబ్లిషింగ్ హౌస్ ప్రచురించింది. పిల్లల కోసం రాసిన ఈ గ్రంథం తొలిసారి 1948లో బొంబాయిలోని కుతుబ్ ప్రచురణ సంస్థ ద్వారా వెలువడింది. ఆనంద్‌ను సాధారణంగా 'అన్‌టచ్‌బుల్', 'కూలీ', 'టూ లీవ్స్ అండ్ ఎ బడ్' వంటి నవలల రచయితగా గుర్తుచేసుకుంటాం. భారతీయ సమాజంలోని కులం, పేదరికం, దోపిడీ, మానవ అవమానాలను ఆయన సాహిత్యం పదునుగా ప్రశ్నించింది. అయితే ఆయన రచనా ప్రపంచం అంతటినీ సామాజిక నవలలకే పరిమితం చేయలేం. పిల్లల కోసం 'ఇండియన్ ఫెయిరీ', 'ది స్టోరీ ఆఫ్ ఇండియా', 'ది స్టోరీ ఆఫ్ మ్యాన్', 'ది స్టోరీ ఆఫ్ చాలా నెహ్రూ' వంటి పుస్తకాలు కూడా రాశాడు. 'భారతదేశ కథ' ప్రత్యేకత దాని పరిమాణంలో కంటే దాని దృష్టిలో ఉంది. భారత చరిత్రను ఒక పరీక్షా పుస్తకంలా కాకుండా, ఒక దీర్ఘ మానవ ప్రయాణంలా పరిచయం చేయాలనే ప్రయత్నం ఇందులో కనిపిస్తుంది. ప్రాచీన భారతదేశం నుంచి ఆధునిక కాలం వరకు వచ్చిన మార్పులను పిల్లలకు అందుబాటులో ఉండే కథన పద్ధతిలో చెప్పడం ఆనంద్ లక్ష్యం. అందువల్ల చరిత్ర ఇక్కడ కేవలం తేదీల జాబితాగా మిగలకుండా, నాగరికతలు, విశ్వాసాలు, వ్యక్తులు, సామాజిక మార్పులు పరస్పరం కలిసిన ఒక ప్రవాహంగా కనిపిస్తాయి. ఈ పుస్తకాన్ని అర్థం చేసుకోవాలంటే ఆనంద్ స్వయంగా ఒక రచయితగా ఎంచుకున్న మానవతావాద దృష్టిని గుర్తు పెట్టుకోవాలి. ఆయన దృష్టిలో చరిత్ర అంటే కేవలం అధికారాన్ని సాధించిన రాజుల చరిత్ర కాదు. ఒక నాగరికత ఎలా ఏర్పడింది? ప్రజల ఆలోచనలు ఎలా మారాయి? మతాలు, సంస్కృతులు పరస్పరం ఎలా ప్రభావితం చేసుకున్నాయి? వంటి అనేకానేక ప్రశ్నలు కూడా చరిత్రలో భాగమే. అందుకే యువ పాఠకుడికి భారతదేశాన్ని ఒకే మతం, ఒకే రాజవంశం లేదా ఒకే రాజకీయ సంప్రదాయంతో నిర్వచించకుండా, అనేక పొరలతో కూడిన సమాజంగా పరిచయం చేయడం ఈ రచనలోని ముఖ్యమైన లక్షణం. ఈ పుస్తకం వెలువడిన కాలాన్ని కూడా మనం విస్మరించకూడదు. 1948లో భారతదేశం స్వాతంత్ర్యం పొందిన వెంటనే ఈ రచన వచ్చింది. ఆ సమయంలో కొత్త దేశానికి తన గతాన్ని కొత్త కళ్లతో చూసుకోవాల్సిన అవసరం ఉండింది. వలస పాలన రాసిన భారత చరిత్రకు భిన్నంగా, భారతీయ అనుభవాన్ని యువ పాఠకులకు పరిచయం చేయాలనే సాంస్కృతిక అవసరం కూడా ఏర్పడింది. ఆ నేపథ్యాన్ని గుర్తుచేసుకుంటూ, 'భారతదేశ కథ'ను చదివితే దాని ఉద్దేశం మరింత స్పష్టమవుతుంది. నేడు చరిత్రను పిల్లలకు చెప్పే పద్ధతులు మారిపోయాయి. డిజిటల్ మాధ్యమాలు, యానిమేషన్లు, ఇంటరాక్టివ్ మ్యాపులు వచ్చాయి. అయినప్పటికీ ఆనంద్ పుస్తకానికి ఒక ప్రత్యేకమైన విలువ నేటికీ మిగిలే ఉంది. అది చరిత్రను జ్ఞాపకం పెట్టుకోవాల్సిన సమాచారంగా కాకుండా, మనుషులు నిర్మించిన సంక్లిష్టమైన అనుభవంగా చూడమని ఆహ్వానిస్తుంది. ఒక రచయిత చరిత్రను పిల్లల కోసం సరళీకరించినప్పుడు, ఎంతవరకు సరళీకరించాలి? ఎంతవరకు సంక్లిష్టతను నిలబెట్టాలి? అనే ప్రశ్నకు కూడా ఈ చిన్న పుస్తకం ఒక ఆసక్తికరమైన చారిత్రక ఉదాహరణగా నిలుస్తుంది.

### పుస్తకం పేరు

**భారతదేశం కథ**
**మూలం: ది స్టోరీ ఆఫ్ ఇండియా (ముల్క్ రాజ్ ఆనంద్)**
**అనువాదం: మద్దులూరి రామకృష్ణ**
**వెల: రూ. 70.**

ప్రతులకు

**నవచేతన పబ్లిషింగ్ హౌస్ గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్) జిఎస్ఐ (పోస్ట్), హైదరాబాద్: 500068. (నవచేతన బుక్ హౌస్ అబిడ్స్, సుల్తాన్ బజార్, బండ్లగూడ (నాగోల్) హైదరాబాద్, హన్మకొండ, కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం శాఖల్లోనూ లభిస్తుంది).**

ఈ వారం కవితలు

## ఆలంబన

ఆస్తులు అంతస్తులు
అహంకార ప్రదర్శనలు
డాబులు ధర్పాలు
వికృత విన్యాసాలు

ద్వేషాలు మోసాలు
వినాశనానికి రహదారులు
తేనె పూతల ప్రసంగాలు
కడుపు నింపని తుంపరలు

పలికే పురుష పదాలు
ఉనికికే పెను ప్రమాదాలు
ఎగిసిపడే మిసిమి
పోకడలు
తీరం చేరని కలల
కెరటాలు

ఉరుకుల పరుగులు
పునాది లేని గోపురాలు
గాలిలోని మేడలు
గగన సీమ కుసుమాలు

పరువాలు మురిపాలు
నిలుకడ లేని ప్రమోదాలు
విందులు వినోదాలు
కలుషాలకు నిలయాలు

మానవమే ప్రాణ సమానం
సత్యమే నిత్య శుభోదయం
కామనల కతీతమే
భవితకు మార్గం
ప్రకృతి మాతే తోడు నీడైన
ఆలంభనం

– నమిలకొండ
నాగేశ్వర్ రావు
8688553470

## తెరిచిన కిటికీ

పచ్చని చెట్లను చూడమంది,
రంగుల పువ్వులను కనమంది,
చల్లని గాలిని తెచ్చింది,
కమ్మని పరిమళాలను పంచింది!

తెల్లని కిరణాలను తీసుకొచ్చింది,
ప్రకృతి అందాలను పరిచయం చేసింది,
మనసుకు మధురానందాన్ని ఇచ్చింది,
మదిలో కొత్త ఆశలను మొలకెత్తించింది!

పక్షుల గానాలను వినిపించింది,
పరుగులెత్తే మేఘాలను కనబరచింది,
చిరుగాలికి ఊగే చెట్లను చూపించింది,
చిరునవ్వులు చిందే లోకాన్ని
తిలకింపజేసింది!

చక్కని ఆలోచనలను రేపింది,
చిలిపి ఊహలకు రెక్కలు తొడిగించింది,
మౌనంలో భావాలు మేల్కొలిపింది,
మనసులో అక్షరాలు కదిలించింది!

కలం చేతిలోకి వచ్చింది,
భావం పదాలై మారింది,
పదాలు కవితై పూసింది,
కవిత హృదయంలో రూపుదిద్దుకుంది!

ప్రకృతి చూపిన ప్రతి దృశ్యం
నా మనసులో ఒక భావమై నిలిచింది,
ప్రకృతి పలికిన ప్రతి స్వరం
నా గుండెలో ఒక గీతమై మిగిలింది;

కిటికీ తెరిచింది —
బయటి ప్రపంచాన్ని చూడటానికి కాదు,
నా లోపలి ప్రపంచాన్ని
వెలిగించుకోవడానికి;
నా మనసునే ఒక కవితావనంగా
మార్చుకోవడానికి!

– గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్,
భాగ్యనగరం

# ఓటు హక్కును హరించే హక్కు ఎవరికీ లేదు

### ఎఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవాలను జయప్రదం చేయండి

### ‘సర్’ పేరుతో ఓట్లు తొలగిస్తున్న సిఇఒ

### ఎఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ శ్రీరంగ రాజన్



**ప్రజాపక్షం/కేయూ క్యాంపస్ :** పౌరుల ఓటు హక్కును హరించే హక్కు ఎవరికి లేదని, ఓటు హక్కు కల్పించే ఎన్నికల సంఘం ‘సర్’తో పౌరుల ఓట్లను హరిస్తుందని, దేశంలో బిజెపి విద్యారంగాన్ని పూర్తిగా కాషాయికరణ చేసే కుట్ర చేస్తున్నదని నూతన జాతీయ విద్యా విధానం పేరుతో విద్యారంగం నిర్వీర్యం అయి విద్యారంగం ప్రైవేట్ చేతుల్లోకి వెళ్తుందని దేశంలోనే మొట్టమొదటి విద్యార్థి సంఘం ఎఐఎస్ఎఫ్ అని,ఏఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవాలు హన్మకొండ జిల్లా కేంద్రంలో రానున్న మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నామని ఎఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ శ్రీరంగ రాజన్ అన్నారు. ఆదివారం కాకతీయ యూనివర్సిటీ లోని గెస్ట్ హౌస్ లో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ పాత్రికేయా సమావేశానికి ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ శ్రీరంగ రాజన్ హాజరయ్యారు.ఈ సందర్భంగా దినేష్ శ్రీరంగ రాజన్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం బిజెపి ఎన్డీఏ ప్రభుత్వ ఆధీనంలో కీలుబొమ్మలాగా వ్యవహరిస్తున్నదని వారన్నారు. పౌరుల ఓటు హక్కును హరించే హక్కు ఎవరికి లేదని, ఓటు హక్కు కల్పించే ఎన్నికల సంఘం సర్ తో పౌరుల ఓట్లను హరిస్తుందని, కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం నీట్ పరీక్షలను సక్రమంగా నిర్వహించకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతుందని, మొన్న కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ముమ్మాటికీ విద్యార్థుల పోరాట ఫలితమేనని, దేశంలో విద్యారంగంలో మార్పుల కొరకు విద్యలో మతపరమైన అంశాలను చేర్చకుండా చరిత్ర అంశాలను చేర్చేందుకు పోరాటం నిర్వహిస్తామని, కేంద్ర బడ్జెట్లో విద్యకు పూర్తిగా నిధులు తగ్గిస్తున్నారని, ప్రైవేటు యూనివర్సిటీలను దేశంలో అనుమతిస్తున్నారని, నూతన జాతీయ విద్యా విధానం, వికసిత్ భారత్ శిక్ష అధిష్టాన్ పేరుతో విద్య కాషాయికరణ, ప్రైవేటీకరణ చేసే విధంగా బిజెపి కుట్ర చేస్తుందని, భారతదేశానికి స్వాతంత్రం కావాలని పోరాడిన సంఘం ఎఐఎస్ఎఫ్ మాత్రమేనని, 90 సంవత్సరాలు సుదీర్ఘ చరిత్ర కలిగిన ఏఐఎస్ఎఫ్ నాటి నుండి నేటి వరకు విద్యారంగ సమస్యలపై దేశవ్యాప్తంగా ప్రతి రాష్ట్రంలో విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం అలుపెరుగని పోరాట నిర్వహిస్తుందని, హనుమకొండలో సెప్టెంబర్ 28 నుండి 30 వరకు ఏఐఎస్ఎఫ్ 90 వార్షికోత్సవాలు జరగనున్నాయని,ఈ వార్షికోత్సవాల్లో 90 ఏళ్ల ఉద్యమ ప్రస్థానం పోరాటాలను గుర్తుచేసుకొని, భవిష్య విద్యార్థి ఉద్యమ కార్యచరణ నిర్ణయించుకుని విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు నిర్వహిస్తామని దినేష్ తెలిపారు.ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ దేశ స్వాతంత్రం తో పాటు తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కావాలని పోరాడిన ఏకైక జాతీయ విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని, తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన గత కెసిఆర్ ప్రభుత్వం విద్య రంగాన్ని పూర్తి విస్మరించగా, నేటి రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విద్యారంగ సమస్యల పరిష్కరించడంలో విఫలం చెందుతుందని ఎన్నికల్లో విద్యార్థులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదని, తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ ఆధ్వర్యంలో ఏఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవాలు హనుమకొండ జిల్లా కేంద్రంలో మూడు రోజులపాటు జరగనున్నాయని ఈ వార్షికోత్సవాల్లో 28వ తేదీ నాడు భారీ విద్యార్థి ప్రదర్శన భారీ బహిరంగ సభ కాకతీయ యూనివర్సిటీ ఆడిటోరియంలో జరుగుతుందని, 29వ తేదీ నాడు మాజీ నాయకుల ఆత్మీయ సమ్మేళనం, సత్కారం, సెమినార్ నిర్వహణ ఉంటుందని 30వ తేదీ నాడు రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశం జరుగుతుందని తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి విద్యార్థి ఉద్యమ కార్యచరణ రూపొందిస్తామని మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ తెలిపారు.ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ బానోత్ రఘురాం, రెహమాన్, హనుమకొండ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ప్రణీత్ గౌడ్, భాషబోయిన సంతోష్, వరంగల్ జిల్లా కార్యదర్శి ల్యాదల్ల శరత్, హనుమకొండ జిల్లా నాయకులు భాను, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ బహిష్కరణపై కఠిన చర్యలు

### ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్రామాల్లో సామాజిక బహిష్కరణలు, గ్రామ బహిష్కరణల పేరుతో ప్రజలపై ఆంక్షలు విధించడం తీవ్రమైన చట్ట ఉల్లంఘనే కాదు, సామాజిక నేరమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. గ్రామ బహిష్కరణకు గురైన కుటుంబాలకు న్యాయం చేయడంతో పాటు, ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్న వారిపై ప్రభుత్వం, పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. గ్రామ బహిష్కరణకు గురైన నిజామాబాద్ జిల్లా, మోర్తాడ మండలం, తాళ్లరాంపూర్ గ్రామ బాధితులు ఆదివారం సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూంభవన్‌లో కూనంనేని సాంబశివరావును కలిసి తమకు న్యాయం చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. అనంతరం కూనంనేని సాంబశివరావు మీడియాతో మాట్లాడారు. నిజామాబాద్ జిల్లా, మోర్తాడ మండలం, తాళ్లరాంపూర్ గ్రామంలో గ్రామ అభివృద్ధి కమిటీ పేరుతో కొంతమంది కమిటీ ఏర్పాటు చేసుకుని గత రెండేళ్ల కిత్రం 39గౌడ్ కుటుంబాలు, 11 ఎస్‌సి కుటుంబాలు కలిపి మొత్తం 50 కుటుంబాలను గ్రామ బహిష్కరణ చేయడం అత్యంత హేయమైన చర్య అని కూనంనేని సాంబశివరావు అన్నారు . బహిష్కరణకు గురైన కుటుంబాలతో గ్రామస్తులు ఎవరూ మాట్లాడకూడదని, వారికి ఎలాంటి సహాయ సహకారాలు అందించకూడదని, కిరాణా దుకాణాల ద్వారా కూడా సరుకులు విక్రయించకూడదంటూ ఈనెల 22వ తేదీన ఆ గ్రామ కమిటీ బాధిత కుటుంబాలపై కొత్తగా మరిన్ని ఆంక్షలు విధించడం, ఈ నిబంధనలను ఎవరైనా ఉల్లంఘిస్తే రూ.25వేల జరిమానా విధిస్తామని హెచ్చరించినట్లు బాధితులు చెబుతున్నారని కూనంనేని పేర్కొన్నారు. గ్రామ బహిష్కరణ అనేది సాధారణమైన వివాదం కాదని, ఇది తీవ్రమైన సామాజిక నేరమని, తెలంగాణ సాయుధ పోరాటం జరిగిన కాలంలో వెట్టిచాకిరీ, సామాజిక బహిష్కరణలు, గ్రామాలపై ఆధిపత్యం వంటి దురాచారాలకు వ్యతిరేకంగా ప్రజలు పోరాడారని గుర్తుచేశారు. తెలంగాణ సాయుధ పోరాటానికి వెట్టిచాకిరీలు, గ్రామ బహిష్కరణలు, సామాజిక అణచివేత కూడా ప్రధాన కారణాలని, అలాంటి పరిస్థితులు మళ్లీ కనిపించడం అత్యంత దురదృష్టకరం అని కూనంనేని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఏదైనా భూ వివాదం, వ్యక్తిగత వివాదం లేదా ఇతర సమస్య ఉంటే చట్టపరమైన మార్గాల్లో పరిష్కరించుకోవాలని సూచించారు. గ్రామ కమిటీలు స్వయంగా తీర్పులు చెప్పి ప్రజల సామాజిక, ఆర్థిక సంబంధాలను తెంచే విధంగా ఆంక్షలు విధించడం సరికాదన్నారు. భూమి, చెట్లకు సంబంధించిన వివాదాల పేరుతో ఒకసారి రూ.2లక్షలు, మరోసారి రూ.4లక్షలు, మరో సందర్భంలో రూ.6లక్షల వరకు బాధితులకు జరిమానాలు విధించినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. బాధితులు ఆ జరిమానాలు చెల్లించలేదనే కారణంతో వారిని గ్రామ బహిష్కరణ చేయడమేమిటి అన్ని ప్రశ్నించారు. ఇలాంటి నేరాలు ఎక్కడ జరిగినా ప్రభుత్వం, పోలీసులు కఠినంగా అణచివేయాలని, గ్రామ బహిష్కరణ పేరుతో ప్రజల ప్రాథమిక హక్కులను హరించే చర్యలను అనుమతించకూడదన్నారు. ఈ సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేస్తాం అని కూనంనేని సాంబశివరావు తెలిపారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలు స్ఫూర్తిదాయకం

### తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ చైర్మన్ జి.నిరంజన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ ఉద్యమానికి, బిసిల హక్కుల సాధనకు కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన సేవలు చిరస్మరణీయమని తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ అన్నారు. బిసి కమిషన్ కార్యాలయంలో ఆదివారం ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జి.నిరంజన్ మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ నిరాడంబరమైన జీవితాన్ని గడిపిన గొప్ప స్వాతంత్ర్య సమర యోధుడని అన్నారు.
నిజాం పాలనకు వ్యతిరేకంగా ఉద్యమించారని, తెలంగాణ కోసం తన మంత్రి పదవికి తొలిసారిగా రాజీనామా చేసిన వ్యక్తిగా ఆయన చరిత్రలో నిలిచిపోయారని పేర్కొన్నారు. గ్రంథాలయాల ఏర్పాటుతో పాటు సామాజిక చైతన్యం కోసం బాపూజీ చేసిన కృషి మరువలేనిదన్నారు. కమిషన్ సభ్యుడు తిరుమలగిరి సురేందర్ మాట్లాడుతూ 1969లో ప్రసార శాఖ మంత్రిగా ఉన్న సమయంలో జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయడంలో బాపూజీ కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. మరో సభ్యుడు జయప్రకాశ్ మాట్లాడుతూ చిన్న గ్రామం నుంచి ఉన్నత స్థాయికి ఎదిగిన బాపూజీ సహకార సంఘాల స్థాపనలోనూ విశేష కృషి చేశారని తెలిపారు. కమిషన్ సభ్యురాలు బాలలక్ష్మి రంగు మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ ఎంతోమందికి స్ఫూర్తిదాతగా నిలిచారని అన్నారు.

## తరుణ్ మానేపల్లికి మంత్రి వాకిటి శ్రీహరి అభినందనలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆసియా క్రీడల్లో పురుషుల బ్యాడ్మింటన్ విభాగంలో కాంస్య పతకం సాధించిన తెలంగాణ క్రీడాకారుడు తరుణ్ మానేపల్లిని రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. హైదరాబాద్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆదివారం తరుణ్ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. అంతర్జాతీయ వేదికపై ప్రతిభ చాటి పతకం సాధించడం గర్వకారణమని మంత్రి పేర్కొన్నారు. తరుణ్ మానేపల్లి విజయం యువ క్రీడాకారులకు స్ఫూర్తి అని అభివర్ణించారు. క్రీడల్లో ప్రతిభ ఉన్న యువతను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అవసరమైన సహకారం అందిస్తుందని తెలిపారు. తెలంగాణలో క్రీడలకు మరింత ప్రాధాన్యం కల్పిస్తూ మౌలిక వసతులు, శిక్షణ సదుపాయాలను బలోపేతం చేస్తున్నామని మంత్రి శ్రీహరి పేర్కొన్నారు. భవిష్యత్తులో తరుణ్ మరిన్ని అంతర్జాతీయ విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## గిగ్ కార్మికుల భద్రతకు ‘హాక్ ఐ’పై అవగాహన

### షేక్ సలావుద్దీన్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికుల భద్రత కోసం తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ (టిజిపిడబ్ల్యుయు) ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించింది. విధినిర్వహణలో అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు హైదరాబాద్ పోలీస్ ‘హాక్ ఐ’ మొబైల్ యాప్‌ను వినియోగించుకోవాలని యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్ కార్మికులకు సూచించారు. ఆటో, క్యాబ్ డ్రైవర్లు, డెలివరీ సిబ్బంది, పట్టణ, గృహ ఆధారిత సేవలందించే కార్మికులు, మహిళా గిగ్ కార్మికులు ఈ సదుపాయాలను వినియోగించుకోవాలని కోరారు.
హాక్ ఐ యాప్ ద్వారా ఎస్ఒఎస్ అత్యవసర హెచ్చరిక, లొకేషన్ షేరింగ్, నేరాలు, ఉల్లంఘనల ఫిర్యాదు, మహిళల భద్రతకు సంబంధించిన సహాయం, పోలీసు అధికారుల సంప్రదింపు వివరాలు, పోలీసులకు ఫీడ్‌బ్యాక్, సూచనలు వంటి సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ఎస్ఒఎస్ సదుపాయం ద్వారా స్నేహితులు, బంధువులను అప్రమత్తం చేయడంతో పాటు వినియోగదారుడి వివరాలు, లొకేషన్‌ను సంబంధిత పోలీసు అధికారులకు పంపే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.
గిగ్ కార్మికులు విధి నిర్వహణలో ఎక్కువ సమయం రోడ్లపైనే గడుపుతారని, తరచూ అపరిచిత ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని షేక్ సలావుద్దీన్ అన్నారు. అందువల్ల ప్రతి కార్మికుడు అప్రమత్తంగా ఉండటంతో పాటు హాక్ ఐ యాప్ వినియోగంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ‘భద్రతే ప్రథమం.. అప్రమత్తంగా ఉండండి.. అనుసంధానంలో ఉండండి’ అనే సందేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## భద్రాచలం వద్ద వరద 43 అడుగులకు చేరిక



### మొదటి ప్రమాద హెచ్చరిక జారీ

**ప్రజాపక్షం/భద్రాచలం :** ఎగువను కురుస్తున్న భారీ వర్షాల కారణంగా భద్రాచలం వద్ద గోదావరి నీటి తాకిడి పెరిగింది. ఆదివారం రాత్రి 7 గంటలకు భద్రాచలం వద్ద 43 అడుగుల వరద దాటడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఇది క్రమేపీ పెరుగుతూ 45 అడుగుల వరకు చేరుకొని ఆ తర్వాత తగ్గుముఖం పట్టే అవకాశం ఉన్నట్లు సిడబ్ల్యుసి అధికారులు వెల్లడించారు. తాళిపేరు, ఇంద్రవతి, ప్రాణహిత ఉప నదుల నుండి గోదావరికి వరద నీరు వచ్చి చేరుతుండడంతో భద్రాచలం వద్ద నీటి ప్రవాహం పెరుగుతుంది. అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశాలు జారీ చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. సాధారణంగా గోదావరికి జూలై ఆగస్టు మాసాల్లో వరదలు వస్తుంటాయి. అతికొద్ది సందర్భాల్లోనే సెప్టెంబర్ మాసంలో గోదావరికి నీటి ప్రవాహం పెరిగింది. తాజాగా సెప్టెంబర్ చివరి వారంలో గోదావరికి వరద నీరు చేరుతుండటంతో అధికారులు గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని వరద పరిస్థితిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ సూచించారు.

## బాపూజీ ఆశయ సాధనకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

### మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయ సాధనకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించుకొని ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి కేకే మహేందర్ రెడ్డి లు బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ యోధుడు, సామాజిక సమానత్వం కోసం పోరాడిన మహనీయుడు అని కొనియాడారు. పేద అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన మహనీయుడని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో బలహీన వర్గాలకు న్యాయం జరగాలంటే ప్రత్యేక తెలంగామ రాష్ట్రం ఏర్పడి తీరాల్సిందేనని తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రజల సంక్షేమం కోసం ప్రాధాన్యతనిచ్చిన గొప్ప నాయకుడు బాపూజీ అని అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ తన జీవితాన్ని ఉద్యమానికి అంకితం చేశారని తెలిపారు. ప్రజా ప్రతినిధిగా, మంత్రిగా పదవుల్లో ఉన్నప్పటికీ పదవుల కంటే తెలంగాణ రాష్ట్ర సాధన ప్రజల సంక్షేమానికే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ నాయకత్వంలో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని రాబోయే రోజుల్లో మరింత ముందుకు సాగుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ చక్రపాణి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు సూర దేవరాజు, నాయకులు చొప్పదండి ప్రకాశ్ ఎల్లె లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## అవినీతి సంపాదనతో బిఆర్ఎస్ విషప్రచారం

### ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో మరో 20 ఏళ్ల కాలంలో కూడా బిఆర్ఎస్ అధికారంలోనికి రాబోదని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ అన్నారు. హైదరాబాద్‌లోని సిఎల్‌పి కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అవినీతితో సంపాదించిన డబ్బుతో బిఆర్ఎస్ విష ప్రచారం చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఆషామాషీగా బిఆర్ఎస్ నాయకు ఫామ్‌హౌస్‌ల యాత్ర చేయలేదని,అసైన్డ్ భూములు, ఇనాం భూములు, ప్రభుత్వ భూములు ఇలా దేనిని కూడా వదిలిపెట్టకుండా బిఆర్ఎస్ నాయకులు ఆక్రమించారని ఆరోపించారు. ఇడి అటాచ్ చేసిన ల్యాండ్ డీట్యాచ్ అయిందని, ఇందుకు కెటిఆర్ సమాధానం చెప్పడం లేదన్నారు. ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని చెప్పడం ద్వారా కెటిఆర్ తెలంగాణ ద్రోహిగా మారారని మండిపడ్డారు. కెసిఆర్ తెలంగాణ ప్రజల గుండెల్లో లేరని, ఫామ్‌హౌస్ గడిలో ఉన్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణ ఉద్యమం కోసం జీవితాలను త్యాగం చేస్తే వారిని బిఆర్ఎస్ ఎందుకు పట్టించుకోలేదని, వారికి ఇసుమంత జాగా కూడా ఇవ్వలేదని ఆరోపించారు. 22 ఎ జాబితాలో ఉన్న భూములన్నీ ఇప్పుడు విముక్తి అవుతున్నాయని, కోట్ల రూపాయల విలువ చేసే భూములను హైడ్రా విముక్తి చేసిందని తెలిపారు. బిఆర్ఎస్‌కు అధికారం పోయినప్పటికీ అహంకారం మాత్రం తగ్గడం లేదన్నారు. తమకు బిజెపి, బిఆర్ఎస్ ఒక్కటేనని, ఈ రెండు పార్టీలు ఒకే జాతి మొక్కలని అన్నారు.

## బ్యాంక్ ఉద్యోగుల సమ్మెకు సిపిఐ(ఎం) మద్దతు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వారానికి 5 రోజులు పని విధానాన్ని అమలు చేయాలని, పిఎలఐ పథకం అమలులో ఏకపక్ష ధోరణి, 12వ వేతన ఒప్పందంలోని డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 28, 29, 30 తేదీల్లో యుఎఫ్‌బియు తలపెట్టిన 3 రోజుల దేశవ్యాప్త సమ్మెకు సిపిఐ(ఎ)ం తెలంగాణ రాష్ట్ర కమిటీ మద్దతు తెలిపింది. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేసింది. బ్యాంక్ ఉద్యోగ, అధికారుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన సిపిఐ(ఎం) బ్యాంకు ఉద్యోగులు చేస్తున్న ఈ 3 రోజుల సమ్మెను రాష్ట్ర కార్మికవర్గమంతా విజయవంతం చేయాలని కోరింది.



## కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయం

### సిహెచ్.వెంకన్న

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయమని టిజిఎస్ఆర్‌టిసి ఇడి సిహెచ్. వెంకన్న అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి సందర్భంగా ఆదివారం బస్‌భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి, ప్రజా హక్కులు, సామాజిక న్యాయం కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితాంతం చేసిన కృషి స్ఫూర్తిదాయకమన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆయన చేసిన త్యాగాలు, చూపిన మార్గం భావితరాలకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. బాపూజీ ఆశయాలను ఆచరణలో ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఎ విజయపుష్ప, ఎస్ఎల్ఓ కిరణ్, డిప్యూటీ సిపిఎం శిరీషతో పాటు పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు.

## ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా...

# వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం

### కొత్త వెబ్‌సైట్ ఆవిష్కరణ.. ఆన్‌లైన్‌లో హోమ్‌స్టే నమోదు

### 360 డిగ్రీల సాంకేతికతతో గైడ్‌లకు శిక్షణ

### ‘మై తెలంగాణ.. మై డెస్టినేషన్’ ప్రచారం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ పర్యాటక రంగాన్ని డిజిటల్ సాంకేతికతతో మరింత చేరువ చేసేందుకు రాష్ట్ర పర్యాటక శాఖ పలు వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. పర్యాటక ప్రాంతాల సమాచారాన్ని ఒకే వేదికపై అందుబాటులోకి తీసుకురావడంతోపాటు హోమ్‌స్టేల ఆన్‌లైన్ నమోదు, 360 డిగ్రీల సాంకేతికతతో గైడ్‌ల శిక్షణ, వర్చువల్ రియాలిటీ (విఆర్) అనుభూతి, డిజిటల్ ప్రచారం వంటి కార్యక్రమాలను ప్రారంభించింది. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం నిర్వహించిన కార్యక్రమాల్లో కొత్త తెలంగాణ టూరిజం వెబ్‌సైట్‌తో పాటు పలు ప్రచార, శిక్షణ కార్యక్రమాలను ఆవిష్కరించారు. తెలంగాణ టూరిజం రీడిజైన్ చేసిన కొత్త వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలు, వారసత్వ కట్టడాలు, ప్రకృతి అందాలు, సంస్కృతి, వంటకాలు, ప్రత్యేక పర్యాటక అనుభవాలకు సంబంధించిన సమాచారాన్ని ఒకే వేదిక ద్వారా తెలుసుకునేలా వెబ్‌సైట్‌ను రూపొందించారు.
పర్యాటకులు తమకు అవసరమైన సమాచారాన్ని సులభంగా పొందేలా డిజిటల్ వేదికను మరింత అనుకూలంగా తీర్చిదిద్దారు.
**హోమ్‌స్టేలకు ఆన్‌లైన్ నమోదు..** హోమ్‌స్టే నిర్వాహకుల కోసం ప్రత్యేక ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ సదుపాయాన్ని ప్రారంభించారు. ఇప్పటివరకు ఉన్న ప్రక్రియను మరింత సులభతరం చేస్తూ హోమ్‌స్టేల నమోదుకు డిజిటల్ మార్గాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. దీంతో రాష్ట్రంలో పర్యాటకులకు స్థానిక వసతి సదుపాయాలను మరింత విస్తరించే అవకాశం ఏర్పడనుంది.తెలంగాణ వారసత్వం, సంస్కృతి, ప్రకృతి, స్థానిక వంటకాలు, ప్రత్యేక పర్యాటక అనుభవాలను ప్రతిబింబించే కొత్త తెలంగాణ టూరిజం ప్రమోషనల్ ట్రైలర్‌ను ఆవిష్కరించారు. రాష్ట్రంలోని పర్యాటక ఆకర్షణలను దేశ, విదేశీ పర్యాటకులకు పరిచయం చేసేందుకు డిజిటల్ మాధ్యమాలను విస్తృతంగా వినియోగించనున్నారు. పర్యాటక గైడ్‌ల జ్ఞానం, నైపుణ్యాలు, డిజిటల్ సామర్థ్యాలను పెంపొందించేందుకు 360 డిగ్రీల సాంకేతికత ఆధారంగా గైడ్ లెర్నింగ్ మేనేజ్‌మెంట్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సాంకేతిక ఆధారిత అభ్యాసం ద్వారా గైడ్‌లకు నిరంతర శిక్షణ, నైపుణ్యాభివృద్ధి కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని రూపొందించారు.
**‘మై తెలంగాణ.. మై డెస్టినేషన్’...**
తెలంగాణలోని పర్యాటక ప్రాంతాలను సందర్శించి, అక్కడి అనుభవాలను సామాజిక మాధ్యమాల ద్వారా పంచుకునేలా ‘మై తెలంగాణ.. మై డెస్టినేషన్’ డిజిటల్ మీడియా ప్రచారాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా వీడియోలు, పోస్టర్ క్రియేటివ్‌లను విడుదల చేశారు. ప్రజలను తెలంగాణ పర్యాటక ప్రాంతాల సందర్శనకు ప్రోత్సహించడంతోపాటు వారి అనుభవాలను డిజిటల్ వేదికల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయడం ఈ కార్యక్రమం లక్ష్యంగా పెట్టుకుంది.తెలంగాణ పర్యాటక ప్రాంతాలను పరిచయం చేసే కాఫీ బుక్‌ను కూడా విడుదల చేశారు. రాష్ట్ర వారసత్వం, ప్రకృతి దృశ్యాలు, సంస్కృతి, పర్యాటక అనుభవాలను ఆకట్టుకునే చిత్రాలు, సమాచారంతో ఇందులో పొందుపరిచారు.
**జిల్లాల పర్యాటకానికి ప్రత్యేక స్టాళ్లు..**
తెలంగాణలోని పూర్వ జిల్లాల పరిధిలోని పర్యాటక ప్రాంతాలు, ఆకర్షణలు, అవకాశాలను పరిచయం చేస్తూ ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేశారు. హెరిటేజ్ తెలంగాణ శాఖ శిల్పాలు, రాష్ట్ర ఆర్ట్ గ్యాలరీ కళాకృతులు, చిత్రాలను ప్రదర్శించారు. పర్యాటక, ఆతిథ్య రంగాల్లో విద్య, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను పరిచయం చేస్తూ నిథమ్ ఆధ్వర్యంలో ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేశారు. పర్యాటక రంగంలో విశిష్ట సేవలు అందించిన వారికి ఎక్సలెన్స్ అవార్డులను ప్రదానం చేశారు. పర్యాటక రంగ ప్రోత్సాహానికి కృషి చేసిన మెదక్, ములుగు జిల్లాల కలెక్టర్లను సత్కరించారు. భద్రాచలంలో గిరిజన ఉత్పత్తుల విక్రయాలు, ప్రోత్సాహానికి ఏర్పాటు చేసిన ‘భద్రగిరి మార్ట్’ అభివృద్ధిలో కీలకంగా వ్యవహరించిన ఐటిడిఎ ప్రాజెక్టు అధికారిని కూడా సత్కరించారు.

# హెచ్‌సిఎ సభ్యత్వంపై వీడని సందేహాలు


బిసిసిఐ అంబుడ్స్‌మన్ ఆదేశంతో వెలుగులోకి వచ్చిన కీలక అంశాలు

217 మంది ఓటింగ్ సభ్యుల్లో 209 మంది హైదరాబాద్ కేంద్రంగానే ఉన్నారన్న ఫిర్యాదు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ)లో సభ్యత్వం, ఓటింగ్ హక్కులు, తెలంగాణలోని ఇతర జిల్లాలకు ప్రాతినిధ్యం వంటి అంశాలపై కొనసాగుతున్న వివాదానికి బిసిసిఐ అంబుడ్స్‌మన్ తాజా ఆదేశాలతో మరోసారి ప్రాధాన్యం వచ్చింది. అయితే హెచ్‌సిఎపై వచ్చిన ఆరోపణలు నిజమని కానీ, తప్పని కానీ అంబుడ్స్‌మన్ తేల్చలేదు. దర్యాప్తు కొనసాగుతుంది. వాటిని తగిన ఫోరమ్ చట్టప్రకారం పరిశీలిస్తుంది అని 26న ఇచ్చిన ఆదేశంలో స్పష్టంచేశారు. ఫిర్యాదులో ప్రధానంగా హెచ్‌సిఎ ఓటింగ్ సభ్యుల ప్రాతినిధ్యంపై ప్రశ్నలు లేవనెత్తారు. హెచ్‌సిఎలో మొత్తం 217 మంది ఓటింగ్ సభ్యులు ఉండగా, వారిలో 209 మంది హైదరాబాద్ నగరంలోని ప్రాంతాల్లోనే కేంద్రీకృతమై ఉన్నారని ఫిర్యాదుదారులు పేర్కొన్నారు. మిగిలిన ఎనిమిది మంది జిల్లాల పేర్లతో ఉన్నప్పటికి వారు కూడా హైదరాబాద్‌లోనే కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఈ వాదనను అంబుడ్స్‌మన్ ఆదేశంలో నమోదు చేశారు. అయితే అది వాస్తవమా? సభ్యత్వ నిబంధనలకు అనుగుణంగానే ఉందా? అనే అంశాలపై ఎలాంటి తుది నిర్ణయం ఇవ్వలేదు.

### జిల్లా క్రికెట్‌కు ప్రాతినిధ్యం ఎంత?

ఈ నేపథ్యంలో తెలంగాణలోని ఇతర జిల్లాల క్రికెట్ అభివృద్ధిపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రాష్ట్రంలో 33 జిల్లాలు ఏర్పడిన నేపథ్యంలో జిల్లా స్థాయి క్రీడాకారులకు అవకాశాలు, క్రికెట్ మైదానాలు, కోచింగ్, టోర్నమెంట్లు, సెలెక్షన్లు, మౌలిక వసతులు ఎంతవరకు అందుతున్నాయన్నది చర్చనీయాంశంగా మారింది. హెచ్‌సిఎ సభ్యత్వం, ఓటింగ్ వ్యవస్థ ఎక్కువగా హైదరాబాద్‌కే పరిమితమైతే.. రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాలకు క్రికెట్ పరిపాలనలో తగిన ప్రాతినిధ్యం ఎలా లభిస్తుందన్న ప్రశ్నకు స్పష్టత రావాల్సి ఉంది. హైదరాబాద్ వెలుపల క్రికెట్ అభివృద్ధికి ప్రత్యేక సంస్థాగత గుర్తింపు కల్పించాలన్న డిమాండ్లు కూడా ఈ సందర్భంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. హెచ్‌సిఎలోని ఇన్‌స్టిట్యూషనల్, రిక్రియేషనల్ క్లబ్బుల సభ్యత్వం, వాటికి ఉన్న ఓటింగ్ హక్కుల పైనా ఫిర్యాదులో ప్రశ్నలు లేవనెత్తారు. అయితే సంబంధిత క్లబ్బులను పూర్తిస్థాయిలో పక్షాలుగా చేర్చకుండా వారి సభ్యత్వం, ఓటింగ్ హక్కులపై తుది నిర్ణయం తీసుకోవడం సముచితం కాదని అంబుడ్స్‌మన్ పేర్కొన్నారు.అంటే.. ఆ క్లబ్బుల సభ్యత్వం చెల్లుబాటు అవుతుందని అంబుడ్స్‌మన్ చెప్పలేదు. అదే సమయంలో అవి చెల్లవని కూడా చెప్పలేదు. ఈ అంశాన్ని సంబంధిత ఫోరమ్ రికార్డులు, నిబంధనలు పరిశీలించి నిర్ణయించాల్సి ఉంటుంది.సభ్యత్వం ఎలా ఏర్పడింది? ఎవరికెంత ఓటింగ్ హక్కు ఉంది? క్లబ్బులకు ఏ ప్రాతిపదికన సభ్యత్వం ఇచ్చారు? తెలంగాణలోని ఇతర జిల్లాలకు ఎంత ప్రాతినిధ్యం ఉంది? వంటి ప్రశ్నలకు హెచ్‌సిఎ రాజ్యాంగం, బిసిసిఐ నిబంధనలు, సభ్యత్వ రికార్డులు, చారిత్రక పత్రాలు, సంబంధిత న్యాయ ఉత్తర్వుల ఆధారంగా సమాధానాలు రావాల్సి ఉంది.




# సిఎం సహాయనిధి నిరుపేదకు వరం



**ప్రజాపక్షం/యాచారం :** ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు వరమని మేడిపల్లి గ్రామ సర్పంచ్ ముచ్చర్ల సుగుణ సంపత్ అన్నారు. ఆదివారం గ్రామంలో పలువురికి సిఎం సహాయనిధి చెక్కులు అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి పని చేస్తుందన్నారు. మేడిపల్లి గ్రామానికి చెందిన సింధం నర్సింహ్మ, పోలమోని కళమ్మ, జక్కర్త వరమ్మ, ఆలంపల్లి మహేశ్, జంపాల రాములుకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోటే శ్రీశైలం, ఉప సర్పంచ్ దెంది మదుకర్‌రెడ్డి,కాంగ్రేస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కందుకూరి బాల్‌రాజ్,,ముచ్చర్ల ప్రకాశ్,అడాల శ్రీకాంత్,ఎరుకలి కృష్ణ, సింధం రవి తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఫార్మాసిటీ ఉద్యమ రైతుల ఆధ్వర్యంలో ప్రజాభవన్ ముట్టడి

**ప్రజాపక్షం/యాచారం :** ఫార్మాసిటీ రైతుల సమస్యలను పరిష్కరించడంలో ఇబ్రహీంపట్నం శాసన సభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ నేడు ఇబ్రహింపట్నంలో ఉన్న ప్రజా భవన్ ముట్టడిస్తున్నామని ఫార్మాసిటి ఉద్యమ నాయకులు తెలిపారు. అదివారం యాచారం మండల కేంద్రంలో ఫార్మా ఉద్యమ నాయకురాలు కవుల సరస్వతి, ఉద్యమ నాయకులు కానమోని గణేశ్, సందీప్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ఫార్మాసిటీ జిఒను తక్షణమే రద్దుచేయాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించే వరకు గ్రామాల్లో పనులను నిలుపు దల చేయాలని కోరారు. నిరసన కార్యక్రమంలో మేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి,కుర్మిద్ద గ్రామాలకు చెందిన రైతులు, వ్యవసాయ కూలీలు పాల్గొన్నారు.

# డాక్టర్ జావేద్‌కు తపాల బిళ్లతో ధృవపత్రం అందచేత



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** విద్యా, పరిశోధన, సాంకేతిక విజ్ఞానం, సమాజిక సేవా రైతు సంక్షేమ రచనా రంగాలలో విశేష కృషి చేస్తున్నా డాక్టర్ జావేద్‌కు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించిన గ్రిన్నీష్ రికార్డుతో ప్రపంచ రికార్డులలో భాగస్వామిగా నిలిచిన ఆయనకు ప్రత్యేక తపాల బిళ్లతో కూడిన ధృవపత్రం ఆదివారం నిర్వాహకులు అందచేశారు. ఈయన ప్రస్తుతం హైద్రాబాద్ నగరంలో బ్రిగ్ ఐసి ఎలక్ట్రానిక్స్ సమాచార ప్రసార విభాగంలో ఆచార్యులుగా విధులు నిర్వహిస్తు ఆహోర్నిషలు సేవలు అందిస్తున్నారు. జావేద్‌కు గిన్నీస్ బుక్‌లో చోటు లభించటం తో జయనగర్ కాలనీ వాసులు, కుటుంబసభ్యులు అభినందనలు తెలిపారు.

# బిఆర్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



**ప్రజాపక్ష/ఇబ్రహింపట్నం :** మండల పరిధిలో దండుమైలారం గ్రామంలో సాయి కీర్తనరెడ్డి లెగసీ ట్రస్ట్ నిర్వహణలో బిఆర్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిభిరానికి అనూహ్య స్పందన లభించింది. గ్రామంలో పయనీర్ ఆసుపత్రి సమక్షంలో నిర్వహించిన శిభిరాన్ని ఫౌండేషన్ చైర్మన్ బూడిద రాంరెడ్డి హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో మంగఐలేష్, మాజీ సర్పంచ్‌లు సిఎచ్ జగన్‌నాథ్, పిజగదీస్, సిఎచ్ రవీందర్, శ్రీనివాస్ రెడ్డి, లింగం, డాక్టర్లు, ప్రజలు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ రహిత దిశగా మందడుగు




**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** వనస్థలిపురం శ్రీభ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి వారి దేవాస్థానంలో భక్తుల ఆరోగ్యం, సౌకర్యం, పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం లక్ష్యంగా ఒక ఆదర్శప్రాయమైన సేవా కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో జరిగింది. ఆదివారం జాగృతి అభ్యుదయ సంఘం చైర్మన్ శ్రీ భావన శ్రీనివాస్ తమ కార్యవర్గ సభ్యులతో కలిసి దేవాస్థానంలో నిర్వహించే అన్న ప్రసాద వితరణకు 98 స్టీల్ ప్లేట్లు, 45 జ్యూట్ బ్యాగ్‌లు, 98 స్టీల్ గ్లాసులను విరాళంగా అందజేశారు. దేవుడికి సమర్పించే నైవేద్యం పవిత్రమైనది. అన్న ప్రసాదాన్ని అందించే విధానంలో కూడా పరిశుభ్రత ఆరోగ్యం, ప్రకృతి పరిరక్షణ ఉండాలని అనే గొప్ప ఆలోచనతో ఈ విరాళాన్ని అందించడం విశేషంగా నిలిచింది. దేవాస్థానం ప్రాంగణంలో హానికారక ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని పూర్తిగా నిషేధించి, ప్లాస్టిక్ రహిత దేవాలయంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని భవాన శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు కె.విజయ్‌కుమార్, భ్రమరాంబికా మల్లికార్జున స్వామి ఆలయ కమిటీ ధర్మకర్త అధ్యక్షుడు గాండ్ల అంజయ్య, అధ్యక్షులు ఉప్పు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి ఆర్.పురుషోత్తం, ఎ. రామిరెడ్డి, బి. నరేందర్, శ్రీనయ్య, మహేష్, దిలీప్ రాజన్, సత్యమూర్తి, వీరేశలింగం, మోహన్ వంశీ, శ్రీరంగనాథ్, యాదా రామలింగేశ్వరరావు, ప్రియాంక, ఓబులేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ కేసులో ముగ్గురు అరెస్ట్

**ప్రజాపక్షం/ యాచారం:** గంజాయి సరఫరా చేస్తున్నా ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసిన సంఘటన ప్యూచర్ సీటి పరిధిలో యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది.ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు సిఐ నందీశ్వర్ రెడ్డి తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.యాచారం మండల కేంద్రంలో ఎంఆర్ఓ ఆఫీస్ సమీపంలో ఓ ఫాంహౌజ్‌లో గోవా ప్రాంతానికి చెందిన వ్యక్తులు గంజాయి సేవిస్తున్నారనే అనుమానం పర్యటించి తనిఖీ చేయగా సామాల వికాష్ రెడ్డి(29),గిర్కటి బానుప్రసాద్‌గౌడ్,దినేష్ కుమార్‌లను అదుపులోనికి తీసుకొని విచారించగా వారి వద్ద నుండి ఎండిఎంఎ (ఎస్కేటస్సీ)డ్రగ్స్‌ను,మూడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకొన్నట్లు తెలిపారు.ఈ సంఘటనపై కేసునమోదు చేసుకొని దర్యాప్తూ జరుపుతున్నట్లు సిఐ తెలిపారు.

# ఒహెచ్‌ఇలో సాంకేతిక లోపంతో పలు రైళ్లు తాత్కాలికంగా నిలిపివేత

శాతవాహన ఎక్స్‌ప్రెస్ క్లియర్.. డీజిల్ ఇంజిన్‌తో పాలనాడు ఎక్స్‌ప్రెస్ తరలింపు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మౌలాలి రైల్వే స్టేషన్ సమీపంలో ఓవర్‌హెడ్ ఎక్విప్‌మెంట్ (ఒహెచ్‌ఇ)లో సాంకేతిక లోపం తలెత్తడంతో పలు రైళ్ల రాకపోకలకు తాత్కాలికంగా అంతరాయం ఏర్పడింది. దీంతో కొన్ని రైళ్లను మార్గమధ్యంలో నియంత్రించి నిలిపివేయాల్సి వచ్చింది. సాతవాహన ఎక్స్‌ప్రెస్‌ను అనంతరం క్లియర్ చేశారు. మౌలాలి స్టేషన్‌లో నిలిచిపోయిన పాలనాడు ఎక్స్‌ప్రెస్‌ను డీజిల్ ఇంజిన్ సాయంతో తరలించారు. లోపాన్ని సరిచేసేందుకు రైల్వే అధికారులు యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టారు. వీలైనంత త్వరగా పనులు పూర్తిచేసి రైళ్ల రాకపోకలను సాధారణ స్థితికి తీసుకురావడానికి చర్యలు కొనసాగుతున్నాయి.

ఇదిలా ఉండగా 17659 సికింద్రాబాద్–భద్రాచలం రోడ్ కాకతీయ ఎక్స్‌ప్రెస్‌ను మల్కాజిగిరి మార్గం మీదుగా నడపాలని రైల్వే అధికారులు నిర్ణయించారు. దీంతో ఈ రైలు మౌలాలి స్టేషన్‌లో నిర్ణీత హాల్ట్‌ను తాత్కాలికంగా దాటివెళ్లనుంది. సాంకేతిక లోపం పరిష్కారం, రైళ్ల రాకపోకల్లో మార్పులకు సంబంధించి తదుపరి సమాచారం అందుబాటులోకి వచ్చిన వెంటనే తెలియజేస్తామని దక్షిణ మధ్య రైల్వే అధికారులు వెల్లడించారు.

# ప్రశాంతంగా గణేష్ నిమజ్జనాలు

టి.వినయ్ కృష్ణారెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గణేష్ నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా, సాఫీగా, ఎలాంటి అవాంతరాలు లేకుండా విజయవంతంగా పూర్తయ్యాయని ఎంఎంసి కమిషనర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి తెలిపారు. నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన ప్రజలకు, గణేష్ ఉత్సవ సమితి సభ్యులకు ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. గణేష్ నిమజ్జన ఏర్పాట్ల కోసం ఎంఎంసీ అధికారులు, సిబ్బంది 24 గంటలు షిఫ్ట్‌ల వారీగా నిరంతరం విధులు నిర్వహించారన్నారు. నిమజ్జన రూట్లు, కేంద్రాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సుమారు 10వేల తాత్కాలిక విద్యుత్ లైట్లను ఏర్పాటు చేసి, రాత్రి వేళల్లో కూడా తగినంత వెలుతురు ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. 134 క్రేన్లను ఏర్పాటు చేశామని, నిమజ్జన కేంద్రాల వద్ద 64 ప్రత్యేక మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేశామని వివరించారు. నిమజ్జన సమయంలో భారీగా వ్యర్థాలు ఉత్పత్తి అయినప్పటికీ, పారిశుద్ధ్య సిబ్బంది నిరంతర పర్యవేక్షణతో నిమజ్జన కేంద్రాలు, రూట్లలో పరిశుభ్రతను కొనసాగించారని, 1,356 మంది పారిశుద్ధ్య సిబ్బంది షిఫ్టుల పద్ధతిలో 24గంటల పాటు విధులు నిర్వహించారన్నారు. సాధారణ రోజుల్లో వెలువడే వ్యర్థాలతో పోలిస్తే నిమజ్జన సమయంలో అదనంగా సుమారు 1,350 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు ఉత్పత్తి అయినప్పటికీ, వాటిని సకాలంలో సేకరించి తరలించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు కమిషనర్ వివరించారు. 39 నిమజ్జన కేంద్రాల్లో చిన్నా, పెద్దా విగ్రహాలు కలిపి 70 వేలకు పైగా గణేష్ విగ్రహాలు నిమజ్జనం జరిగినట్లు వివరించారు.

# ఎన్నికల కమిషనర్ 'జ్ఞానేశ్'ను తొలగించాలి




సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారీ

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను వెంటనే ఆ బాధ్యతల నుంచి తప్పించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్ర చారి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్ భాగంగా దేశ పౌరుల ఓట్లు తొలగించే విషయంలో ఆయనతో పాటుగా ఉన్న ఇద్దరు కమిషనర్ల అభిప్రాయా అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా మొండి వైఖరితో రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా వ్యవహరించిన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ను ఆ పదవి నుంచి తొలగించాలని సిపిఐ అబ్దుల్లాపూర్మెట్ మండల సమితి ఆధ్వర్యంలో మండల కార్యదర్శి అజ్మీర హరిసింగ్ నాయక్ అధ్యక్షతన ఆదివారం పెద్ద అంబర్పేట డివిజన్ కేంద్రంలోని కళ్లెం బాల్ రెడ్డి గార్డెన్ నుండి చౌరస్తాలోని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వరకు నల్ల జెండాలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఆందోజు రవీంద్రచారి, రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాదిరెడ్డి హాజరయ్యారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి రవీంద్ర చారి మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ రాజ్యాంగ బద్ధంగా, స్వయం ప్రతిపత్తి కలిగిన వ్యవస్థని అది ఎలాంటి రాజకీయ ప్రలోభాలకు లొంగకుండా రాజ్యాంగబద్ధంగా,చట్టబద్ధంగా వ్యవహరించాల్సింది మరిచి ప్రధాన కమిషనర్ అయిన జ్ఞానేష్ కుమార్ బిజెపికి, ఆర్ఎస్ఎస్ కి ఏజెంట్ గా వ్యవహరిస్తూ రాజ్యాంగానికి తూట్లు పొడిచాడని మండిపడ్డారు. దేశ పౌరుల ఓటుని తొలగించే విషయంలో తోటి కమిషనర్ల అభ్యంతరాలను పట్టించుకోకుండా మెజారిటీ అభిప్రాయాన్ని గౌరవించకుండా కేంద్ర ప్రభుత్వానికి బంటుగా మోడీ కనుసన్నల్లో పనిచేస్తూ 12 కోట్ల దేశ పౌరుల ఓట్లని తొలగించడం అప్రజాస్వామికమని అన్నారు.వెంటనే తొలగించిన ఓట్లని ఓటరు జాబితాలో చేర్చాలని అన్నారు.కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకమైన పార్లమెంటు సమావేశం నిర్వహించి భారత ఎన్నికల ప్రధాన కమిషనర్ బాధ్యత నుండి జ్ఞానేష్ కుమార్ ను తొలగించడం కొరకు తీర్మానం చేసి రాష్ట్రపతికి ఉత్తర్వులు పంపాలని డిమాండ్ చేశారు.లేకపోతే భారత ఎన్నికల సంఘం పైన దేశ ప్రజలు పూర్తిగా విశ్వాసాన్ని కోల్పోతారని హెచ్చరించారు. ముత్యాల యాదిరెడ్డి మాట్లాడుతూ నల్లధనం పేరుతో దేశ ప్రధాని నరేంద్ర మోడీ నోట్లని దొంగతనం చేస్తే ఎస్ఐఆర్ పేరుతో జ్ఞానేశ్ కుమార్ ఓట్లని దొంగిలించి బీజేపీ కి మేలు చేస్తూ రాజ్యాంగానికి తూట్లు పొడిచాడని అన్నారు. సుప్రీం కోర్టు తో పాటుగా స్వయం ప్రతిపత్తి కలిగిన ఎన్నికల కమిషన్ రాజ్యాంగనికి కట్టుబడి నడుచుకోవాలని లేకపోతే దేశ ప్రజలు ఈ వ్యవస్థలపైన నమ్మకం కోల్పోయే ప్రమాదం ఉందని అన్నారు.జ్ఞానేశ్ కుమార్ ఏకపక్ష నిర్ణయాలను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్నాయని అవి మరింత ఉధృతం కాకముందే ఆ పదవిలో నుండి జ్ఞానేశ్ కుమార్ ను తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్,మెట్టు మండల సహాయ కార్యదర్శి కేతరాజు నర్సింహా,బిఓసి జిల్లా కార్యదర్శి దాసరి ప్రసాద్,మండల కార్యవర్గ సభ్యులు పొన్నాల యాదగిరి,చిర్ర శేఖర్,కాటి అరుణ, వట్టి నవనీత, పేరాల గోపి, భూక్యా వినోద్ నాయక్, అలివేల, సుజాత, ప్రజా,విద్యార్థి, యువజన, కార్మిక,మహిళ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



# తెలంగాణ ఉద్యమంలో కొండా లక్ష్మణ్ పోషించిన పాత్ర చిరస్మరణీయం

రంగారెడ్డి జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి బి కేషరామ్

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** తెలంగాణ ఉద్యమంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ పోషించిన పాత్ర, ప్రజాసేవ పట్ల ఆయనకున్న నిబద్ధత, సామాజిక సమానత్వం కోసం చేసిన కృషి చిరస్మరణీయమని రంగారెడ్డి జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి బి కేషరామ్ అన్నారు. ఆదివారం సమీకృత రంగారెడ్డి జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కార్యాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని జిల్లా బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా బిసి సంక్షేమ అధికారి కేష రామ్ జ్యోతి ప్రజ్వలన చేసి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సమాజం కోసం ఆయన చేసిన సేవలు,ప్రజా సమస్యలపై ఆయన పోరాట స్ఫూర్తి నేటితరానికి ఆదర్శంగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారులు, సంక్షేమ శాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇమ్మడి సతీష్‌కు 'డాక్టరేట్ 'ప్రదానం

**ప్రజాపక్షం /హైదరాబాద్ :** తెలంగాణ యువత రాష్ట్ర అధ్యక్షులు ఇమ్మడి సతీశ్‌కు ఏసియా ఇంటర్నేషనల్ కల్చర్ అండ్ రీసెర్చ్ యూనివర్సిటీ నుంచి విశేష గౌరవం లభించింది. ఆయన సేవలకు గుర్తింపుగా ఇటీవల బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో సతీశ్‌కు ఈ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ అందజేసింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు ప్రసంగిస్తూ ఇమ్మడి సతీశ్ చేసిన విశిష్ట సేవల కృషిని ప్రశంసించారు. అనంతరం 'స్మారక అవార్డు', మెడల్‌ను అందజేశారు. అవార్డు ప్రదానం సందర్భంగా సతీశ్ ప్రసంగిస్తూ తాను అందించిన సేవల కృషిని గుర్తించి ఏసియా ఇంటర్నేషనల్ కల్చర్ అండ్ రీసెర్చ్ యూనివర్సిటీ ఈ అవార్డు ప్రదానం చేయడం పట్ల సంతోషం వ్యక్తంచేశారు. ఈ గుర్తింపు సాధించడం పట్ల సతీష్ మిత్రులు, కుటుంబ సభ్యులు, పలువురు రాజకీయ, విద్యావేత్తలు హర్షం వ్యక్తం చేశారు

# ఫార్మాసిటీని ఫ్యూచర్ సిటీగా మార్చడం చెల్లదు

ఉన్న సిటీలో దోమలు కొట్లాడుతుంటే నివారించలేని రేవంత్‌రెడ్డి .. ఫ్యూచర్ సిటీ నిర్మిస్తారంట

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కెటిఆర్ ఎద్దేవా





**ప్రజాపక్షం/రంగారెడ్డి:** "అది ఫ్యూచర్ సిటీ కాదు.. ఫార్మాసిటీయే. ఉన్న సిటీలో దోమలు కొట్లాడుతుంటే.. నివారించలేని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫ్యూచర్ సిటీ నిర్మిస్తారంటూ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కెటిఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ఫార్మాసిటీని ఫ్యూచర్ సిటీగా మార్చడం చెల్లదని వ్యాఖ్యానించారు. రాజేంద్రనగర్ నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు బిఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఆదివారం శంషాబాద్‌లోని రంగారెడ్డి జిల్లా బిఆర్ఎస్ కార్యాలయంలో రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కెటిఆర్, మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో పలువురు కాంగ్రెస్ నాయకులు గులాబీ కండువా కప్పుకున్నారు. మణికొండ, పుప్పాలగూడ ప్రాంతాలకు చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు బిఆర్ఎస్‌లో చేరడం నియోజకవర్గ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. మాజీ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బి.సాయిరెడ్డి, మాజీ ఎంపిటిసి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బి.రాజు, మణికొండ మాజీ సర్పంచ్ యాలాల నరేష్, పుప్పాలగూడ మాజీ ఎంపిటిసి పాపాలాల్ సింగ్, మాజీ సర్పంచ్ జైహింద్‌రావు, మణికొండ కౌన్సిలర్ యాలాల లావణ్య తదితరులు బిఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావస్తున్నా పేదల ఇళ్ల నిర్మాణంలో ఒక్క ఇటుక కూడా వేయలేదని కెటిఆర్ ఆరోపించారు. మరోవైపు పేద, మధ్యతరగతి ప్రజల ఇళ్లను హైడ్రా పేరుతో కూల్చివేస్తున్నారని విమర్శించారు. అక్రమ నిర్మాణాల ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికార పార్టీ నాయకులు, మంత్రుల ఫామ్ హౌస్‌లు, భవనాలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణపై దృష్టి పెట్టాలని, సాంస్కృతిక కార్యక్రమాలకు సంబంధించిన అంశాల్లో అనవసర జోక్యం వద్దని సూచించారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డితో పాటు బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## ఘనంగా కొండలక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు

**ప్రజాపక్షం/వికారాబాద్ :** తెలంగాణ ఉద్యమ యోధుడు, స్వాతంత్ర్య సమరయోధుడు కొండలక్ష్మ ణ్ బాపూజీ జయంతి వేడుకలను వికారాబాద్ కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగాఅద నపు కలెక్టర్ ఉమశంకర్ ప్రసాద్ అయన చిత్రపటానికిపూలమల వేశారు అనంతరం అయన చేసిన సేవలనుగుర్తు చేశారు. ముఖ్యంగా తెలంగాణ ప్రజల హక్కుల కోసం, సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాడారని అదనపు కలెక్టర్ అన్నారు. బాపూజీఅశయాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రజా సంక్షేమం, సామాజిక అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిసి వెల్ఫేర్ అధికారి మాధవరెడ్డి , అద నపు డిఆర్‌డిఓ సత్తయ్య, తదితరులు పాల్గోన్నారు.

**చర్లపల్లిలోని పద్మశాలి టౌన్‌షిప్‌లో...**

**చర్లపల్లి :** ఆచార్య కొండా లక్ష్మ ణ్ బాపూజీ 11వ జయంతిని పురస్కరించు కుని సొసైటీ సభ్యులు పద్మశాలి టౌన్ షిప్ కాలనీవాసులు బాపూజీ విగ్రహా నికి సొసైటీ అధ్యక్షులు సీత ఆంజనేయులు,సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.జయంతి అనంతరం సొసైటీ సర్వ సభ్య మహాజన సభ దేవాలయ ప్రాంగణంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ టౌన్‌షిప్‌కు సంబంధిచిన అన్ని అభివద్ధి పనులు జరగాలంటే సొసై టీలో ప్లాటు పొందిన సభ్యులందరూ బెటర్‌మెంట్ చార్జీలు చెల్లించా లని,చెల్లించని ప్లాటుపై కోర్టులో పిటిషన్ వేసి ప్లాటు ప్లాటు రిజిస్ట్రేషన్ క్యాన్సల్ చేయుటకు తీర్మానం ప్రవేశ పెట్టాలని తెలిపారు.ఈ కార్యక్ర మంలో సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## రాయచూర్ వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించిన చైర్మన్

**ప్రజాపక్షం/వికారాబాద్ :** వ్యవసాయ మార్కెట్ కమిటీ స్టడీ టూర్‌లో భాగంగాకర్ణాటక రాష్టంలోని రాయచూర్ జిల్లా వ్యవసాయ మార్కెట్ యార్డు ను వికారాబాద్ మార్కెట్ కమిటి చైర్మన్ శ్రీనివాస్ ముదిరాజ్ ,పాల కవర్గం సభ్యులు ఈసందర్భంగా రాయచూర్ మార్కెట్ యార్డులో కొనసా గుతున్న వ్యవసాయ మార్కెట్ కార్యక్రమలను రైతులకు అందుతున్న సౌక ర్యాలు ,పంటలకొనుగోలు ,అమ్మకాలు మార్కెట్ కమిటి నిర్వహణ విదానా లను పరిశీలించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు గిట్టు బాటు ధరలు లభించేలా మార్కెట్ కమిటీలు సమర్థవంతంగా పనిచేయ ల్సిన అవసరం ఉందన్నారు. రైతులకు మెరుగైర సేవలు అందించేందుకు ఉపయోగపడే అంశాలనుతెలుసపుకోవడం జరిగిందనితెలిపారు. ఈకార్య క్రమంలో వైస్ చైర్మన్ మల్లేశం ,విజేందర్‌రెడ్డి తదితరులు పాల్గోన్నారు.



## 2.5వేలు పలికిన పోచారం గణపతి లడ్డూ

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** పోచారం డివిజన్ పోచారం గ్రామంలోని వినా యక మహా లడ్డూ వేలం భక్తుల్లో ప్రత్యేక ఉత్సాహాన్ని నింపడంతో పాటు స్థానికంగా హాట్ టాఫిక్‌గా మారింది. హనుమాన్ యూత్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుడి మహా లడ్డూకు నిర్వహించిన వేలంలో 2.5 వేలు ధర పలికింది. మెట్టు నర్సింహా రెడ్డి వేలంలో మహా లడ్డూను దక్కించుకున్నారు. వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు.వేలంలో భక్తులు ఉత్సాహంగా పాల్గొనడంతో సందడి నెలకొంది.చివ రకు 2,5వేలకు మహా లడ్డూను మెట్టు నర్సింహా రెడ్డి సొతం చేసుకోవడంతో కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగానిలిచింది. దక్కించుకున్న మెట్టు నర్సింహారె డ్డికి గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్ర మంలో నాయకులు మెట్టు మహేందర్ రెడ్డి,మాజీ ఉపసర్పంచ్ ఆకిటి బాల్ రెడ్డి,కాంగ్రెస్ సీనియర్ నాయకులు బద్దం శ్రీనివాస్ రెడ్డి,ఆకిటి సుధీర్ రెడ్డి,మెట్టు తిరుమల రెడ్డి,సామల సత్తిరెడ్డి,అముదాల మహేష్ గౌడ్,యూత్ సభ్యులు పాల్గొన్నారు.



## క్రాంతి కాలనీలో గణేష్ లడ్డూ కైవసం చేసుకున్న మాజీ మేయర్ స్రవంతి

**ప్రజాపక్షం/బోడుప్పల్ :** గణేష్ నవరాత్రుల ఉత్సవాల్లో సందర్భంగా చెంగిచెర్ల డివిజన్ క్రాంతి కాలనీలో ఏర్పాటు చేసిన మండపంలో నిర్వహిం చిన లడ్డూ వేలం పాటలో మాజీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్ రూ. 5 లక్షలకు లడ్డు దక్కించుకొన్నారు. నిర్వాహకులైన కాలనీ గణేష్ ఉత్సవ కమిటి ఆధ్వర్యంలో పోటాపోటీగా జరిగిన వేలంపాటలో కైవసం చేసు కొన్న స్రవంతి దంపతులు అత్యంత భక్తి శ్రద్ధలతో వేలాది మంది భక్తుల పూజలందుకొన్న గణేషుని లడ్డు పొందటం అదృష్టంగా భావిస్తున్నామని, ఆయన ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో ఆనందంగా గడపా లని ఆకాంక్షిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బింగి జంగయ్య యాదవ్, కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# నాణ్యమైన ప్రభుత్వ విద్య ప్రతి కుటుంబం హక్కు

మాజీ ఐఎఎస్ ఆకునూరి మురళి

ఫీజుల భారాన్ని తగ్గించాలి.. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి

గబ్బిలాల పేటలో ప్రభుత్వ స్కూలు నిర్మించాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వివిఎస్.బోస్

సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్



**ప్రజాపక్షం/జవహర్‌నగర్ :** జవహర్‌నగర్ పరిధిలోని గబ్బిలాల పేటలో తెలంగాణ పీపుల్స్ ఫ్రంట్ ఆధ్వర్యంలో గబ్బిలాల పేట స్కూల్ నిర్మాణంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఐఎఎస్ ఆకు నూరి మురళి మాట్లాడుతూ, తెలంగాణలో తీవ్ర సంక్షోభంలో ఉన్న విద్యా వ్యవస్థను రక్షించుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలంగాణ పీపుల్స్ ఫ్రంట్ (టిపిఫ్) డిమాండ్ చేస్తుందని, అనియంత్రిత ప్రైవేట్ పాఠశాలల ఫీజులు, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కొరత వల్ల దాదాపు 40 లక్షల కుటుంబాలు ఆర్థిక భారాన్ని మోస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో 63 మంది విద్యార్థులు ప్రైవేట్, 37 మంది మాత్రమే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతు న్నారని మురళి పేర్కొన్నారు. ఉపాధ్యాయుల కొరత, వసతులు లేకపో వడం వల్ల 2,245 పాఠశాలలు మూతపడగా, 5,001 పాఠశాలలు ఒకే ఉపాధ్యాయుడితో నడుస్తున్నాయని యూడిఐ ఎస్ఇ గణాంకాలను ఉటం కించిందని తెలిపారు.

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వివిఎస్.బోస్ సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ మాట్లాడుతూ తెలంగాణ పీపుల్స్ ఫ్రంట్ ప్రభుత్వ పాఠశాల సాధన కోసం చేస్తున్న పోరాటంలో భాగంగా సిపిఐ పార్టీ భాగస్వామ్యం అవుతుందని సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్ర మంలో మాజీ ఐఎఎస్ ఎంవీ రెడ్డి, మాజీ ఐఎఎస్ ఎం చంపాలాల్, సృజన యాదవ్, షేక్షావలి, సిపిఐ, సిపిఎం నాయకులు గబ్బిలాల పేట కాలనీ ప్రజలు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# గ్రామాలే పార్టీకి పట్టుగొమ్మలు


సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించండి

తాండూరు ఎంఎల్ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి

**ప్రజాపక్షం/తాండూరు :** గ్రామాలే పార్టీకి పట్టు కొమ్మలని, గ్రామీణ స్థాయి నుండి ఢిల్లీ వరకు పార్టీని బలోపేతం చేయాల్సిన బాధ్యత పార్టీ కార్యకర్తలపై ఉందని తాండూరు ఎంఎ ల్ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. ఆది వారం మండల పరిధి మారేపల్లి గేటు సమీపం లోని సుమిత్ర కాటన్ మిల్‌లో మండల పార్టీ అధ్యక్షులు మహిపాల్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన పెద్దేముల్ మండల కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశానికి ఎంఎల్ఎ మనోహర్‌రెడ్డి, డిసిసి అధ్యక్షులు ధారాసింగ్‌లు ముఖ్యఅతిథులుగా హాజరైనారు. అనంతరం ఎంఎల్ఎ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ నూతనంగా నియమించిన అన్ని గ్రామాల కమీటిల అధ్యక్షులకు శుభాకాంక్షలు తెలియజే శారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకా లను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత గ్రామ కమీటిలపై ఉందన్నారు. ప్రతిపక్షాలు ప్రభు త్వంపై చేస్తున్న తప్పుడు ప్రచారాలని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఎక్కడికక్కడ తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

గత పదేళ్ల అధికారంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ గ్రామాలలో ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ఇచ్చిన పాపన పోలేదని, కనీసం నిరుపేదలకు రేషన్ కార్డులు ఇవ్వలేని దద్దమలని తీవ్రంగా మండిపడ్డారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను సూచి ఓర్వలేకనే లేని పోని అబండరాలను వేస్తు న్నారని, అర్హులైన ప్రతి నిరుపేదకు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులతో పాటు సంక్షేమ పథకా లను అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీదన్నారు. పార్టీకి నాయకులు ఎంత ముఖ్యమో ఆ పార్టీకి కార్యకర్తలు అంతకంటే ముఖ్యమైన బలం అన్నారు. కార్యకర్తలు పదవిలో సంబందం లేకుండా ప్రజలతో మంచి సంబందాలు ఏర్పాటు చేసుకోవాలని అప్పుడు వారికి ప్రజల్లో ఆదరణ ఉంటుందన్నారు.

ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు ధారా సింగ్, సర్ కన్వీనర్ కరణం పురుషోత్తమరావు, డిసిసిబి మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, సీనియర్ నాయకులు నారాయణరెడ్డి,కొమ్ము గోపాల్‌రెడ్డి, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ మురళీగౌడ్, మాజీ మండల పార్టీ అధ్యక్షులు గోపాల్, ఎల్లా రెడ్డి, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు నారాయణగౌడ్,గౌరవ అధ్యక్షులు కుమార్ సేట్, కార్యదర్శులు బాలు యాదవ్, తట్టేపల్లి నర్సిములు,వైస్ చైర్మన్ జగన్, జిల్లా మహిళ నాయకురాలు శోభరాణి, మధులత, స్థానిక సర్పంచ్ స్వరూప, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలి

మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు దోసకాయల వెంకటేష్

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేసి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని మూడుచింతలపల్లి మున్సి పల్ కాంగ్రెస్ అధ్యక్షుడు దోసకాయల వెంకటేష్ అన్నారు. ఆదివారం మూడుచింతలపల్లి మున్సిపల్‌లో డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యా దవ్ ఆదేశాలతో మున్సిపల్ అధ్యక్షుడు దోసకాయల వెంకటేష్ ఆధ్వ ర్యంలో 1వ వార్డు కాంగ్రెస్ కమిటిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అనంతారం 1వ వార్డు కార్యాలయం అధ్యక్షుడుగా మెరుగు గురువారెడ్డి, ప్రధాన కార్యదర్శి గురువయ్య, కోశాధికారి ఆకుల రాజు, ఉపాధ్యక్షులు భూపాల్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బిసి సెల్ అధ్యక్షులుగా ఐలయ్య యాదవ్, యువజన కమిటి అధ్యక్షుడుగా బుద్ధి నాగరాజు, మహిళా కమిటి అధ్యక్షురాలుగా పల్లి వెంకటలక్ష్మి , ఎస్‌సి సెల్ అధ్యక్షు డుగా గురువయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ ముద్దం పాపిరెడ్డి, మాజి వైస్ ఎంపిపి మంద శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బండి జగన్నాదం, గురువయ్య, బాలకృష్ణ, శశిధ ర్‌రెడ్డి, వీరేశంగుప్త, బస్వారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఎన్ఎస్‌యుఐ

**ప్రజాపక్షం/వికారాబాద్ :** నూతనంగా వికారాబాద్ జిల్లా ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడిగాఎన్నికైన సందర్భంగా శ్రీకాంత్‌నాయక్ వికారాబాద్ పట్టణంలోని ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌస్‌లోమీడియా సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగాఅయన మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరి ష్కారానికి ,విద్యారుథలహక్కుల పరిరక్షణకు నింతరం కృషి చేస్తానని ,జిల్లాలో విద్యార్థులు ఎదుర్కోంటున్న సమస్యలను సంబంధింత అధికా రుల దృష్టికి తీసుకెళ్లి ,వాటి పరిష్కారానికి కృషి చేస్తామనితెలిపారు. ఎన్ ఎస్‌యుఐ బలోపేతానికి,విద్యార్థుల సంక్షేమానికి నాయకులు ,కర్యకర్తల సహకారంతో ముందుకు సాగుతామన్నారు. ఈకార్యక్రమంలో విద్యా ర్థులు పాల్గోన్నారు.



## కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి

**ప్రజాపక్షం/జవహర్‌నగర్ :** జవహర్ నగర్, అంబేద్కర్ నగర్ ప్రాంతంలో శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి డాక్టర్ యాదగిరి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ యాదగిరి మాట్లాడుతూ, 'స్వాతంత్ర్య సమరయోధుడు, సాయుధ పోరాట స్ఫూర్తి, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు దిక్సూచిగా నిలిచిన శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ గారి త్యాగం, స్థైర్యం చిరస్మరణీయం. ఆయన ప్రజాసేవకు, పోరాటాలకు గుర్తుగా ప్రభుత్వం శ్రీ కొండా లక్ష్మణ్ తెలం గాణ ఉద్యాన విశ్వవిద్యాలయం" ఏర్పాటు చేయడం ఆయనకు లభించిన తగిన గౌరవానికి నిదర్శనం అని అన్నారు. పోరాట స్ఫూర్తికి, ప్రజాసేవా నిబద్ధతకు ప్రతీకగా నిలిచి, భావితరాలకు మార్గదర్శకంగా నిలిచిన ఆ మహనీయుని బాటలో నేటి యువత నడవాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో వెంకన్న, చంద్రమౌళి, శ్రీధర్, కటికం శ్రీనివాస్, మల్లేష్, శ్రీధర్, పవన్,భాను, కుమార్, వెంకటేష్, సీత కాళిదాసు, తదితరులు పాల్గొన్నారు.

## సేవే లక్ష్యం : డా.మల్లేష్ 30 ఏళ్ల ప్రస్థానం

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** యువతలో సూవాభావం,నాయకత్వం సామా జిక బాధ్యత పెంపొందించడంలో డా.సి.మల్లేష్ మూడు దశాబ్దాలుగా విశేష సేవలందిస్తున్నారు.అనురాగ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్ జాతీ యసేవా పథకం విభాగం కార్యక్రమ సమన్వయకర్తగా ఉన్న ఆయన 1996లో స్వచ్ఛంద కార్యకర్తగా ప్రారంభించిన ప్రస్థానం 30 ఏళ్లకు చేరు కుంది.ఈ సేవా ప్రయాణంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉత్తమ స్వచ్ఛంద కార్యకర్త బంగారు పతకం,ఇందిరాగాంధీ జాతీయ సేవా పథకం పురస్కారం.రాష్ట్ర ఉత్తమ కార్యక్రమ అధికారి జాతీయ ఉత్తమ కార్యక్రమ అధికారి పురస్కారాల కంటే సమాజ సేవే తనకు గొప్ప సాధన అని డా.సి.మల్లేష్ తెలిపారు. యువతను సేవా మార్గంలో తీర్చిదిద్దడమే తన లక్ష్యమని పేర్కొన్నారు.

ఎడ్యుస్కిల్స్ కనెక్ట్- 2026 ఎంఎల్ఆర్ఐటి

# 13 జాతీయ స్థాయి గుర్తింపులు

బెస్ట్ క్యాంపస్ ప్లేస్‌మెంట్ ఇన్‌స్టిట్యూషన్ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్న తెలంగాణలో ఏకైక సంస్థగా ఎంఎల్ఆర్ఐటిఎస్ఎం



**ప్రజాపక్షం/దుండిగల్ :** దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్ రెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఎడ్యుస్కిల్స్ కనెక్ట్ 2026లో వివిధ విభాగాల్లో 13 జాతీయ స్థాయి గుర్తింపులు సాధించి మరో ప్రతిష్ఠాత్మక మైలురాయిని చేరు కుందనీ సెప్టెంబర్ 25, 26 తేదీల్లో రాజస్థాన్ లోని జైపూర్ మ్యారియట్ హోటల్‌లో ఈ కార్య క్రమం జరిగింది. ఎడ్యుస్కిల్స్ కనెక్ట్ 2026 అధి కారిక సమాచారం ప్రకారం, ఈ జాతీయ సదస్సు అకాడెమియా, పరిశ్రమ, ప్రభుత్వం మరియు టెక్నాలజీ రంగాలను ఒకే వేదికపైకి తీసుకువచ్చిందనీ అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వాలెడిక్టరీ కార్యక్రమానికి డా॥ రామ్‌దాస్ అథావలే, కేంద్ర సామాజిక న్యాయం మరియు సాధికారత శాఖ సహాయ మంత్రి, భారత ప్రభుత్వం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వారి చేతుల మీదుగా ఈ అవా ర్డులను ప్రధానం చేయడం సాధించిన గుర్తిం పులు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్, ఇంటర్న్‌షిప్స్, సంస్థాగత నాయకత్వం, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మే షన్, ఏఐ స్కిల్లింగ్, పరిశ్రమల అనుసంధానం, ప్రొఫషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ మరియు సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ వంటి విభాగాల్లో సంస్థ చేస్తున్న కృషికి గుర్తింపుగా నిలిచాయనీ బెస్ట్ క్యాంపస్ ప్లేస్‌మెంట్ ఇన్‌స్టిట్యూషన్ ఎక్సలెన్స్ అవార్డు. ఈ జాతీయ స్థాయి గుర్తింపును అందు కున్న తెలంగాణలో ఏకైక సంస్థగా నిలిచిందనీ అన్నారు. విద్యార్థుల ఉపాధి అవకాశాలు, కెరీర్ ప్రిపరేషన్, పరిశ్రమల అనుసంధానం, ప్లేస్‌మెంట్ ఆధారిత నైపుణ్యాభివృద్ధికి సంస్థ అందిస్తున్న ప్రాధాన్యతకు ఈ అవార్డు గుర్తిం పుగా నిలిచిందని అన్నారు. డైరెక్టర్ ఎక్సలెన్స్ అవార్డు డైరెక్టర్ డా॥ పి.శ్రీధర్ డైరెక్టర్ ఎక్సలెన్స్ అవార్డు 2026 అందుకున్నారు. ఈ సంద ర్భంగా డా॥ పి.శ్రీధర్ మాట్లాడుతూ, ఈ 13 జాతీయ స్థాయి గుర్తింపులు యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు మరియు పరిశ్రమ భాగస్వాముల సమిష్టి కృషికి నిదర్శనం. 1 మిలి యన్ ఇంటర్న్‌షిప్ మైలురాయి విద్యార్థులకు పరిశ్రమ అనుభవం మరియు కెరీర్ అవకాశా లను అందించడంలో మా నిరంతర కృషిని ప్రతి బింబిస్తోందనీ అన్నారు.



## జ్ఞానేష్‌కుమార్‌ను పదవి నుండి తొలగించాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వివిఎస్ బోస్

**ప్రజాపక్షం/కాప్రా :** ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్‌కుమార్‌ను వెంటనే పదవి నుండి తొలగించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్య దర్శి వర్గ సభ్యులు వివిఎస్ బోస్ డిమాండ్ చేసారు. ఆదివారం ఈసిఐఎల్ అంబే డ్కర్ కూడలి వద్ద సిపిఐ ఉప్పల్ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో సిఇసి దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా బోస్ మాట్లాడుతూ ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను తక్షణమే నిలిపి వేయాలని, ఇప్పటి వరకు సిఈసి ఏక పక్ష నిర్ణయాల వల్ల ఓటర్ల జాబితా నుండి తొలగి పోయిన ఓటు హక్కులను పునరుద్ధరించాలన్నారు. ఎన్నికల సంఘ స్వతంత్రను, ప్రజాస్వామ్య పద్ధతిలో జరిగే కార్యకలాపాలను పునరుద్ధరించాలన్నారు.ఎన్నికల కమిషనర్ల నియామక విధానాన్ని సమూలంగా మార్చాలన్నా. సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు ప్రధాన మంత్రి,ప్రతిపక్ష నేత,సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో కూడిన కమిటీ ద్వారా సిఇసి నియామకం జరుగాలన్నారు. ప్రజాస్వామ్యం, లౌకిక వాదం కోసం భగత్‌సింగ్, మహాత్మా గాంధీ తదితరులు నిరంతర పోరాటం చేసారన్నారు. బిజెపియేతర లౌకిక,ప్రజాస్వామ్య పార్టీలతో పాటు పౌరసం ఘాలు ప్రజలు పెద్ద ఎత్తును ఆందోళనల్లో పాల్గొనాలని పిలుపిచ్చారు. సిఈసి జ్ఞానేశ్‌కుమార్ నేతృత్వంలో ఎన్నికల సంఘం పనితీరు దేశవ్యాప్తంగా ఆందోళ నకరంగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జి.దామోదర్‌రెడ్డి, ఉప్పల్ నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు రాఘవేంద్ర రావు,నర్సింహరావు, ఏఐవైఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు కె.ధర్మేంద్ర, జిల్లా కార్యదర్శి సత్యప్రసాద్,రాజ్‌కుమార్, గిరిబాబు, శేఖర్,సుదర్శన్,అశోక్,సుదీప్, మధు, రవి తదితరులు పాల్గొన్నారు.



## చెన్నై షాపింగ్ మాల్ ఎగ్జిబిషన్ సేల్‌ను ప్రారంభించిన హెబ్బా పటేల్

**ప్రజాపక్షం/చర్లపల్లి :** కుషాయిగూడ శ్రీలక్ష్మి కన్వెన్షన్ హాలులో ఏర్పాటు చేసిన చైన్నై షాపింగ్ మాల్ ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవానికి ప్రముఖ నటి హెబ్బా పటేల్ ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి వెలిగించి ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెన్నై షాపింగ్ మాల్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిం చడం చాలా సంతోషంగా ఉందన్నారు.ఈ ఎగ్జిబిషన్‌లో మీ కుటుంబానికి అంద రికి కావలసిన వస్త్రాలు,డ్రెస్ మెటిరియల్ అందుబాటులో ఉన్నాయ న్నారు.షాపింగ్ మాల్ డైరెక్టర్ కృష్ణారావు మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీ నుండి అక్టోబర్ 19వ తేదీ వరకు ఎగ్జిబిషన్ ఉంటుందని రానున్న పండు గలు,పర్వదినాల నేపథ్యంలో అన్ని వర్గాల ప్రజల ఎగ్జిబిషన్ సేల్‌ను సందర్శించి తమకు నచ్చిన ఉత్పతులను కొనుగోలు చేయాలని అన్నారు.



## అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారికి రూ.15,000 ఆర్థిక సాయం

మానవత్వాన్ని చాటుకున్న కాంగ్రెస్ నాయకులు

**ప్రజాపక్షం/జవహర్‌నగర్ :** అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఒక చిన్నారి కుటుంబానికి ఆర్థిక సాయం అందించి కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ ఉదారతను చాటుకున్నారు. చంద్రపురి కాలనీ డివిజన్ పరిధిలోని మోహన్ రావు కాలనీకి చెందిన 11 ఏళ్ల చిన్నారి వర్షిణి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ జీనియా ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసు కున్న జవహర్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ మేయర్ దొంత గాని శాంతి కోటేష్ గౌడ్ వీర్ల భుజంగం తమ మిత్రులతో కలిసి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారిని, ఆమె కుటుంబాన్ని పరామర్శించారు. చిన్నారి వైద్య ఖర్చుల నిమిత్తం దొంతగాని శాంతి కోటేష్ గౌడ్ రూ.10,000, వీర్ల భుజంగం రూ.5,000 చొప్పున మొత్తం రూ. 15,000 ఆర్థిక సాయాన్ని బాధి తుల కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చిన్నారి త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి తిరిగి రావాలని ఆకాం క్షించారు. అంతేకాకుండా, వర్షిణి చికిత్సకు భారీగా ఖర్చవుతున్నందున దాతలు కూడా ముందుకు వచ్చి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని పిలుపుని చ్చారు. కష్టకాలంలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచి ఆర్థిక చేయూతని వ్వడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. నాయకులు చూపిన ఈ ఉదారత సమాజంలో మరికొందరికి స్ఫూర్తిగా నిలుస్తుందని కొనియాడారు.

## ఆర్‌టిసి ఉద్యోగులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేరుస్తుంది

-జిల్లా ఆర్‌టిఎ మెంబర్, డిపో గౌరవ అధ్యక్షుడు బీమిడి జైపాల్‌రెడ్డి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ఆర్‌టిసి ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ లను నెరవేరుస్తుందని జిల్లా ఆర్‌టిఎ మెంబర్. హకింపేట ఆర్‌టిసి డిపో గౌరవ అధ్యక్షుడు బీమిడి జైపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం శామీర్‌పేట డివిజన్ హకిం పేట డిపోలో డిపో అధ్యక్షుడు తులసిరాం యూనియన్ ఎన్నికల తేదీలను ప్రక టించారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ అక్టోబర్ 9న హకింపేట డిపోలో యూనియన్ ఎన్నికలు నిర్వహించన్నుట్లు తెలిపారు. మజ్దూర్ యూని యన్ బలపరిచిన రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతుతో తెలంగాణ మజ్దూర్ యూనియన్‌కు న్యాయకత్వం వహిస్తున్న అశ్వాత్థామరెడ్డికి లేబర్ కమిషనర్ బాణం గుర్తును కేటాయించినట్లు తెలిపారు. అక్టోబర్ 9న ఉదయం 5 గంటల నుంచి పోలింగ్ ప్రారంభం కానుందని డిపో ఉద్యోగులు ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిపో అధ్య క్షులు తులసిరాం, కార్యదర్శి పవన్‌కుమార్ యాదవ్, సీనియర్ నాయకులు నామాల కృష్ణ, నర్సింగరావు, పుష్పలత, శోభ, చక్రపాణి, ఇందిరమ్మ కమిటి సభ్యుడు శ్రీనివాస్‌యాదవ్, జగన్, శశాంత్, జాఫర్, పాండు, తదితరులు పాల్గొ న్నారు.

## ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం



**ప్రజాపక్షం/యూసుఫ్‌గూడ:** ప్రజా సమస్యల పరిష్కారం లక్ష్యంగా పనిచేస్తున్నట్లు పీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం లవకుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన యూసుఫ్‌గూడ డివిజన్ పరిధిలో ప్రజా సమస్యల గుర్తింపు, పరిష్కారమే ధ్యేయంగా కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ముమ్మరంగా పర్యటిస్తున్నారు. ప్రజలతో నేరుగా మమేకమవుతూ, దశాబ్దాలుగా వేధిస్తున్న రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాల వంటి మౌలిక వసతుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. ఈ సందర్భంగా మీసం లవకుమార్ మాట్లాడుతూ, ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలోనే తెలుసుకుని, ఎమ్మెల్యే ద్వారా సంబంధిత ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకుంటూ సత్వర పరిష్కారాలు చూపుతున్నామని స్పష్టం చేశారు.

## ఎడ్యుస్కిల్స్ కనెక్ట్-2026



**ప్రజాపక్షం/బంజారాహిల్స్:** సాంకేతిక విద్యా రంగంలో మరో లక్ష్య బోర్డైన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ జాతీయ స్థాయిలో సరికొత్త రికార్డు సృష్టించింది. జైపూర్ మారియట్ హోటల్లో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన ఎడ్యుస్కిల్స్ కనెక్ట్ 2026 సదస్సులో వివిధ విభాగాల్లో ఏకంగా 13 జాతీయ స్థాయి గుర్తింపులను కైవసం చేసుకుని సత్తా చాటింది. ఎడ్యుస్కిల్స్ కనెక్ట్ 2026 ముగింపు వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమానికి భారత ప్రభుత్వ సామాజిక న్యాయం, సాధికారత శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ రాందాస్ అథవాలే ముఖ్య అతిథిగా విచ్చేశారు.

## జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి




**ప్రజాపక్షం/అమీర్‌పేట్:** సర్ ప్రక్రియకు సంబంధించి నెలకొన్న వివాదాలు, ఓటర్ల జాబితాలో జరుగుతున్న మార్పులు, ఓటర్ల హక్కులకు సంబంధించిన అంశాల్లో నెలకొన్న సందిగ్ధత నేపథ్యంలో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ వెంటనే రాజీనామా చేయాలని ఎస్ఆర్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు దేవులపల్లి రవికిరణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జరిగిన నిరసనలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ ప్రక్రియపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితా సవరణ పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించకుండా ఎన్నికల సంఘం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## లడ్డూ వేలం పాట



**ప్రజాపక్షం/సనత్‌నగర్:** గణనాథుల నిమజ్జనం కొనసాగుతూనే ఉన్నది. ఈ క్రమంలోనే సనత్‌నగర్ డివిజన్ పరిధిలోని శ్యామలకుంట బస్తీలో లక్ష్మణ్ యూత్ గణేష్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండలంలో అర్ధ రాత్రి నిర్వహించిన లడ్డూ వేలం పాటలో ముత్యాల మహేష్ రూ.2,75,000లకు గణనాథుని లడ్డు సొంతం చేసుకున్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వై.రవి, ఈ.మహేష్, జి.రాజు, ఎం.మహేష్, జి.వెంకట్, ఎం.సాయి, ఇ.యాదగిరి, ఎం.వెంకట్, వై.సాయి, వై.శ్రీను, ఎం.చంటి, ఎం.విక్రమ్, సి.గణేష్, ఎం.నందు తదితరులు పాల్గొన్నారు.

## సాంకేతిక పరిజ్ఞానంతో ప్రజాసేవ

**ప్రజాపక్షం/అమీర్‌పేట్:** ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రజా సంక్షేమంతో మేళవిస్తూ ఎస్ఆర్ నగర్ ప్రాంతంలో భద్రతా చర్యలు చేపడుతున్నట్లు ఎస్ఆర్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎస్ఆర్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేవులపల్లి రవికిరణ్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రవి కిరణ్ మాట్లాడుతూ.. బహుళ జాతి సంస్థ హెక్సాగాన్‌లో ఎగ్జిక్యూటివ్ మేనేజర్‌గా పనిచేస్తూనే సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొంటున్నట్లు తెలిపారు. ఎస్ఆర్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా స్థానిక సమస్యలు, మౌలిక వసతులు కల్పన, ప్రజల ఫిర్యాదుల పరిష్కారంపై దృష్టి సారిస్తున్నట్లు వివరించారు. అలాగే ఎస్ఆర్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా స్థానిక స్థాయిలో పార్టీ కార్యక్రమాల్లో భాగస్వామ్యం అవుతున్నట్లు తెలిపారు. సాంకేతికతతో ప్రజా భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ వాయిస్ సదుపాయం కలిగిన అధునాతన సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

## ఫిలింనగర్ క్లబ్ కార్యవర్గం

**ప్రజాపక్షం/బంజారాహిల్స్:** ఫిలింనగర్ కల్చరల్ క్లబ్ అధ్యక్షుడుగా కెవిఎస్ రామారావు ఎన్నికయ్యారు. కమిటీలో కార్యదర్శి ముళ్లపూడి మోహన్, ఉపాధ్యక్షుడు సదాశివరెడ్డి, కోశాధికారి శైలజ, సంయుక్త కార్యదర్శి ఎస్ఎన్ రెడ్డి, కమిటీ సభ్యులు ఏడిద రాజా, కృష్ణంరాజు, శ్రీనివాసరాజు, కిషోర్, కాజా సూర్యనారాయణ, మురళీ మోహన్‌రావు, బాస్కర్‌నాయుడు, బాలరాజు, నాగసుష్మ విజయం సాధించినట్లు ప్రకటించారు.

## భార్యను చంపిన భర్త

**ప్రజాపక్షం/చిక్కడపల్లి:** భార్యను రోకలి బండలతో కొట్టి చంపిన ఘటన చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏపీలోని కడప వాసులైన భార్య, భర్తలు ఇద్దరూ నాలుగు నెలల క్రితం నగరానికి వచ్చి చిక్కడపల్లి ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. ఆదివారం ఉదయం భర్త భార్య( తేజ)ను రోకలి బండతో మోదీ చంపాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## నీళ్లు ఆంధ్రప్రదేశ్‌కు..

# కన్నీళ్లు తెలంగాణకు



**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** తెలంగాణ జల వనరుల కోసం ఎంతటి వారినైనా ఎదిరిస్తామని, తెలంగాణకు న్యాయమైన వాటా దక్కేందుకు ముఖ్యమంత్రితో మాట్లాడతానని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నీళ్లు ఆంధ్రకు....కన్నీళ్లు తెలంగాణకా... అన్న అంశంపై తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు యెర్ర సత్యనారాయణ అధ్యక్షతన అఖిల పక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయతో కలిసి మాట్లాడారు.. తెలంగాణ పోరాటం జరిగిందే నీళ్లు, నిధులు, నియామకాల కోసమని గుర్తు చేశారు. తెలంగాణ ప్రయోజనాలను కాపాడేందుకు జల వనరుల కోసం గతంలో పోరాటాలు చేశామన్నారు. ప్రభుత్వం తెలంగాణ నీళ్లను రక్షించుకునేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. జల వనరుల సంఘం మాజీ అధ్యక్షుడు వి.ప్రకాష్ మాట్లాడుతూ.. జూరాల నుంచి ప్రవహించే 4 వందల టీఎంసీల నీటిలో కనీసం 11 టీఎంసీల నీరు కూడా తెలంగాణ ప్రాంతంలో పారడం లేదని, సీమాంధ్ర ప్రాంతానికే వెళుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడి నీళ్లు ఆంధ్రకు పారి తెలంగాణకు కన్నీళ్లు మిగులుతున్నాయని మండిపడ్డారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం కోఆర్డినేటర్ గుజ్జ కృష్ణ, కటకం నర్సింగ్‌రావు, నందా గోపాల్, ప్రముఖ న్యాయవాది నాగుల శ్రీనివాస్ యాదవ్, జక్కుల వంశీ, సతీష్, శ్రావణి, సౌజన్య, అరుణ్ యాదవ్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సౌధాలో నిరసన సభ




**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** విద్యుత్ శాఖలో ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి, మహిళా ఉద్యోగులకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రభుత్వానికి తెలియజేసేందుకు నిరసన సభను నిర్వహిస్తున్నట్లు యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు గౌరీ మనోహర్, డా.రమేష్ తెలిపారు. ఆదివారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. జీవో నెం: 954ను ప్రవేశ పెట్టడం వల్ల విద్యుత్ శాఖలో ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి, మహిళా ఉద్యోగులకు అన్యాయాలు జరుగుతున్నాయని వివరించారు. గతంలో విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు అసంబద్ధమైన జీవోలను ప్రవేశ పెట్టి వాటిని కొనసాగిస్తూ నిమ్న వర్గాల ఉద్యోగులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో అసోసియోషన్ సభ్యులు కృష్ణమూర్తి, రవీందర్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉప ఎన్నికలపై మహేష్ గురి

**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** అనూహ్యంగా రాబోతున్న ఖైరతాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ ఉప ఎన్నికలపై పలువురు నేతలు దృష్టి సారిస్తున్నారు. ఈ క్రమంలోనే బిఆర్ఎస్ తరపున పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని.. అధిష్ఠానం ఆదేశిస్తే పోటీ చేసి గెలిచి తీరుతానని బిఆర్ఎస్ నేత, మాజీ కార్పొరేటర్ మహేష్ యాదవ్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం సోమాజిగూడలోని తన కార్యాలయంలో మీడియాతో చిట్ చాట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గత 30 సంవత్సరాల తన రాజకీయ అనుభవంలో నియోజకవర్గంలో తనకు ఉన్న పరిచయాలు, ప్రజలతో ఉన్న అనుబంధం, పార్టీ కోసం చేసిన సేవలను పరిగణనలోకి తీసుకుని అధిష్ఠానం తనకు అవకాశం కల్పిస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఖైరతాబాద్ నియోజకవర్గానికి తాను స్థానికుడినని, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని తెలిపారు.

## చేవెళ్ల డిక్లరేషన్ అమలు చేయాలి



**ప్రజాపక్షం/బంజారాహిల్స్:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రకటించిన ఎస్సీఎస్టీ చేవెళ్ల డిక్లరేషన్లోని 12 హామీలను తక్షణమే అమలు చేయాలని ఎస్సీ సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కార్మిక శాఖ, భారీ పరిశ్రమల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామిని మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎస్సీ సంక్షేమ సంఘం నాయకులు చేవెళ్ల డిక్లరేషన్లోని హామీల అమలుపై మంత్రికి వివరించారు. ముఖ్యంగా ఎస్సీ రిజర్వేషన్లను 18 శాతానికి పెంపు, ప్రతి ఎస్సీఎస్టీ కుటుంబానికి అంబేద్కర్ అభయహస్తం కింద రూ.12 లక్షల ఆర్థిక సహాయం, నిరాశ్రయ ఎస్సీఎస్టీ కుటుంబాలకు ఇంటి స్థలం, రూ.6 లక్షల గృహ నిర్మాణ సహాయం, అసైన్డ్ భూముల పునరుద్ధరణ, పోడు భూముల సమస్య పరిష్కారం, ఎస్సీల కోసం ప్రత్యేక కార్పొరేషన్ల ఏర్పాటు, విద్యా ప్రోత్సాహకాలు మరియు గురుకుల విద్యాభివృద్ధి వంటి ప్రధాన హామీలను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని కోరారు.మంత్రిని కలిసిన వారిలో ఎస్సీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు తీగల అశోక్ కుమార్, జాతీయ ప్రధాన కార్యదర్శి మేకల కమలాకర్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు లలిత, ఎరుపుల చందు తదితరులున్నారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి



**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** తెలంగాణ ఉద్యమకారుడు, మాజీ మంత్రి కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి టీజీఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా టీజీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ఐటీ) వి.శివాజీ తదితరులు బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాగా కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కొనియాడారు. బాపూజీ జయంతిని పురస్కరించుకుని ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న కొండా లక్ష్మణ్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు.




## 'లంబాడీలపై విషం కక్కితే నంగారా మోగిస్తాం'



**ప్రజాపక్షం / హైదరాబాద్:** లంబాడీల సామాజిక వర్గంపై విషం కక్కుతున్న వారిపై నంగారా మోగిస్తామని లంబాడీ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పిఎస్) జాతీయ అధ్యక్షులు ధారావత్ గణేశ్ నాయక్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రాజ్‌కుమార్ అన్నారు. ఆదివారం హైదరాబాద్ ఎస్‌వికెలో జరిగిన ఎల్‌హెచ్‌పిఎస్ సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడారు. గిరిజన బంజారా ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి నాడు ప్రభుత్వం అధికారికంగా సెలవు ఇవ్వాలని కోరారు. ఎస్‌టి బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని, గిరిజన డిఎస్‌సి ప్రకటించాలని డిమాండ్ చేశారు. గిరిజనులకు మంత్రి పదవి ఇవ్వాలని, రెండు ఎమ్మెల్సీలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. గిరిజనుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు విడుద ల చేయాలని డిమాండ్ చేశారు. గోర్‌బారి భాషను జాతీయ భాషగా గుర్తించాలని కోరారు. సమావేశంలో సమితి ఎపి అధ్యక్షులు రవి నాయక్, మహిళా విభాగం సుశీలబాయి, పునెబాయి, మాజీ రాష్ట్ర అధ్యక్షులు వెంకట్ బంజారా తదితర నేతలు పాల్గొన్నారు.

## ఎఫ్‌బిహెచ్‌లో 'సింగూరు డ్యామ్' సందర్శన




**ప్రజాపక్షం / హైదరాబాద్ :** ప్రపంచ నదుల దినోత్సవం సందర్భంగా ఫోరం ఫర్ ఎ బెటర్ హైదరాబాద్ (ఎఫ్‌బిహెచ్) ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపకులు, నదీ పరిరక్షణ ఆసక్తిపరులు మంజీరా నదిపై ఉన్న సింగూరు డ్యామ్ ప్రాజెక్టును ఆదివారం సందర్శించారు. ఆయకట్టు, నీటి సరఫరా వ్యవస్థ, నదితో ముడిపడిన ప్రాంత చరిత్రను ప్రత్యక్షంగా తెలుసుకొన్నారు. ఫోరం చైర్మన్ మణికొండ వేదకుమార్ మాట్లాడుతూ నదిని అర్థం చేసుకోవడమే దాని పరిరక్షణకు తొలి అడుగు అని పేర్కొన్నారు. మంజీరా నీటిని ఎలా నిల్వ చేస్తున్నాం, ఎవరికి ఎలా అందిస్తున్నాం, నదిపై నిర్మించిన ప్రాజెక్టులు ప్రజల జీవితాలను ఎలా ప్రభావితం చేస్తున్నాయి అనే విషయాలను సవివరంగా తెలిపారు. కార్యక్రమంలో ఫోరం సభ్యులు వేణుగోపాల్, సుభాష్ రెడ్డి, రామరాజ్, కట్టా ప్రభాకర్, జెబిఆర్ గ్రూప్ సంస్థల అధ్యాపకులు మౌనిక యాదవ్, గంగారాం సింగ్, సుధీర్ కుమార్, హరినాథ్, ఆక్స్‌ఫర్ గ్రామర్ స్కూల్ విద్యార్థులు, దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్టు ప్రతినిధులు పాల్గొన్నారు.

## బండి సంజయ్ వ్యాఖ్యలు ఖండిస్తున్నాం

### బిసి ఎ కులాలకు క్షమాపణ చెప్పాలి




**ప్రజాపక్షం / హిమాయత్‌నగర్ :** ముదిరాజ్‌లను బిసి – డి నుంచి బిసి– ఎలోకి మార్చాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యానించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బిసి–ఎ కులాల హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు ప్రొఫెసర్ బాగయ్య పేర్కొన్నారు. ఆదివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. బిసి ఎలోని 57 కులాల సామాజిక, ఆర్థిక, విద్యా, ఉద్యోగ, రాజకీయ పరిస్థితుల వెనుకబాటును తెలుసుకోకుండా ఆయన వీడియో విడుదల చేయడం ఆందోళన కలిగిస్తుందన్నారు. గతంలోనే అనంత రామన్ కమిషన్ బిసి కులాలను ఎ,బి,సి,డి గ్రూపులుగా వర్గీకరించిందని, అందులో ముదిరాజ్ కులాన్ని బిసి డి కేటగిరీలో చేర్చడమైందన్నారు. వైఎస్ హయాంలో కూడా జిఒ నం.15 ద్వారా ముదిరాజ్ కులాన్ని బిసి ఎలో చేర్చిన అంశాన్ని హైకోర్టు రద్దు చేసిందని గుర్తుచేశారు. ప్రస్తుతం బండి సంజయ్ వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని, 24 గంటల్లో బిసి ఎ కులాలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా తీవ్రస్థాయిలో ఉద్యమిస్తామని బాగయ్య హెచ్చరించారు.

## పర్యాటక రంగంపై యువత దృష్టి సారించాలి




**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** పర్యాటక రంగంపై యువత దృష్టి సారించాలని, తద్వారా సరైన మార్గ నిర్దేశంలో వారి భవిష్యత్తును తీర్చి దిద్దుకోవచ్చని జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవ సందర్భంగా జిల్లా కలెక్టరేట్‌లో యువ టూరిజం క్లబ్ విద్యార్థులకు జిల్లా స్థాయి వ్యాస రచన, చిత్రలేఖనం, పాటలు తదితర పోటీలు నిర్వహించారు. దీంతో పాటు డిజిటల్ ఎజెండా అండ్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ టు రీడిజైన్ టూరిజం అన్న అంశంపై జరిగిన ఈ పోటీల్లో జిల్లాలోని పలు విద్యా సంస్థల నుండి ఎంపికైన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర రామలింగేశ్వర స్వామి ఆలయం,శామీర్‌పేట చెరువు, కండ్లకోయ అక్సిజన్ పార్కు తదితర పలు పర్యాటక ప్రాంతలు ఉన్నాయన్నారు. వీటిని సద్వినియోగం చేయటం ద్వారా పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేయవచ్చన్నారు.భవిష్యత్తులో జిల్లా పర్యాటక ప్రాంతాలను చిత్రాల రూపంలో తయారు చేసి రాష్ట్ర స్థాయి ఆర్ట్ గ్యాలరీల్లో ప్రదర్శించేలా విద్యార్థులకు తగిన శిక్షణ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో టూరిజం నోడల్ అధికారి సాంబశివరావు,డిఈఓ రేణుక, బిసి సంక్షేమ, అభివృద్ధి అధికారి ఝాన్సిరాణి,ఇంటర్ విద్యాధికారి కిషన్, టూరిజం అధికారి దామోదర్,లీడ్ బ్యాంకు మేనేజర్ శివప్రసాద్,డిపిఎం అభిలాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గణపతి మహోత్సవాలు

**ప్రజాపక్షం / హిమాయత్‌నగర్:** మహారాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ మంత్రి అశిశ్ షీలార్జి సారథ్యంలో దేశంలోని అన్ని రాష్ట్రాల రాజధానుల్లో గణపతి మహోత్సవాలను అధికారికంగా నిర్వహించినట్టు తెలుగు యునైటెడ్ అసోసియేషన్ ఆఫ్ మహారాష్ట్ర వ్యవస్థాపకులు అశోక్ కంటె తెలిపారు. నగరంలోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ స్మాల్ అండ్ మీడియం ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్‌లో వివిధ రంగాల ప్రముఖులు, పలు పాఠశాలల విద్యార్థులు మరాఠీ రాష్ట్ర గీతంతో జైజై మహారాష్ట్ర కార్యక్రమాన్ని ప్రారంభించి, 14 రకాల జానపదాలు, గణపతి జీవిత చరిత్ర ఇతివృత్తాన్ని ప్రదర్శించి ఆకట్టుకొన్నారు. కార్యక్రమంలో ప్రపంచ పర్యావరణ సంస్థ అధ్యక్షులు డాక్టర్ సిహెచ్ భద్ర, ప్రధానకార్యదర్శి నిఖిల్ సాయి కోనేటి, శ్రీ కృష్ణ చాముండేశ్వరి మహర్షి, కలయిక ఫౌండేషన్ అధ్యక్షులు అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## పోరాట యోధుల బాటలో వెళ్లటమే నిజమైన నివాళి: మైసమ్మ



**ప్రజాపక్షం/బోడుప్పల్ :** భూమి, భుక్తి , బానిస బతుకుల విముక్తి కోసం తెలంగాణా సాయుధ పోరాటం చేసిన వీరవనిత చాకలి ఐలమ్మ, తొలి దశ తెలంగాణా ఉద్యమ పోరాట యోధుడు కొండా లక్ష్మణ్ బాపూజి అడుగు జాడల్లో ముందుకు వెళ్లటమే వారికి అందించే నిజమైన నివాళులని అ ంబేద్కర్ ఆశయ సాధన సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సత్తి మైసమ్మ అన్నారు. బోడుప్పల్ సర్కిల్‌లో డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి 397వ ఆదివారం జ్ఞానమాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబరు 18న 400వ జ్ఞానమాల కార్యక్రమం భారీ ఎత్తున నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇటికల రవీందర్,భూ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుగ్గ మైసయ్య, బోడుప్పల్ అరుంధతి మాదిగ సంఘ అధ్యక్షుడు గరుగుల యాకయ్య, చిల్ల అంజయ్య, యేసు రాజు, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## బసిరెడ్డిపల్లిలో చిరుత కలకలం

**ప్రజాపక్షం /పరిగి:** మండల పరిధిలోని బసిరెడ్డి పల్లి సమీపంలో పెద్దపులి కలకలం తో భయాందోళనలో చుట్టు పక్కల గ్రామస్తులు ,కృష్ణగిరి క్షేత్ర అలయ పరిధిలోని గోశాల గోవులపై దాడి ,మూడురోజుల క్రితం ఒక లేగ దూడను ఎత్తుకేళ్లినట్లు చెబుతున్న గోసంరక్షుడు గమనించి కేకలు వేస్తూ పరుగెత్తడంతో పారిపోయిన పులి ,అవు మెడ ఉదర భాగంలో తీవ్ర గాయాలు అయినాయి . ఆవు వీపుపై పంజా ఆనవాళ్లు గుర్తింపు ఆవు మృతి చెందినది. బసిరెడ్డి పల్లి గ్రామంలో ఉన్న ఓ ఫాంహౌస్‌సిసి కేమరాల్లో రికార్డైన పల్లి కదలికలు కనిపించినాయి. గోశాలలో దాదాపు 200 వరకు అవులుంటాయంటున్నారు పలిని బందించి అడవిలో వదిలి గోశాలను రక్షించాలని కృష్ణ నందస్వామి అధికారులను కోరారు.

## స్వశక్తి మహిళలకు 'ఉల్లాస్' పరీక్ష

**ప్రజాపక్షం/కల్వకుర్తి:** నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని శిశు మందిర్ పాఠశాలలో ఆదివారం మహిళా సంఘాలలోని నిరక్షరాస్యులను అక్షరాసులుగా మార్చడానికి మహిళల కోసం ఉల్లాస్ అక్షరాస్యత ప్రత్యేక పరీక్ష కేంద్రాన్ని మెప్మా ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. మహిళలందరూ విద్యావంతులై స్వయం సమృద్ధి సారించాలని ఉన్నత ఆశయంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఉల్లాస్ అక్షరాస్యత కార్యక్రమం విజవంతంగా కొనసాగింది. ఈ పరీక్ష కేంద్రానికి పట్టణ పరిధిలోని మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సాహంగా పరీక్షలు రాశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, చదువు అనేది కేవలం అక్షరాలకే పరిమితం మహిళల జీవితాల్లో వెలుగులు నింపు ఒక అస్త్రం అని పేర్కొన్నారు.

## విద్యుదాఘాతానికి గేదె మృతి

**ప్రజాపక్షం/వంగూర్:** విద్యుదాఘాతానికి పాడి గేదె మృతి చెందిన ఘటన మండల పరిధిలోని నిజాంబాద్‌లో చోటుచేసుకుంది గ్రామస్తుల వివరాల ప్రకారం మొగిలి నరసింహకు చెందిన గేదెలు చెరువు గట్టుపై మేస్తుండగా ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్ నుంచి పంపుమోటర్ కు వెళ్తున్న విద్యుత్ వైరు తగిలి గేదె మృతి చెందింది. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నా రు.

## నిజాలు తెలుసుకొని మాట్లాడాలి

**పజాపక్షం/వంగూర్:** ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ పై చేస్తున్న ఆరోపణలను నిజాలు తెలుసుకొని మాట్లాడాలని కాంగ్రెస్ పార్టీ ఎస్‌సి సెల్ మండల అధ్యక్షుడు తిరుమలేష్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బిఆర్ఎస్ నాయకులు లేని ఆరోపణలు ఎమ్మెల్యే పై మోపడం సరి కాదని తిరుమలేష్ పేర్కొన్నారు. జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడిన మాటలను వక్రీకరిస్తూ భూతద్దంలో చూస్తున్నారని ఆయన అన్నారు.

### పార్టీలతో సంబంధాలున్న సిఇసి... ఎన్నికలను

# నిష్పక్షపాతంగా ఎలా నిర్వహిస్తారు?


**తక్షణమే ఆయన రాజీనామా చేయాలి : ప్రియాంకాగాంధీ వాద్రా**



**మలప్పురం :** కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్‌కు రాజకీయ మొగ్గులు ఉన్నాయని, ఈ నేపథ్యంలో ఆయన నిష్పక్షపాతంగా ఎన్నికలు ఎలా నిర్వహిస్తారని వయనాడ్ కాంగ్రెస్ ఎంపి ప్రియాంకా గాంధీ వాద్రా ప్రశ్నించారు. ఆయన తక్షణమే రాజీనామా చేయాలన్న తన డిమాండ్‌ను ఆమె పునరుద్ఘాటించారు. తన నియోజకవర్గ పర్యటనలో భాగంగా ప్రయాణిస్తున్న వాద్రా ఆదివారం విలేకరులతో మాట్లాడారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి టికెట్‌పై పోటీ చేయాలని కేరళం మాజీ చీఫ్ సెక్రటరీ జిజి థామ్సన్‌ను కుమార్ కోరారన్న ఆరోపణపై ప్రశ్నించగా, అది పూర్తిగా చట్టవిరుద్ధం, అనైతికం అని ఆమె అభివర్ణించారు. ఈ ఆరోపణ, ఎన్నికల వ్యవస్థ, ఎన్నికలు నిర్వహించే సంస్థలలోని అత్యున్నత స్థాయిలలో ఉన్నవారికి పార్టీ మొగ్గులు ఉన్నాయని తెలియజేస్తుందని ఆమె అన్నారు. 'వారికి పార్టీల పట్ల మొగ్గు ఉండటమే కాకుండా, వారు ఆ పార్టీల పట్ల చురుకుగా ప్రచారం చేస్తున్నారు. అలాంటప్పుడు నిష్పక్షపాతంగా ఎన్నికలు ఎలా నిర్వహించగలరు? ఈ పెద్దమనిషి (ప్రధాన ఎన్నికల కమిషనర్) చేసిన పనుల పరంపరలో ఇది ఒకటి మాత్రమే. ఇవన్నీ పూర్తిగా చట్టవిరుద్ధమైనవి, రాజ్యాంగ విరుద్ధమైనవి. ఆయన రాజీనామా చేయాలి, ఇప్పుడే రాజీనామా చేయాలి' అని ఆమె అన్నారు. సిఇసికి వ్యతిరేకంగా కాంగ్రెస్ నిరసన తెలుపుతుందా అని ప్రశ్నించగా, వయనాడ్ లోక్‌సభ నియోజకవర్గం కాంగ్రెస్ ఎంపి ఈ విషయంపై దేశవ్యాప్తంగా ఇప్పటికే నిరసనలు జరిగాయని అన్నారు. ప్రతి జిల్లాలోనూ ఆయనకు వ్యతిరేకంగా తాము నిరసనలు చేశామని, ఢిల్లీలో కూడా నిరసనలు జరిగాయన్నారు. కాగా, ఆదివారం, ఆమె పోరూరులో సాంప్రదాయ డప్పుల కళాకారులతో, కప్పిల్‌లోని ఒక వ్యవసాయ క్షేత్రంలో తేనె రైతులతో ముచ్చటించారు. సాంప్రదాయ డప్పుల వాయిద్యాలతో ఆమెకు స్వాగతం పలికారు. ఆమె కూడా డప్పుల కళాకారులతో కలిసి డప్పులు వాయించి చూశారు. తేనె రైతులు, పార్టీ కార్యకర్తలను కలిసిన అనంతరం, ఆ కాంగ్రెస్ ఎంపి కోజికోడ్‌కు బయలుదేరారు. అక్కడి నుండి విమానంలో న్యూఢిల్లీకి వెళ్లడం ద్వారా ఆమె తన నియోజకవర్గంలో ఏడు రోజుల పర్యటనను ముగించనున్నారు.

# 'సర్'లో జ్ఞానేశ్ కుమార్‌వి 'ఏకపక్ష నిర్ణయాలు'

**ఇటీవల జరిగిన ఎన్నికల రద్దుపై సుప్రీంకోర్టు పరిశీలించాలి: సిబల్**



**న్యూఢిల్లీ :** ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌పై రాజ్యసభ ఎంపి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఎస్ఐఆర్‌కు సంబంధించి ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. ఆయనను పదవి నుంచి తొలగించాలని, ఇటీవల జరిగిన ఎన్నికలను రద్దు చేసే విషయాన్ని సుప్రీంకోర్టు పరిశీలించాలని ఆయన డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టం ద్వారా కుమార్‌కు క్రిమినల్ ప్రాసిక్యూషన్ నుంచి మినహాయింపు లభించినప్పటికీ, ఇసిఐ నెట్ కార్యకలాపాలను నిర్వహించిన, చట్టపరమైన మినహాయింపు లేని సీమా ఖన్నాను అరెస్టు చేసి, ఆమెపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని మాజీ కేంద్ర మంత్రి అన్నారు. ముగ్గురు సభ్యుల ఎన్నికల సంఘం (ఇసి)లో ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్)కు సంబంధించిన అంశాలపై ముగ్గురు కమిషనర్లలో ఇద్దరైన సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి పదేపదే ప్రశ్నలు లేవనెత్తారని ఆంగ్ల దినపత్రిక నివేదికపై చెలరేగిన వివాదం నేపథ్యంలో ఖన్నా పాత్ర పరిశీలనకు గురైంది. పూర్తి కమిషన్ కాకుండా జ్ఞానేష్ కుమార్ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నారని సపిల్ సిబల్ ఆరోపించారు. కమిషన్ సమావేశాలు పంపిణీ చేసిన ఎజెండాలు లేదా రికార్డ్ చేసిన మినిట్స్ లేకుండా జరిగాయని, ఇది ఇతర కమిషనర్ల నిర్ణయాలను సమీక్షించకుండా లేదా వాటిపై వ్యాఖ్యానించకుండా నిరోధించిందని కపిల్ సిబల్ ఆదివారం ఢిల్లీలో జరిగిన విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. జూన్ 2025 (బిహార్) నుండి ఏప్రిల్ 2026 (పశ్చిమ బెంగాల్) వరకు జరిగిన రాష్ట్ర ఎన్నికలను కవర్ చేస్తూ, ఈ ఏకపక్ష పద్ధతులు 10 నెలల పాటు కొనసాగాయని సిబల్ పేర్కొన్నారు. చట్టబద్ధమైన ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లను (ఇఆర్ఒలను) దాటవేసి, ఓటర్ల చేర్పులు, తొలగింపులకు సంబంధించిన నిర్ణయాలను సీమా ఖన్నా ఆధ్వర్యంలోని ఇసిఐ నెట్ ద్వారా ఢిల్లీలో కేంద్రీకరించారని సిబల్ ఆరోపించారు. ఫారం 6లో తల్లిదండ్రులు లేదా తాతామామ్మల వివరాలు అవసరమయ్యేలా చేసిన మార్పులు, అవసరమైన కేంద్ర ప్రభుత్వ నోటిఫికేషన్ లేకుండానే అమలు చేయబడ్డాయని సిబల్ అన్నారు. బిహార్ నుండి పశ్చిమ బెంగాల్ వరకు ఎన్నికల ప్రక్రియలు చట్టబద్ధమైన నిబంధనలను ఉల్లంఘిస్తున్నందున, ఈ 10 నెలల్లో జరిగిన అన్ని ఎన్నికలు చట్టవిరుద్ధం అని సిబల్ పేర్కొన్నారు. ఇసి రికార్డులు, అసమ్మతి పత్రాలు, ఏకపక్ష ఉత్తర్వులను పరిశీలించాలని సిబల్ సుప్రీంకోర్టుకు పిలుపునిచ్చారు. ఈ సమస్యలను సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించి, ఇటీవలి ఎన్నికలను రద్దు చేయాలని పరిగణించాలని ఆయన అన్నారు.

### సముద్రం అల్లకల్లోలంగా ఉన్నప్పుడే

# స్విమ్మింగ్ చేయడం ఇష్టం



**న్యూఢిల్లీ :** 'సముద్రం అల్లకల్లోలంగా ఉన్నప్పుడు అందులో ఈదడం నాకు చాలా ఇష్టం. ఎందుకంటే అల్లకల్లోలం కూడా ఒక రకమైన ప్రశాంతతేనని అది మనకు నేర్పుతుంది' అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. అయితే, ఆయన ఆ వ్యాఖ్యలను ఏ ఉద్దేశంతో చేశారనేది స్పష్టంగా పేర్కొనలేదు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)కు సంబంధించిన సమస్యలపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి, పదేపదే ప్రశ్నలు లేవనెత్తారన్న అంశంపై రాజకీయ దుమారం మధ్య ఈ పోస్ట్ వెలువడింది. రాహుల్‌గాంధీ గత సంవత్సరం 'ఓటు దొంగతనం' అంశాన్ని లేవనెత్తి, ఎన్నికలలో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. ఈ వార్తా నివేదిక దానిని ధృవీకరించిందని ఆయన అన్నారు.

# మమత వర్గం టిఎంసి ఎమ్మెల్యే కారుపై దాడి

- రెండు రోజుల్లో రెండు సార్లు దాడులు : కునాల్ ఘోష్

**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికల అనంతరం నుంచి రాష్ట్రంలో అల్లర్లు చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యంగా విపక్ష టిఎంసి నాయకులపై దాడులు ముమ్మరమవుతున్నాయి. అధికార బిజెపి గూండాగిరికి పాల్పడుతుందని విపక్ష టిఎంసి తీవ్ర విమర్శలు చేస్తుంది. తాజాగా తూర్పు కోల్‌కతాలోని తన బెలియాఘాటా నియోజకవర్గంలో ఒక కార్యక్రమానికి వెళ్తుండగా తన కారుపై దాడి జరిగిందని మమతా బెనర్జీ వర్గానికి చెందిన టిఎంసి ఎమ్మెల్యే కునాల్ ఘోష్ ఆదివారం ఆరోపించారు. నార్కెల్‌దంగా ప్రాంతంలో మోటార్‌సైకిళ్లపై వచ్చిన దుండగులు సుత్తులతో తన కారు ముందు అద్దాన్ని పగలగొట్టారని, అదే సమయంలో వారిలో ఒకరు తన భద్రతా సిబ్బందిపై తుపాకీ గురిపెట్టారని ఘోష్ పేర్కొన్నారు. శనివారం హుగ్లీ జిల్లాలో మమతా బెనర్జీ సమావేశానికి వెళ్తుండగా కూడా ఘోష్ కారుపై రాళ్లు, గుడ్లు విసిరారని ఆరోపణలు ఉన్నాయి. 'శనివారం ఉత్తరపారాలో నాపై దాడి జరిగింది. ఆదివారం నన్ను చంపాలని చూశారు' అని పగిలిన కారు అద్దం ముక్కలను విలేకరులకు చూపిస్తూ ఘోష్ చెప్పారు. తాను స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని ఘోష్ తెలిపారు. ఉత్తరపారాలో జరిగినట్లు చెబుతున్న దాడి తర్వాత, ఘోష్ తన వాహనాన్ని కోల్‌కతాలోని పశ్చిమ బెంగాల్ పోలీస్ ప్రధాన కార్యాలయమైన భవాని భవన్‌కు తీసుకెళ్లారు, కానీ అక్కడికి అనుమతించలేదు. ఆ తర్వాత ఘోష్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.
'బిజెపి పాలనలో పశ్చిమ బెంగాల్‌లో 'జంగిల్ రాజ్' (అరాచక పాలన) నడుస్తోంది. పోలీసులు చూస్తూ ఊరుకుంటుండగా, అధికార పార్టీకి చెందిన గుండాలు ఒక ఎన్నికైన ఎమ్మెల్యేపై కూడా దాడులకు పాల్పడుతున్నారు' అని ఆ టిఎంసి ఎమ్మెల్యే ఆరోపించారు.

# పోలీసుల అదుపులో సిజెపి నేత రంకా

**గువహటి :** ఒక చిన్న వలంటీర్ల సమావేశం నిర్వహించడానికి ముందు, తమ పార్టీ సహకన్వీనర్ అశుతోష్ రంకా, మద్దతుదారులను పోలీసులు అదుపులోకి తీసుకుని, తెలియని ప్రదేశానికి తరలించారని 'కాక్‌రోచ్ జనతా పార్టీ' (సిజెపి) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఆరోపించారు. ఒక రోజు క్రితమే గువహటికి చేరుకున్న రంకా, ఆ రోజు కొంతమంది సిజెపి మద్దతుదారులను కలవాల్సి ఉంది. అయితే, పార్టీ నాయకులు ఆ సమావేశాన్ని నిర్వహించకుండా అడ్డుకున్నారని దీప్కే పేర్కొన్నారు.
రంకా ఎక్స్ ఖాతాలో ఒక వీడియోను పంచుకున్నారు. అందులో ఆయన పోలీసులతో కలిసి కదులుతున్న వాహనంలో కూర్చుని కనిపించారు. అసోంలోని పాఠశాలల వాస్తవ పరిస్థితులను తమ పార్టీ బయటపెట్టాలనుకుంటున్నందున, అక్కడి ప్రజలంటే భయపడిన ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ తనను, సిజెపి వలంటీర్లను అదుపులోకి తీసుకున్నారని ఆయన ఆ వీడియోలో చెబుతూ వినిపించారు. పోలీసులు తనను తరలిస్తుండగా విలేకరులతో మాట్లాడిన రంకా, ఈ చర్య ముఖ్యమంత్రి శర్మకు వాస్తవాలు బయటపడతాయనే భయం ఉందని సూచిస్తోందని అన్నారు. 'ఇక్కడి పాఠశాలలను మేము చూపిస్తే దేశానికి వాస్తవ పరిస్థితి తెలుస్తుందని ఆయన భయపడుతున్నారు. కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం కాజిరంగలో ప్రజల హక్కులు ఎలా హరించబడుతున్నాయో ప్రజలకు తెలిసిపోతుందనే భయం ఆయనకు ఉంది. కానీ మేము ఆయనకు భయపడం. నియోజకవర్గాల సరిహద్దులను మార్చడం ద్వారానే ఆయన అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచారని మాకు తెలుసు' అని రంకా పేర్కొన్నారు.

# జనగణన జాతీయ బాధ్యత

- ప్రతి పౌరుడు అందులో భాగస్వామి కావాలి
- 'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ విజ్ఞప్తి



**న్యూఢిల్లీ :** జనగణనను జాతీయ బాధ్యత అని, ప్రతి పౌరుడు ఇందులో భాగస్వామి కావాలని ప్రధాని నరేంద్ర మోదీ కోరారు. జనగణన సమయంలో అందుబాటులో ఉన్న ఆన్‌లైన్ విధానాన్ని కూడా ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. దేశ జనాభా, సామాజికఆర్థిక పరిస్థితులకు సంబంధించిన సమాచార సేకరణలో పౌరుల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు. 138వ 'మన్ కీ బాత్'లో భాగంగా దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ ఈ మేరకు మాట్లాడారు. ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపుతామని మోదీ స్పష్టం చేశారు. ఉగ్రవాదం విషయంలో భారత్ జీరో టాలరెన్స్ విధానాన్ని పాటిస్తోందని తెలిపారు. ఉగ్రవాదానికి బలమైన, నిర్ణయాత్మక ప్రతిస్పందన ఉంటుందనే విషయాన్ని భారత్ స్పష్టం చేసిందని తెలిపారు. 2016 పాకిస్థాన్‌లో ఉగ్రశిబిరాలపై భారత సైన్యం జరిపిన సర్జికల్ స్ట్రైక్స్ అందుకు నిదర్శనమని అని అన్నారు. గాంధీ జయంతి వేళ స్వచ్ఛతకు సంబంధించి ఆయన ఇచ్చిన నినాదాన్ని ముందుకు తీసుకెళ్లాలని మోదీ, ప్రజలను కోరారు. భారత సైనికులు నియంత్రణ రేఖ దాటి ఉగ్రవాద స్థావరాలపై చర్యలు చేపట్టడం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైందని మోదీ అన్నారు. దేశం చాలా కాలంగా ఉగ్రదాడుల వల్ల ఎదుర్కొన్న బాధకు ఈ చర్య నిర్ణయాత్మక ప్రతిస్పందనగా నిలిచిందని పేర్కొన్నారు. పదేళ్ల క్రితం 2016లో చేపట్టిన సర్జికల్ స్ట్రైక్స్ ప్రపంచం ముందు భారత్ ఉగ్రవాద వ్యతిరేక విధానానికి ఒక కొత్త ఉదాహరణగా నిలిచాయని ఆయన పేర్కొన్నారు. 2016 సెప్టెంబర్ 18న జమ్ముకశ్మీర్‌లోని ఉరీలో ఆర్మీ శిబిరంపై ఉగ్రదాడి జరిగింది. ఈ దాడికి ప్రతిస్పందనగా సెప్టెంబర్ 2829 రాత్రి నియంత్రణ రేఖ వెంబడి ఉగ్రవాదుల లాంచ్ ప్యాడ్‌లపై భారత సైన్యం సర్జికల్ స్ట్రైక్స్ నిర్వహించింది. దేశంలో మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు యువత ముందుకు రావడాన్ని ప్రధాని ప్రశంసించారు. 'నషా ముక్త్ యువ అభియాన్' ద్వారా యువత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ డ్రగ్స్‌కు దూరంగా ఉండాలనే సందేశాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తోందన్నారు. యువత తమంతట తామే మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ప్రతిజ్ఞ చేయడంతో పాటు, ఇతరులను కూడా ఆ దిశగా ప్రోత్సహిస్తున్నారని మోదీ చెప్పారు. 'నషా ముక్త్ యువా ఫర్ వికసిత్ భారత్' కార్యక్రమంలో దేశవ్యాప్తంగా యువత భాగస్వామ్యం పెరుగుతున్నట్లు కేంద్ర ప్రభుత్వం ఇటీవల వెల్లడించింది.

# సిజెపి నిరసనకు వాంగ్‌చుక్ మద్దతు

**సిఇసి జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా 2వ తేదీన ఆందోళనలు**



**న్యూఢిల్లీ :** దేశంలో జవాబుదారీతనాన్ని, ఎన్నికల ప్రక్రియను మెరుగుపరిచే ప్రయత్నాలకు మద్దతు ఇవ్వాలని పేర్కొంటూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా అక్టోబర్ 2న నిరసన చేపట్టాలని 'కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి)' ప్రతిపాదించింది. అయితే ఈ ప్రతిపాదనకు పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ ఆదివారం మద్దతు తెలిపారు. సిజెపి ప్రతిపాదించిన ఆందోళనకు ఆయన తన మద్దతును ప్రకటించినప్పటికీ, నిరసన సమయంలో తాను భౌతికంగా హాజరుకాకపోవచ్చని వాంగ్‌చుక్ తెలిపారు. 'దేశంలో జవాబుదారీతనాన్ని మెరుగుపరిచే దేనికైనా కచ్చితంగా మద్దతు ఇస్తాను, ఎల్లప్పుడూ వారితోనే ఉంటాను,' అని ఆయన అన్నారు. ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు, పునరుద్ధరణ, ఓటర్ల జాబితాల ప్రత్యేక విస్తృత సవరణకు సంబంధించిన నిర్ణయాలపై గత 10 నెలల్లో ఎన్నికల కమిషనర్లు ఎస్.ఎస్. సంధు, వివేక్ జోషి కనీసం 14 సార్లు రికార్డు స్థాయిలో అభ్యంతరం తెలిపారని ఓ ఆంగ్లపత్రిక తన నివేదిక వెల్లడించగా, ఎన్నికల కమిషన్ పని తీరుపై వివాదం చెలరేగిన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఎస్ఐఆర్‌కు సంబంధించిన అన్ని నిర్ణయాలకు ముగ్గురు కమిషనర్ల ఏకగ్రీవ ఆమోదం లభించిందని ఎన్నికల కమిషన్ శనివారం స్పష్టం చేసింది. కాగా, 'నా దృష్టిలో ఉద్యమాలకు మద్దతు ఇవ్వడం వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశ్యం ఏమిటంటే, ఆ ఉద్యమాలు వాటంతట అవే ముందుకు సాగాలి. అందుకే ఇప్పుడు ఆ సమస్య కోసం చాలా మంది ఉన్నారు, అది చూసి నేను సంతోషిస్తున్నాను. అందువల్ల, సిఇసి విషయంలో నా అవసరం ఉండదని ఆశిస్తున్నాను' అని ఆయన అన్నారు. ప్రజాస్వామ్య దేశానికి ఎన్నికల ప్రక్రియ అత్యంత ముఖ్యమైన అవసరాలలో ఒకటని, దానిని మెరుగుపరచాల్సిన అవసరం ఉందని వాంగ్‌చుక్ అన్నారు. 'ఎన్నికల ప్రక్రియ కలుషితమైతే, ప్రజాస్వామ్యానికి ఇంకేం మిగులుతుంది? అని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వాలు చేసిన వాగ్దానాలను తప్పక నెరవేర్చాలని ఆయన అన్నారు. అక్టోబర్ 2వ తేదీ చాలా పవిత్రమైన రోజు అని, ఆ రోజు మహాత్మా గాంధీ జయంతి అని, ఆయన అనుసరించిన శాంతియుత నిరసన పద్ధతులు ప్రజల హక్కుల ఉద్యమాలకు స్ఫూర్తినిచ్చాయని ఆయన అన్నారు. ఎన్నికల సంఘంపై జవాబుదారీతనం కోరుతూ చేపట్టిన ప్రచారంలో భాగంగా, అక్టోబర్ 2న ముంబయిలో తమ నిరసన ప్రారంభమవుతుందని సిజెపి ప్రకటించింది. ఎస్ఐఆర్‌కు సంబంధించిన సమస్యలపై సిఇసిపై చర్యలు తీసుకోవాలని ప్రతిపక్ష పార్టీలు కూడా డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో, సమన్వయంతో కూడిన ప్రతిస్పందనపై చర్చించేందుకు ఇండియా కూటమి పార్టీలు ఈనెల 30న ఢిల్లీలో సమావేశం కానున్నాయి.

# తొలి ఎల్ఎన్‌జి రైలు ప్రారంభం



**అహ్మదాబాద్ :** దేశంలోనే తొలి ఎల్ఎన్‌జి రైలును కేంద్ర హోంమంత్రి అమిత్ షా పచ్చజెండా ఊపి ప్రారంభించారు. గుజరాత్‌లోని సబర్మతి రైల్వేస్టేషన్‌లో ఈ ప్రారంభోత్సవం జరిగింది. హైడ్రోజన్‌తో నడిచే రైలును ప్రారంభించడం ద్వారా.. ప్రపంచంలో ఈ సాంకేతికత కలిగిన నాలుగు దేశాల సరసన భారత్ నిలిచింది. రైలు ప్రారంభం అనంతరం నిర్వహించిన సభలో అమిత్ షా ప్రసంగిస్తూ.. దేశ రైల్వే వ్యవస్థను ప్రధాని నరేంద్ర మోదీ సమూలంగా మార్చారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ తన పాలనలో కుంభకోణాలు తప్ప ఇంకేమీ చేయలేదని విమర్శించారు. గత 12 ఏళ్లలో ప్రధాని మోదీపై ఎవరూ అవినీతి ఆరోపణలు చేయలేకపోయారని అన్నారు. అర్థరహితంగా మాట్లాడే హస్తం పార్టీని.. వాస్తవాలు, గణాంకాల ఆధారంగా చర్చకు రావాలని సవాల్ చేయండని ప్రజలకు పిలుపునిచ్చారు. 2014లో మోదీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి.. ప్రత్యేక సరకు రవాణా కారిడార్, రాపిడ్ రైల్ సిస్టమ్, అత్యాధునిక స్టేషన్లకు శ్రీకారం చుట్టారన్నారు. హైడ్రోజన్‌తో నడిచే రైలును ప్రారంభించడం ద్వారా ప్రపంచంలో ఆ సాంకేతికత కలిగిన నాలుగు దేశాల సరసన భారత్‌ను నిలిపారని కొనియాడారు. ముంబయి నుంచి వడోదర వరకు మొట్టమొదటి లాంగ్ డబుల్ స్టాక్ కంటైనర్ రైలు ట్రయల్ రన్ విజయవంతంగా పూర్తయిందని అమిత్ షా అన్నారు. మొత్తం 11 వేల కిలోమీటర్ల రైలు కారిడార్‌ను నాలుగు ట్రాక్‌ల నెట్‌వర్క్‌గా మార్చుతున్నామని తెలిపారు. ఇదిలావుంటే ఈ కొత్త రైలు ఎల్ఎన్‌జి, డీజిల్ రెండింటిపై నడుస్తుందన్నారు. డీజిల్ వినియోగంలో సుమారు 40 శాతాన్ని ఎల్ఎన్‌జీతో భర్తీ చేస్తుందని చెప్పారు. డీజిల్ వినియోగం, ఇంధన ఖర్చులు, ఉద్గారాలను తగ్గించడమే లక్ష్యంగా ఎల్ఎన్‌జీ రైలును ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు.

# కేరళం జిఎడి వెబ్‌సైట్ హ్యాక్

**తిరువనంతపురం :** కేరళం ప్రభుత్వ సాధారణ పరిపాలన శాఖ (జిఎడి) అధికారిక వెబ్‌సైట్ హ్యాక్ అయింది. ఒక పాకిస్తానీ గ్రూపు హ్యాక్ చేసిందని ఆదివారం అధికారులు తెలిపారు. ఉదయం వెబ్‌సైట్‌ను హ్యాక్ చేసి, దానిపై పాకిస్తానీ జెండాను ఉంచినట్లు సాధారణ పరిపాలన శాఖ అధికారులు పేర్కొన్నారు. 'టీమ్ బ్లాక్‌లిస్ట్స్' ఈ వెబ్‌సైట్‌ను హ్యాక్ చేశారనే సందేశంతో పాటు, పాకిస్తాన్‌ను కీర్తించే నినాదాన్ని కూడా వెబ్‌సైట్‌లో పోస్ట్ చేశారు. 'మేము పాకిస్తానీ హ్యాకర్లం. ప్రతిరోజూ అనేక వెబ్‌సైట్‌లు హ్యాక్ చేయబడుతున్నాయి; ఈ రోజు మీ వంతు' అని ఆ సందేశంలో ఉంది. వెబ్‌సైట్ హ్యాక్ అయినట్లు గుర్తించిన తర్వాత, హోస్టింగ్ ప్రొవైడర్ ఖాతాను నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. డేటా ఉల్లంఘన జరిగిందా లేదా అని ఒక సైబర్ బృందం పరిశీలిస్తోందని, వెబ్‌సైట్ సురక్షితం అని నిర్ధారించుకున్న తర్వాత దాన్ని పునరుద్ధరిస్తామని అధికారులు తెలిపారు. ఈ విషయాన్ని దర్యాప్తు కోసం సైబర్ పోలీసులకు నివేదిస్తామని, త్వరలోనే ఫిర్యాదు కూడా నమోదు చేస్తామని వారు చెప్పారు. కేరళం ప్రభుత్వ కీలక వెబ్‌సైట్‌లు, ఇ–గవర్నెన్స్ కార్యక్రమాలను కేరళం రాష్ట్ర ఐటి మిషన్ నిర్వహిస్తుంది.

# ఎన్‌టిఎ ఆవరణలో సిఐఎస్ఎఫ్ భద్రత

**నీట్ ప్రశ్నపత్రాల లీక్, పరిపాలనా లోపాలపై వివాదం నేపథ్యంలో చర్యలు**

**న్యూఢిల్లీ :** నీట్ ప్రశ్నపత్రాల లీక్, పరిపాలనా లోపాలపై భారీ వివాదం చెలరేగిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఇటీవల నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) తన కార్యకలాపాలను కొత్త కార్యాలయానికి మార్చింది. అయితే ఇకపై దాని ప్రాంగణంలోని 'రహస్య ప్రాంతాల'లో పటిష్టమైన ఏర్పాట్లు ఉండేలా చూసేందుకు సిఐఎస్ఎఫ్ భద్రత కల్పిస్తుందని అధికారులు తెలిపారు. ఈ ఏడాది ప్రారంభంలో వైద్య ప్రవేశ పరీక్ష నీట్‌యుజి ప్రశ్నపత్రం లీక్ కావడం, దేశవ్యాప్తంగా విద్యార్థుల నిరసనలకు దిగడం, అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు కారణమైన నేపథ్యంలో ఈ చర్య తీసుకున్నారు. ప్రధాన్ రాజీనామా చేసిన మరుసటి రోజే, పరీక్షా వ్యవస్థను లీక్ రహితంగా మార్చేందుకు సంస్కరణలు సిఫార్సు చేయడానికి ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని నేతృత్వంలో ఒక ఉన్నత స్థాయి టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారు. ఈ కమిటీ ఇంకా నివేదికను సమర్పించలేదు. ప్రశ్నపత్రాల లీక్‌కు ముగ్గురు సబ్జెక్ట్ నిపుణులను ప్రాథమిక మూలాలుగా గుర్తించిన సిబిఐ ఛార్జిషీట్ ప్రకారం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ)లోని రహస్య విభాగంలోకి నిపుణుల ప్రవేశం లేదా నిష్క్రమణ సమయంలో వారిని తనిఖీ చేయడం గానీ, సోదా చేయడం గానీ జరగలేదు. దీంతో, రఫ్ వర్క్, అనువాదం కోసం వారికి అందించిన సాదా కాగితాలతో చేసిన చిన్న చీటీలపై, రూపొందించిన ప్రశ్నపత్రాల నుండి బ్రీఫ్‌లు తీసుకోవడానికి నిపుణులకు అనుమతి లభించింది. నిష్పక్షపాత, పారదర్శక, ప్రామాణిక పరీక్షలను నిర్వహించడానికి విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 2017లో ఏర్పాటు చేయబడిన ఎన్‌టీఎ, ఇప్పటివరకు ఓఖ్లాలోని తన కార్యాలయం నుండి పనిచేస్తోంది. 'మింటో రోడ్‌లోని భారత ప్రభుత్వ ప్రెస్ బిల్డింగ్‌లో 55,000 చదరపు అడుగులకు పైగా ప్రత్యేక కార్యాలయ స్థలాన్ని కేటాయించారు. ఆ భవనంలోని ఐదవ అంతస్తుతో పాటు, నాలుగవ, ఆరవ అంతస్తుల లోని కొన్ని భాగాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీకి కేటాయించారు. గత నెల రోజులుగా రహస్య, సున్నితమైన కార్యకలాపాలను కొత్తగా కేటాయించిన భవనానికి మార్చారు' అని ఒక సీనియర్ అధికారి పిటిఐకి తెలిపారు. జాతీయ రాజధానిలోని ఎన్‌టిఎ కార్యాలయంలో ప్రత్యక్ష ప్రసారాలను పర్యవేక్షించే ప్రత్యేక సిసిటివి కంట్రోల్ రూమ్ లేకపోవడంతో, నిందితులైన ముగ్గురు నిపుణుల పని గుర్తించబడకుండా పోయిందని సిబిఐ నివేదిక కూడా పేర్కొంది. కొత్త ప్రాంగణంలో పర్యవేక్షణ ప్రణాళికపై అధికారి మాట్లాడుతూ, 'పకడ్బందీ వ్యవస్థ అమలులో ఉండేలా చూసేందుకు, భవనంలో రహస్య ప్రాంతాలను గుర్తించడం జరిగింది. అక్కడ రాకపోకలు, కార్యకలాపాలను కఠినంగా పర్యవేక్షిస్తారు. ఈ ప్రాంగణానికి సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సిఐఎస్ఎఫ్) భద్రతను హోం మంత్రిత్వ శాఖ ఆమోదించింది' అని తెలిపారు. 39 మంది సిఐఎస్ఎఫ్ సిబ్బందిని మోహరించినట్లు తెలిపారు. వీరు భద్రత, సరైన ప్రవేశ నియంత్రణ, స్క్రీనింగ్ చర్యలకు బాధ్యత వహిస్తారు. ఇందులో భాగంగా ఎక్స్ రే బ్యాగేజ్ స్క్రీనింగ్ మెషీన్ మరియు డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్ల (డిఎఫ్ఎండి) సహాయంతో తనిఖీలు కూడా ఉంటాయి. రహస్య ప్రాంతంలోకి ప్రవేశాన్ని పర్యవేక్షించడానికి, నియంత్రించడానికి అన్ని ప్రవేశ, నిష్క్రమణ మార్గాల వద్ద తగిన ప్రదేశాలలో సిఐఎస్ఎఫ్‌ను మోహరిస్తున్నారని ఆ అధికారి తెలిపారు.

### 'నేడు' తమిళనాడులో నవజాత శిశువులకు...

# ఒక గ్రాము 'బంగారు ఉంగరాల పథకం' షురూ

- మధురైలో 'తైమామన్ తంగ మోతిరం తిట్టం' స్కీమ్ ప్రారంభించనున్న సిఎం విజయ్

**చెన్నై :** తమిళనాడు ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్ నేడు (సోమవారం) 'తైమామన్ తంగ మోతిరం తిట్టం' అనే సంక్షేమ పథకాన్ని ప్రారంభించనున్నారు. ఈ పథకం కింద ప్రభుత్వ ఆసుపత్రులలో జన్మించిన శిశువులకు ఒక గ్రాము బంగారం ఉంగరాన్ని ప్రభుత్వం అందిస్తుంది. ప్రభుత్వ రాజాజీ ఆసుపత్రిలో ఈ పథకాన్ని ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి విజయ్ మధురైకు రానున్నారని ఆదివారం ఇక్కడి సంబంధిత వర్గాలు తెలిపాయి. సిఎం విజయ్ ప్రత్యేక విమానంలో విచ్చేసి, ఇక్కడి జిఆర్‌హెచ్ ఆడిటోరియంలో ఈ పథకాన్ని ప్రారంభించి, 25మంది నవజాత శిశువులకు బంగారు ఉంగరాలను బహుకరిస్తారు. ఆయన, ఆ రోజు పుట్టిన శిశువులకు స్వయంగా ఉంగరాలను బహుకరించడానికి ప్రసూతి వార్డును కూడా సందర్శించనున్నారు. ఒక గ్రాము బంగారు ఉంగరం పథకానికి అర్హత పొందాలంటే నవజాత శిశువుల తల్లులు తమిళనాడు శాశ్వత నివాసులై ఉండాలి. దివంగత ముఖ్యమంత్రి సిఎన్.అన్నాదురై జయంతి అయిన సెప్టెంబరు 15న ఈ పథకాన్ని ప్రారంభించాల్సి ఉండగా, సిఎం విజయ్ లండన్ పర్యటన కారణంగా అప్పుడు అది వాయిదా పడింది. ఈ (మేనమామ బంగారు ఉంగరం) పథకం కింద, ప్రభుత్వ ఆసుపత్రిలో జన్మించిన ప్రతీ అర్హతగల నవజాత శిశువు శిశువుకు ఒక గ్రాము, 22–కేరట్ల బంగారు ఉంగరం లభిస్తుంది. 'తైమామన్ తంగ మోతిరం తిట్టం' పథకం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.755.83 కోట్ల వార్షిక కేటాయింపు చేసింది. మొదటి దశలో 1.28లక్షల బంగారు ఉంగరాలను సిద్ధం చేశారు. బంగారు ఉంగరాలపై ప్రత్యేకమైన సీరియల్ నెంబర్లు ఉంటాయని, వాటిని ట్యాంపర్ ప్రూఫ్ ప్యాకేజింగ్‌లో పంపిణీ చేస్తారని ప్రభుత్వం ఒక పత్రికా ప్రకటనలో తెలిపింది. అక్టోబరు 6న ఉప ఎన్నికలు జరుగనున్న మధురాంతకం, ధారపురంఅసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని ప్రాంతాలు మినహా, ఈ పథకాన్ని తమిళనాడు రాష్ట్ర వ్యాప్తంగా అమలుచేయనున్నారు

# ఎండిఆర్ విధింపు పై సుప్రీంలో పిటిషన్

**నేడు విచారణ**

**న్యూఢిల్లీ :** రూ.2,000 పైబడిన నిర్దిష్ట యుపిఐ వ్యక్తి–వ్యాపారి లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండిఆర్) విధించాలన్న కేంద్రం నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను నేడు (సోమవారం) సుప్రీంకోర్టు విచారణ జరుపనుంది. దాదాపు ఆరేళ్లుగా పూర్తిగా ఉచితంగా ఉన్న యుపిఐ చెల్లింపులకు ముగింపు పలుకుతూ, ప్రభుత్వం అక్టోబరు 15నుంచి యుపిఐ వేదిక ద్వారా వ్యాపారులకు చేసే రూ. 2,000 పైబడిన బదిలీలపై 0.4శాతం రుసుమును ప్రవేశపెట్టింది. అదే సమయంలో, రోజువారీ వ్యక్తిగత లావాదేవీలు, చిన్న చెల్లింపులను ఇలాంటి రుసుం నుంచి స్పష్టంగా మినహాయించింది. అంతకంటే ఎక్కువ రూ.75,000 చెల్లింపులకు ఎండిఆర్ రూ.300 వద్ద పరిమితం చేయబడుతుంది. రైల్వేలు, టెలికాం, భీమా, ఇంధనం, వ్యవసాయ ఉత్పాదకాలు వంటి అత్యవసర, తక్కువ లాభదాయక రంగాలు రూ.2,000 దాటిన ప్రతీ లావాదేవికి రూ.5 చొప్పున స్థిరమైన ఎండిఆర్‌ను చెల్లిస్తాయి. మ్యూచ్‌వల్ ఫండ్స్, సెక్యూరిటీలు, స్టాక్ బ్రోకర్లు, డీలర్ల ద్వారా చేసే చెల్లింపులపై 0.02శాతం ఎండిఆర్ వర్తిస్తుంది. దీని గరిష్ఠ పరిమితి కూడా రూ.300గా ఉంటుంది. యుపిఐ లావాదేవీల పరిమాణంలో 37శాతం, దాని లావాదేవీల విలువలో 70శాతం వాటాను కలిగి ఉన్న వ్యక్తి నుండి వ్యక్తికి (పి2పి) బదిలీలపై వాటి పరిమాణంతో సంబంధంలేకుండా,ఎటువంటి చార్జీలు లేకుండా కొనసాగుతున్నాయి. సెప్టెంబరు 28నాటి సుప్రీంకోర్టు కాజ్ లిస్ట్ ప్రకారం.. ఈ పిటిషన్ భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ముందు విచారణకు రానుంది. న్యాయవాది అంజన్ డి దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్), కేంద్రం యొక్క సెప్టెంబరు 14నోటిఫికేషన్‌ను సెప్టెంబరు 15న ప్రకటించిన ఎండిఆర్ ఫ్రేమ్ వర్క్‌ను సవాల్ చేసింది. ఈ ఫ్రేమ్ వర్క్ అక్టోబరు 15నుంచి అమలులోకి వస్తుందని పేర్కొనబడింది. తగిన చట్టబద్ధమైన రక్షణలు, పారదర్శకత లేదా ప్రజాసంప్రదింపులు లేకుండా ఈ పన్నును ప్రవేశపెట్టారని పిటిషన్‌లో ఆరోపించారు. ఇది పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ యాక్ట్ 2007 యొక్క సవరించిన సెక్షన్ 10ఏ రాజ్యాంగబద్ధతను సవాల్ చేస్తూ, 'అది ఏ ఎలక్ట్రానిక్ చెల్లింపు విధానాలకు ఉచిత రక్షణ లభించాలో నిర్ణయించేందుకు కార్యనిర్వాహకవర్గానికి అనియంత్రిత అధికారాలను ఇస్తుంది. సక్రమంగా అధికారం పొంది, ధృవీకరించబడి, ప్రచురించబడిన చట్టబద్ధమైన సాధనం లేకుండా, కేవలం పత్రికా ప్రకటన (ప్రెస్ రిలీజ్) లేదా 'ఎఫ్ఏక్యూ'స్ ఆధారంగా ఎటువంటి ఎండిఆర్ లేదా సారూప్య నిర్బంధ రుసుంను విధించరాదు లేదా వసూలు చేయరాదు' అని ప్రకటించాలి. యుపిఐ లావాదేవీలు, రూపే డెబిట్ కార్డు చెల్లింపుల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని పిటిషనర్ ప్రశ్నించారు. ద్రవ్య పరిమితి లేకుండా రూపే డెబిట్ కార్డులకు ఈ నోటిఫికేషన్ చార్జి రహిత రక్షణ కొనసాగిస్తుందని పిటిషనర్ పేర్కొన్నారు. ఈ ఫ్రేమ్‌వర్క్ 'ఏకపక్షమైనది', 'వివక్షాపూరితమైనదని', ఇది వ్యాపారులను ముఖ్యంగా, తక్కువ లాభాలు ఉన్నవారిని ప్రతికూలంగా ప్రభావితం చేయవచ్చని, అలాగే, పరోక్ష వినియోగభారం, డిజిటల్ బహిష్కరణపై కూడా ఆందోళనను రేకెత్తిస్తుందని పిటిషన్‌లో ఆరోపించారు. రూ.2,000 పైబడిన యుపిఐ లావాదేవీలపై ఎండిఆర్ విధించే వరకు ఆ ఫ్రేమ్‌వర్క్‌ను రద్దు చేయాలని లేదా నిలిపివేయాలని కోరింది. ప్రత్యామ్నాయంగా పారదర్శక సంప్రదింపులు, అనుభవపూర్వక డేటా ప్రచురణ, ప్రభావ అంచనాతోపాటు సూక్ష్మ, చిన్నతరహా సంస్థలకు రక్షణ చర్యల అనంతరం ఈ ఫ్రేమ్‌వర్క్‌ను పున: పరిశీలించాలని కోరింది. 'భవిష్యత్తులో చేసే ఏ ఎండిఆర్ వర్గీకరణ అయినా వర్తకుల టర్నోవర్, చట్టబద్ధమైన ఎంఎస్ఎంఇ హోదా, వాస్తవ మార్జిన్లు, భౌగోళిక ప్రాంతం, ఖర్చును భరించే సామర్థ్యంతో సహా సంబంధిత అంశాల ఆధారంగా జరగాలి, ఎటువంటి ఆధారాలు లేని ఏకపక్ష విధానాన్ని నివారించాలి' అని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ విషయంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ)తో సహా ఇతరులను ప్రతివాదులుగా చేర్చింది.



## వెనిజులాలో 39 మంది ఖైదీల విడుదల

**కారకస్:** వెనిజులా తాత్కాలిక ప్రభుత్వం తాజా విడతగా ఆదివారం 39 మంది రాజకీయ ఖైదీలను విడుదల చేసింది. ఈ ఏడాది జనవరినెలలో దేశాధ్యక్షుడు నికొలస్ మదురోను అమెరికా ప్రభుత్వం కుట్రపూరితంగా కిడ్నాప్‌చేసి వారి దేశంలోని జైలుకు తరలించిన తర్వాత విడతల వారిగా ప్రతిపక్ష రాజకీయ ఖైదీలను తాత్కాలిక అధ్యక్షుడు డెల్సీ రోడ్రిగ్జ్ ప్రభుత్వం విడుదల చేస్తూ వస్తోంది. తాజా విడతలో మరో 39 మందిని ఆమె విడుదల చేశారు. అమెరికా ప్రభుత్వం మద్దతుతో తాత్కాలిక ప్రభుత్వానికి,ప్రతిపక్ష ప్రతినిధులకు మధ్య రెండో విడత జరిగిన చర్చల ఫలితంగా ఈ రాజకీయ ఖైదీలు బాహ్యప్రపంచంలోకి వచ్చారు. నార్కో టెర్రరిజం ఆరోపణలపై 2021లో జైలుపాలలైన ఎనిమిది మంది మహిళలు,నికొలస్ మదురోను అధ్యక్ష పదవి నుండి దించేందుకు అమెరికా ప్రభుత్వ సహకారంతో కుట్రకు పాల్పడ్డారన్న ఆరోపణలపై 2020లో అరెస్టు అయిన మరో ఆరుగురు వ్యక్తులు కూడా జైలు నుండి విడుదలైనవారిలో ఉన్నారని మానవ హక్కుల సంఘం ''జస్టిసియా ఎన్‌క్వెంట్రో వై పెర్డాన్ (జెఇపి) ఒక ప్రకటనలో తెలియజేసింది.ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సమావేశంలో సెప్టెంబరు 22న ట్రంప్ మాట్లాడుతూ, మాదక ద్రవ్యాలను ఎగుమతి చేస్తున్న దేశాల జాబితా నుండి వెనిజులాను తొలగిస్తున్నట్లు ప్రకటించారు. వెనిజులా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ కూడా సమితి సమావేశంలో మాట్లాడుతూ, దేశంలో పార్లమెంటుకు ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకటించారు. కానీ ఒక తేదీని మాత్రం వెల్లడించలేదు. అమెరికా ఒత్తిడితో రోడ్రిగ్జ్ ఖైదీల విడుదలకు క్షమాభిక్ష చట్టాన్ని తీసుకువచ్చినప్పటికీ ఖైదీల విడుదల అంతవేగంగా సాగడంలేదు. ఆగస్టు పదో తేదీన ప్రభుత్వం 131 మందిని విడుదల చేసింది. నికొలస్ మదురోను అరెస్టుచేసిన తర్వాత నుండి ఇప్పటివరకూ జైళ్ళ నుండి 1000 మంది విడుదలయ్యారని అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియో చెప్పారు. కారకస్‌లో అమెరికా రా యబార కార్యాలయం వెలుపల నిత్యం రాజకీయఖైదీల కుటుంబీకులు నిరసన ప్రదర్శనలు చేస్తున్నారు. ఇంకా 344 మంది రాజకీ య ఖైదీలను విడుదల చేయాల్సి ఉందన్నది తాత్కాలిక సమాచారం.

## పరిశీలించి క్రమబద్ధీకరించాలి

**(మొదటి పేజీ తరువాయి)**

పేర్కొన్నారు. అర్హత కలిగిన కేసుల్లో నిబంధనల ప్రకారం అవసరమైన అన్ని ప్రక్రియలను పూర్తి చేసి క్రమబద్ధీకరణ చర్యలు తక్షణమే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. యుఎల్‌సి సమస్యల పరిష్కారానికి గత ప్రభుత్వం 2016లో జీవో జారీ చేసినప్పటికీ, ఆ జీవోను అమలు చేయకపోవడంతో ఏళ్ల తరబడి దరఖాస్తులు పెండింగ్ లోనే ఉన్నాయని వివరించారు. 22ఎ సమస్యల పరిష్కారానికి ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేశామని, ఆ తర్వాత జి.ఓ 118కు అనుగుణంగా మెమో జారీ, ఆ వెంటనే జిఓ 76కు అనుగుణంగా మెమో జారీ చేసినట్టు వివరించారు. 22ఎలో ఉన్నప్పటికీ జిహెచ్ఎంసి, హెచ్ఎండిఎ,డిటిసిపి మున్సిపల్ అనుమతులు కలిగిన ఇళ్లు, ప్లాట్లు, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లకు అనుమతినిస్తూ ఉత్తరులు జారీ చేశామన్నారు. తాజాగా దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న యుఎల్‌సి దరఖాస్తుల పరిష్కారానికి స్పష్టమైన ఉత్తర్వులు ఇచ్చామని, మిగిలిన అన్ని సమస్యలకు వేగవంతమైన పరిష్కారం చూపిస్తామని పొంగులేటి తెలిపారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యల నుంచి ప్రజలకు విముక్తి కల్పిస్తామని, వారికి ఇబ్బందులు కలిగిస్తున్న ప్రతి భూ సమస్యను పరిశీలించి, చట్టం, నిబంధనలకు అనుగుణంగా పరిష్కరించడమే తమ ప్రభుత్వ ప్రథమ లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం 2016లో యుఎల్‌సి కింద పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించేందుకు జిఒ జారీ చేసినప్పటికీ, దానిని అమలు చేయకపోవడంతో వేలాది దరఖాస్తులు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్నాయని, ఫలితంగా ప్రజలు తమ భూములపై హక్కులు, లావాదేవీల విషయంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని వివరించారు. 22ఏ సమస్యలకు ఫాస్ట్రాక్ విధానంలో పరిష్కరించే దిశగా ప్రజా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మంత్రి పొంగులేటి అన్నారు.

## కాంగ్రెస్ మద్దతు అధర్మం

**(మొదటి పేజీ తరువాయి)**

విషయంలో కాంగ్రెస్ రాజకీయ జోక్యం చేసుకోవడం సరికాదన్నారు. అధికార పార్టీ వారి సం ఘం తరపున పోటీ చేయాలని, తాము తమ సంఘం తరపున మేం పోటీ చేస్తామని గెలుపోటములను కార్మికులే నిర్ణయిస్తారన్నారు. ఎవరి సంఘాన్ని వారు బలోపేతం చేసుకోవాలి కానీ ఒక సంఘాన్ని ఓడించేందుకు మరో సంఘానికి రాజకీయంగా మద్దతు ఇవ్వడం సరికాదు అని అన్నారు. సింగరేణి కార్మిక సంఘం ఎన్నికల సమయంలోనూ రాజకీయ జోక్యం పెరిగిందని, ఆర్‌టిసి ఎన్నికలను కూడా అదే తరహాలో రాజకీయ పోరాటంగా మార్చవద్దని సూచించారు.

**కాంగ్రెస్‌కు టిడబ్ల్యూయుకు మద్దతా?**

తెలంగాణ వర్కర్స్ యూనియన్‌కు కాంగ్రెస్ నాయకత్వం మద్దతు ఇవ్వడం ఆ సంఘానికి కాంగ్రెస్ అనుబంధం కల్పిస్తున్నట్లు ప్రకటించడం అధర్మమన్నారు. కాంగ్రెస్ అనుబంధ సంఘం ఐఎన్‌టియూసిని పక్కన పెట్టి మరో సంఘానికి మద్దతు ఇవ్వడం వెనుక ఉద్దేశం ఏమిటో కాంగ్రెస్ నాయకత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. బిజెపి ఓటు చోరీకి పాల్పడితే కాంగ్రెస్ యూనియన్ చోరీకి పాల్పడుతోందని ఆయన విమర్శించారు.టియుడబ్ల్యూకు కాంగ్రెస్ మద్దతు ఇవ్వడం వెనుక కుట్ర దాగి ఉందన్న అనుమానం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఆ యూనియన్ గెలిస్తే ప్రభుత్వంలో ఆర్‌టిసిని విలీనం చేయకుండ ఉండడంలో భాగంగానే ఈ మద్దతు ఇస్తుందనే అనుమానం ఉందని, దీనిని ఆర్‌టిసి కార్మికులందరు గమనించాలని కోరారు. అధికార పార్టీఎంత హంగామా చేసినా, ఎంత డబ్బు ఖర్చు చేసినా కార్మికులకు వాస్తవాలు తెలుసన్నారు.

**ఎఐటియుసి పోరాటాల వల్లే ఎన్నికలు'**

ఆర్‌టిసిలో గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగే పరిస్థితి రావడానికి ఎఐటియూసి, ఇతర కార్మిక సంఘాల పోరాటాలే కారణమని కూనంనేని పేర్కొన్నారు. కార్మికుల హక్కుల కోసం జరిగిన పోరాటాల్లో పలువురు ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు. గతంలో జరిగిన సమ్మెల్లో ఆర్టీసీ కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఉద్యమాల్లో ప్రాణత్యాగాలు చేసిన కార్మికుల త్యాగాలను మర్చిపోకూడదన్నారు. ఈ ఎన్నికల్లో 'చివరకు ఎర్రజెండానే గెలుస్తుంది'ఆర్‌టిసి కార్మికుల సమస్యలపై తమ పోరాటం కొనసాగుతుందని కూనంనేని స్పష్టం చేశారు. ఎస్.బాబు, ఈదుర వెంకన్నలు మాట్లాడుతూ ఆర్‌టిసి గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధర్మానికి పాల్పడుతోందని ఆరోపించారు. గతంలో ఒక యూనియన్‌కు కేటాయించిన గుర్తును మరో యూనియన్‌కు కేటాయించడం చట్టవిరుద్ధమన్నారు. ఈ అంశాన్ని నిరసిస్తూ సోమవారం లేబర్ కమిషనర్ కార్యాలయం ముందు భారీ నిరసనను వ్యక్తం చేయనున్నట్లు ప్రకటించారు.

# నేపాల్‌లో హిమపాతం, వర్షాలు, వరదలు

- పదిమంది పర్వతారోహకులు గల్లంతు
- కొండచరియలు విరిగిపడి నలుగురు శిథిలాల్లో సమాధి
- ప్రమాదస్థాయి దాటి ప్రవహిస్తున్న నదులు కొట్టుకుపోయిన వంతెనలు, ఇళ్ళు



**కాఠ్మండు:** నేపాల్‌లో భయంకరమైన వాతావరణ ఉత్పాతం సంభవించిన నెలరోజులు తర్వాత మరోసారి ఆ దేశంలోని పలు ప్రాంతాలలో ఎడతెగని వర్షాలవల్ల వరదలు ముంచెత్తాయి. కొండచరియలు విరిగిపడ్డాయి.అనేక నివాసిత ప్రాంతాలు జలమయమయ్యాయి.మరోవైపు హిమపాతం విరుచుకుపడటంతో పర్యాటకులు గల్లంతయ్యారు. వరదల్లో ఆరుగురు మరణించారు. మరో నలుగురు గల్లంతయ్యారు.శిథిలాలను తొలగించే కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. జలవిద్యుత్ ప్రాజెక్టులో అన్ని గేట్లూ తెరచి విద్యుత్ ఉత్పత్తి నిలిపివేశారు. పృథ్వీ హైవేలోని మాలేఖు—ముగ్లిన్ సెక్షన్‌లో 11 ప్రాంతాలలో కొండచరియలు విరిగిపడ్డాయి.ఈ ఆటంకాలను తొలగించేందుకు సహాయ కార్యక్రమాలు చేపట్టారు.ఎక్స్‌పెడిషన్స్ ఆపరేషన్ అసోసియేషన్ ఆఫ్ నేపాల్ చెప్పిన సమాచారం ప్రకారం,మనంగ్‌జిల్లాలోని హిమ్లుంగ్ హిమాల్ శిఖరంపై హిమపాతం విరుచుకుపడటంతో పదిమంది పర్వతారోహకులు గల్లంతయ్యారు. అధికారులు పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నామని పర్యాటకశాఖ డైరెక్టర్ జనరల్ రామకృష్ణ లమిచానే చెప్పారు.

హగ్దీఖోలా—జవాంగ్ ఖోలా మధ్య ప్రాంతంలో 200 మీటర్ల మేరకు భారీ బండరాళ్ళు అడ్డంగా పడిఉన్నాయి. హనుమాన్ నగర్ కంకలిని మున్సిపాలిటీ, తిలతికోయిలాడి రూరల్ మున్సిపాలిటీలో 500 నివాసాలు నీట మునిగాయి. బాగ్లుంగ్, పాల్పా, మ్యాగ్ది ప్రాంతాలలో గడచిన రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీనివల్ల నేపాల్ వ్యాప్తంగా కొండచరియలు విరిగిపడుతున్నాయి. భారీ వరదల కారణంగా ఆరుగురు మరణించారు. బాగ్లుంగ్‌లోని నిసిఖోలా రూరల్ మున్సిపాలిటీ—3 ప్రాంతంలో జరిగిన ఘోర విషాదంలో కొండచరియలు విరిగి పడటంతో ఒక ఇంట్లో ఉన్న ఒకే కుటుంబానికి చెందిన నలుగురు శిథిలాల్లో సమాధి అయ్యారు.మృతులను 45 ఏళ్ళు వయసుగల శ్యామ్‌కుమారి బికె, ఆమె ముగ్గురు కుమారు మనోజ్, ముఖేశ్, నిషాలుగా గుర్తించారు. పాల్పాలోని మాతాగఢి,రిబ్దికోట్ గ్రామీణ ప్రాంతాలలో రెండు వేరు వేరు ఘటనల్లో కొండచరియలు విరిగిపడి ఇద్దరు మరణించారు. శిథిలాల్లో చిక్కుకుని ముగ్గురు గల్లంతయ్యారు. మరణించినవారిని షేర్‌బహదూర్ షిడి(75), కృష్ణకుమారి సారులుగా గుర్తించారు.పశ్చిమ నేపాల్‌లో హమ్లా, కాలీఖోట్, సుర్ఖేత్‌లలోని కర్నాలీ కారిడార్, కర్నాలీ హైవేలలో కొన్ని ప్రాంతాలు కొండచరియలు పడటంవల్ల దిగ్బంధనంలో ఉండిపోయాయి. మ్యాగ్దిలోని కాళి గండకి నది ఉప్పొంగడంతో వంతెనలు, ఇళ్ళు కొట్టుకుపోయాయి. అన్నపూర్ణ రూరల్ మున్సిపాలిటీలోని పోఖరే బాగర్‌లో వంతెన కొట్టుకుపోయింది.

పృథ్వీహైవే, నారాయణ్ గఢ్—ముగ్లిన్‌రోడ్, కర్నాలీ కారిడార్ సహా పలు ప్రధాన రహదారులలో కొండచరియలు విరిగిపడ్డాయి. వరదలు ముంచెత్తాయి. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది.చిత్వాన్ ప్రాంతంలో నారాయణి,రియు నదులు ప్రమాదస్థాయిని దాటి ప్రయాణం చేస్తూ ఉండటంతో అక్కడి నుండి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. అనేక రాష్ట్రాలలో భారీ వరదల కారణంగా మరోసారి నష్టం వాటిల్లింది. ఇళ్ళు, వంతెనలు, జలవిద్యుత్ ప్రాంతాలు, రహదారులు, మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయి.

నేపాల్—టిబెట్ సరిహద్దుల్లో నెలరోజుల క్రితం భారీ హిమపాతం కారణంగా జరిగిన జలవిలయంలో ఈనాటికీ 5,285 మంది జాడ తెలియలేదు. ఈ విలయంలో ఇప్పటివరకూ 1,453 మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు.

## స్పెయిన్‌లో ఇంటి అద్దెలు పెనుభారం

**వేలాదిమంది నిరసన ప్రదర్శన**



**మాడ్రిడ్:** స్పెయిన్‌లో గృహ సంక్షోభం తలెత్తింది. దీంతో దేశ రాజధాని నగరం మాడ్రిడ్‌లో వేలాదిమంది నిరసన ప్రదర్శనకు దిగారు.స్పెయిన్‌లోని ప్రధాన నగరాల్లో ఇంటి అద్దెల ధరలు ఇటీవలికాలంలో విపరీతంగా పెరిగిపోయాయి. 87 ఏళ్ళు వయసుగల ఒక వృద్ధ మహిళను పోలీసులు ఈ వారంలో నాటకీయ పద్ధతులలో ఇంటినుండి ఖాళీ చేయించి బయటకు వెళ్ళగొట్టారు. ఈ ఘటన ప్రజలకు తీవ్ర ఆగ్రహం రప్పించింది. పెరుగుతున్న ఇంటి అద్దెలు,నిత్యావసర,జీవన వ్యయాలు పెనుభారంగా మారాయి. ఈ దశలో ఇంటి అద్దెల బాకీలు తీర్చలేనివారిని బలవంతంగా ఇళ్ళు ఖాళీ చేయిస్తున్నారు. ఇలాంటి ఘటనలు స్పెయిన్‌లో రోజు రోజుకూ పెరుగుతున్నాయి.పెరుగుతున్న ఇంటి అద్దెలు,గృహ సంక్షోభానికి వ్యతిరేకంగా వేలాదిమంది నిరసన ప్రదర్శనకు దిగారు.వీధుల్లోనే తాత్కాలిక గుడారాలు వేసుకుని అందులో కూర్చుని ప్రదర్శకులు నిరసన తెలియజేశారు.ప్యూర్టా డెల్‌సోల్ స్క్వేర్ వద్ద ప్రదర్శకులు శిబిరాలు నిర్మించుకుని నిరసన తెలియజేస్తున్నారు. అక్కడే ఉండిపోవాలని ప్రదర్శకులునిర్ణయించుకున్నారు. కానీ పోలీసులు వారిని బలవంతంగా అక్కడినుండి తరిమికొట్టారు. మాడ్రిడ్ టెనెట్స్ యూనియన్ అంచనా ప్రకారం మూడు లక్షలమంది ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. కానీ పోలీసులు మాత్రం25,000 మంది ఈ నిరసనల్లో పాల్గొన్నారని చెప్పారు. ఇంటి అద్దెలు ప్రజలకు అందుబాటులో లేవని సర్వత్రా ఆగ్రహం పెల్లుబుకుతోంది.పర్యాటకులు,వలస ప్రజల కారణంగా నగరాలపై తీవ్రమైన ఒత్తిడి పెరిగింది. ఇళ్ళ అద్దెలు పెరిగాయి. దీనివల్ల స్థానిక స్పెయిన్ జాతీయులు సమస్యలు ఎదుర్కొంటున్నారు. నగరాల్లో ఇళ్ళ కొరత ఉంది. ఈ ఏడాది 5.50 లక్షల ఇళ్ళ కొరత ఉందని స్పెయిన్ జాతీయ బ్యాంక్ అంచనావేసింది. వచ్చే ఏడాది స్పెయిన్ పార్లమెంటుకు కీలకమైన ఎన్నికలు జరగనున్నాయి. ఈ దశలో ప్రభుత్వ వ్యతిరేకత భారీగా పెరిగింది.



## దక్షిణాఫ్రికాలో కాల్పులు: 27 మంది మృతి

**20 మందికి గాయాలు: రెండు వాహనాలు దగ్ధం**

**8 మంది నిందితులకోసం ముమ్మర గాలింపు**

**కేప్‌టౌన్:** దక్షిణాఫ్రికాలో రెండు వేరు వేరు ప్రాంతాలలో గుర్తుతెలియని దుండగులు శనివారం రాత్రి,ఆదివారం తెల్లవారకముందు విచక్షణా రహితంగా కాల్పులు జరిపారు. ఈ కాల్పుల ఘటనల్లో 27 మంది పైగా మరణించారు. మరో 20 మంది పైగా గాయపడ్డారు.ఈ కాల్పులకు గల కారణాలు తెలియరాలేదు.కాల్పులకు పాల్పడిన వారంతా ఎకె—47 తుపాకులు,పిస్టోళ్ళు ధరించి తిరుగుతున్నారని పోలీసులు గుర్తించారు.మొదటిసారి జరిగిన కాల్పుల ఘటనల్లో ఎనిమిది మంది నిందితులు,రెండోసారి కాల్పుల్లో అనేకమంది నిందితులకోసం పోలీసులు తీవ్ర గాలింపు చర్యలు చేపట్టారు. డిటెక్టివ్‌లను,ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. కాల్పుల ఘటనకు కారణాలు తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు.ల్యాండ్‌ల్వే పోలీసులు హత్య,హత్యాయత్నం కేసులు నిందితులపై నమోదు చేశారు. గాయపడినవారిని ఆసుపత్రులకు తరలించారు. రాజధాని జోహన్నెస్‌బర్గ్‌కు నైరుతీ ప్రాంతం దర్బన్ సిటీ సమీపం వెడెలాలోని టావెర్న్‌లో శనివారం రాత్రి ఒక ఇంట్లో పార్టీ జరుగుతున్న సమయంలో మొదటి కాల్పుల సంఘటన జరిగింది.ఈ ఘటనలో 17 మంది మరణించారు. మరో 15 మంది గాయపడ్డారు. ఇంట్లో పార్టీ జరుగుతున్న సమయంలో ఇంటి వెలుపల గుమిగూడిన వారు లోపలికి ప్రవేశించే సమయంలో కాల్పులు జరిగాయి. ఈ ఘటన తర్వాత దుండగులు వారి మొబైల్ ఫోన్లు తస్కరించి తీసుకుపోయారు. అనుమానితులు రెండు వాహనాల్లో పరారయ్యారు. కాల్పుల సమయంలో మరో రెండు వాహనాలను దగ్ధం చేశారు. రెండోసారి కాల్పుల సంఘటన కేప్‌టౌన్‌కు సమీప పట్టణ ప్రాంతం ల్యాండెల్‌లో ఉన్న ఒక స్టోరులో జరిగింది. ఈ కాల్పుల్లో ఒక గర్భిణీ సహా 11 మంది మరణించారు. మరో ఐదుగురు గాయపడ్డారు.దక్షిణాఫ్రికాలో హింసాత్మక ఘటనలు పెచ్చుమీరిపోయాయి. దీనిని ప్రభుత్వం అదుపు చేయలేకపోతోంది. దీంతో ప్రభుత్వంపై బాగా ఒత్తిడి పెరిగింది. పోలీసు వ్యవస్థ సమర్థతను ప్రజలు ప్రశ్నిస్తున్నారు.నేరముఠాలు ఇటీవలికాలంలో బాగా విజృంభించాయి.పట్టణ ప్రాంతాలలో హింసాత్మక ఘటనలు బాగా పెరిగిపోయాయి.

**రోడ్డు ప్రమాదంలో 11 మంది మృతి**

దక్షిణాఫ్రికాలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో 11 మంది మరణించారు. ఎంటుబటుబా సమీపంలో జాతీయరహదారి—2పై ఒక టాక్సీని లారీ ఢీకొట్టింది. ప్రధానమంత్రివ కార్యాలయం సమాచారం ప్రకారం 11 మంది మరణించగా,మరో తొమ్మిది మంది గాయపడ్డారు.క్వాజులు—నటాల్ రాష్ట్ర ముఖ్యమంత్రి థమ్సాంక్వాత్సులి చెప్పారు.సంగీత ప్రియులు మస్కాండీ సంగీతోత్సవంలో పాల్గొని ఇళ్ళకు తిరిగి వెళుతున్న సమయంలో జాతీయ రహదారిపై ఈ ప్రమాదం సంభవించింది.ప్రమాదం తర్వాత టాక్సీలో మంటలు చెలరేగాయి. మరణించినవారిలో తొమ్మిదిమంది గుర్తించడానికి సాధ్యంకానంతస్థాయిలో దహనమయ్యారు.మృతులకు ముఖ్యమంత్రి కార్యాలయం ప్రగాఢ సంతాపం తెలియజేసింది. ప్రయాణికులు చాలా అప్రమత్తంగా ఉండాలని,మద్యం సేవించి వాహనాలు నడపవద్దని,తెల్లవారుజాము ప్రాంతంలో అలసట వస్తుందని, ఆ సమయంలో వాహనాలు నడపవద్దని ముఖ్యమంత్రి కార్యాలయం ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

## రాష్ట్రంలో 41 కొత్త 2బీ బార్లకు దరఖాస్తుల ఆహ్వానం

- రూ.లక్ష దరఖాస్తు రుసుము..
- ఈనెల 28 నుంచి అక్టోబర్ 12 వరకు అవకాశం
- క్యూర్ పరిధిలో 14.. ఇతర మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో 27 బార్లు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణలో కొత్తగా 41 '2బీ' బార్ల ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. క్యూర్ పరిధిలో 14, మిగిలిన మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పరిధిలో మరో 27 బార్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తూ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈనెల 28 నుంచి అక్టోబర్ 12 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఒక్కో దరఖాస్తుకు రూ.లక్ష రుసుము చెల్లించాల్సి ఉంటుంది. క్యూర్ ఏర్పాటు, కొత్త మున్సిపాలిటీల ఏర్పాటు, వివిధ గ్రామాలను మున్సిపాలిటీల్లో విలీనం చేయడంతో పెరిగిన జనాభాకు అనుగుణంగా కొత్త 2బీ బార్ల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతించినట్లు ఎక్సైజ్ శాఖ వెల్లడించింది. క్యూర్ పరిధిలోని గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్న 14 బార్లకు దరఖాస్తులను అబ్కారీ భవన్‌లోని కమిషనర్ కార్యాలయంతోపాటు సంబంధిత డిప్యూటీ కమిషనర్ కార్యాలయాల్లో సమర్పించవచ్చు. దరఖాస్తులను ఉదయం 10 గంటల నుంచి సా యంత్రం 5 గంటల వరకు ప్రభుత్వ పనిదినాల్లో మాత్రమే స్వీకరిస్తారు. మిగిలిన 27 బార్లకు ఆయా జిల్లాల డిప్యూటీ కమిషనర్ కార్యాలయాలు, కమిషనర్ కార్యాలయం, సంబంధిత డిప్యూటీ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి (డిపిఇఒ) కార్యాలయాల్లో దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుంది. సైబరాబాద్ పరిధిలో అలియాబాద్‌లో ఒకటి, చింతలపల్లి, ఎల్లంపేట మున్సిపాలిటీల్లో రెండేసి బార్లకు దరఖాస్తులు ఆహ్వానించారు. వీటికి సంబంధిత సైబరాబాద్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చు. రంగారెడ్డి డిప్యూటీ కమిషనర్ పరిధిలోని ఫ్యూచర్ సిటీలో చేవెళ్ల మున్సిపాలిటీలో ఒకటి, మొయినాబాద్‌లో రెండు బార్లకు దరఖాస్తులు స్వీకరిస్తారు. వికారాబాద్ జిల్లాలో కొడంగల్, పరిగి మున్సిపాలిటీల్లో, సంగారె డ్డి జిల్లాలో గడ్డిపోతారం, కోహిర్‌లలో ఒక్కొక్కటి, గుమ్మడాలలో రెండు బార్ల కు దరఖాస్తులు ఆహ్వానించారు. అదేవిధంగా ఆసిఫాబాద్, అశ్వారావుపే ట, కల్లూరు, మక్తల్, మహబూబ్‌నగ ర్, దేవరకద్ర, బోధన్, బీబీపేట, నర్స ంపేట, స్టేషన్‌ఘన్‌పూర్, మహబూబాబాద్, కేసముద్రం, ములుగు తదితర మున్సిపాలిటీల్లో కొత్త 2బీ బార్ల ఏర్పాటుకు దరఖాస్తులు స్వీకరించనున్నా రు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 2బీ బార్లకు ఏటా రూ.44 లక్షలు ఎక్సైజ్ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుం ది. నిజామాబాద్ జిల్లాలోని బోధన్ బార్‌కు రూ.42 లక్షలు, మిగిలిన 2బీ బార్లకు ఏటా రూ.30 లక్షలు ఎక్సైజ్ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుందని ఎక్సై జ్ శాఖ తెలిపింది. దరఖాస్తుదారులు పూర్తి నిబంధనలు, బార్‌ల వివరాలు, దరఖాస్తు విధానం తదితర సమాచారాన్ని tgbcl.telangana.gov.in వెబ్‌సైట్‌లో పరిశీలించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కమిషనర్ హరికిరణ్ సూచించారు.

## కాంగోలో బోటు బోల్తా

**12 మంది మృతి**

**డజన్లమంది గల్లంతు**

**కిన్షాసా:** సెంట్రల్ ఆఫ్రికాదేశం ఈస్టర్న్ కాంగో (డి.ఆర్.కాంగో)లో బోటు బోల్తా పడింది.కివూ లేక్‌లో ఆదివారం జరిగిన ఈ ప్రమాదంలో 12 మంది మరణించారు.పదుల సంఖ్యలో ప్రయాణికులు జాడతెలియకుండా పోయారు.ఈ ప్రమాదంలో జాడ తెలియని ప్రయాణికులకోసం ముమ్మరంగా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు చెప్పారు.కిషేకే గ్రామాధికారి ఫెలిక్స్ హెబిరాగి మాట్లాడుతూ,ఇప్పటివరకూ 15 మంది ప్రయాణికులను ప్రమాదం నుండి సురక్షితంగా ఒడ్డుకు చేర్చామని చెప్పారు. శనివారం రాత్రి ఈ బోటు దక్షిణ కివూ రాష్ట్రంలోని ఇజ్వి ఐలాండ్‌కు 50 మంది ప్రయాణికులతో బయలుదేరి వెళ్ళింది.కానీ ఈ బోటులో దాదాపు 80 మందిపైగా ఉంటారని స్థానిక మీడియా ప్రకటించింది. కాంగోలో ఇలాంటి ప్రమాదాలు చాలా తరచుగా జరుగుతున్నాయి.10 కోట్ల జనాభా దాటిన డి.ఆర్.కాంగోలో జలరవాణా అత్యంత కీలకం.ఐతే ఈ బోటు నీట మునిగి బోల్తా పడటానికి గల కారణాలు తెలియరాలేదు.ఐతే అధికబరువే ప్రధాన కారణంగా భావిస్తున్నారు.గడచిన గురువారం తంగన్యికారాష్ట్రంలోని తంగన్యికా లేక్‌లో ఒక బోటు ఇదేవిధంగా ఘోరంగా నీట మునిగిపోయింది. ఈ ప్రమాదంలో 41 మంది మరణించారు. ఈ ఘటన జరిగి ఇంకా వారం రోజులు కూడా గడవకముందే మరో ప్రమాదం సంభవించింది.

## కోహ్లీ మరో మైలురాయి

**వన్డేల్లో 15వేల పరుగులతో రికార్డు..!**

భారత స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ మరో మైలురాయిని అధిగమించాడు. వన్డేల్లో అత్యధిక శతకాలతో ఇప్పటికే రికార్డు నెలకొల్పిన విరాట్ ఈసారి.. 15వేల క్లబ్‌లో చేరాడు. అంతర్జాతీయంగా వన్డేల్లో ఈ ఘనత సాధించిన రెండో ఆటగాడిగా కోహ్లీ అవరించాడు. 50 ఓవర్ల ఫార్మాట్‌లో సచిన్ టెండూల్కర్ తర్వాత 15,000 రన్స్ కొట్టిన ఆటగాడిగా కోహ్లీ చరిత్ర సృష్టించాడు. ఆదివారం తిరువనంతపురం వన్డేలో అల్జారీ జోసెఫ్ ఓవర్లో బౌండరీ బాదిన కోహ్లీ.. 61 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద ఈ మైలురాయిని అందుకున్నాడు. పదిహేను వేల పరుగుల కోసం సచిన్ 377 ఇన్నింగ్స్‌లు తీసుకోగా.. విరాట్ 303 ఇన్నింగ్స్‌ల్లోనే ఈ క్లబ్‌లో చేరాడు.

## అభ్యంతరాలు ఎందుకొచ్చాయి?

**(మొదటి పేజీ తరువాయి)**

మార్పులు, పేర్ల తొలగింపు వంటి అంశాలపై ఎన్నికల కమిషనర్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు వచ్చిన వార్తలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ పోరాటం పదవుల కోసం కాదని, ప్రతి భారతీయుడి ఓటు హక్కును కాపాడేందుకేనని ఉత్తమ్ అన్నారు. ఓటు హక్కుపై దాడి అంటే రాజ్యాంగం గుండెపైనే దాడి అని అన్నారు. ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా తప్పించుకోవడం ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తుంది అని పేర్కొన్నారు. ఓటరు పేరు తొలగిపోవడం కేవలం సాంకేతిక లోపం కాదని, ఒక పౌరుడి ప్రజాస్వామ్య హక్కు కోల్పోవడమని అన్నారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా పారదర్శకమైన వ్యవస్థ, సమర్థవంతమైన అప్పీల్ అవకాశం కల్పించాలని కోరారు.సిఈసి తన నిర్ణయాలు, అంతర్గత అభ్యంతరాలు, ఓటర్ల జాబితా సాఫ్ట్‌వేర్‌లో మార్పులపై సమగ్ర వివరణ ఇవ్వాలని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోలేకపోతే రాజీనామా చేయాలని ఉత్తమ్ డిమాండ్ చేశారు. మా పోరాటం ఒక వ్యక్తికి వ్యతిరేకంగా కాదు.. ప్రతి పౌరుడి ఓటు కోసం అని స్పష్టం చేశారు.

## ప్రతిఘటిస్తాం

**(మొదటి పేజీ తరువాయి)**

అధిగమించచాల్సి ఉంటుందని బిబిసికి చెప్పారు. ఇరాన్ ప్రభుత్వాన్ని కూలదోసే ఉద్దేశం అమెరికాకు లేదనే విషయాన్ని ట్రంప్ నిరూపించుకోవాలని, దశలవారీగా ఇస్లామాబాద్ ఒప్పందాన్ని అమలు చేసేందుకు ఇరాన్ సిద్ధంగా ఉదని అన్నారు. కానీ కొద్ది గంటల్లోనే డోనాల్డ్ ట్రంప్ ఈ ఏడు రోజుల ప్రణాళికను నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. ఈ పూర్వరంగంలో ఇరాన్ మంత్రులు ఒకవైపు, ఇరాన్ సాయుధ బలగాలు మరోవైపు తమ తమ హోదాలకు తగ్గట్టుగా ట్రంప్ వ్యాఖ్యలను తిప్పికొట్టాయి. ఇదిలాఉండగా, ఈ సంక్షోభ పరిష్కారానికి అన్ని పక్షాలూ బహిరంగ చర్చలకు సిద్ధం కావాలని మధ్యవర్తిదేశం ఒమన్ పిలుపు ఇచ్చింది.

కాగా, బ్రిగేడియర్ జనరల్ షెకార్చీ శనివారం రాత్రి టెహ్రాన్‌లో జరిగిన ఒక ప్రత్యేక వార్తాకార్యక్రమంలో మాట్లాడుతూ, శత్రువును దిగ్భ్రాంతపరచే విధంగా ఎత్తుగడలు తమ వద్ద సిద్ధంగా ఉన్నాయని చెప్పారు.''ఇప్పుడు ఇరాన్ డ్రోన్లు, క్షిపణి సామర్థ్యం మరింత శక్తిమంతంగా మారాయి. ఆధునికతను సంతరించుకున్నాయి. ఎలాంటి దురాక్రమణ చర్యలనైనా నూతన సాంకేతిక, సైనిక పరిజ్ఞానంగా ప్రతిఘటిస్తాం'' అని హెచ్చరించారు. ఇస్లామిక్ విప్లవం తర్వాత ఇరాన్ సాయుధబలగాలు ఈనాడు అత్యాధునికంగా పరివర్తన చెందాయని, సంప్రదాయ యుద్ధస్థాయి నుండి అసమానమైన యుద్ధస్థాయికి ఎదిగాయని చెప్పారు. తాము చేసే అసమానమైన యుద్ధం సంప్రదాయ యుద్ధానికి పూర్తి భిన్నమైనదన్నారు. చాలా తక్కువ ఖర్చుతో, సరళంగా, శక్తిమంతంగా, ఆధునికంగా, ఆచరణాత్మకమైన రక్షణ పరికరాలతో శత్రుసైన్యాలకు చెందిన ఖరీదైన ఆయుధాలను ధ్వంసం చేయడం, ఎదుర్కోవడమే తమ అసమానమైన యుద్ధానికి అసలైన నిర్వచనమని చెప్పారు. సైనికుల త్యాగం, విశ్వాసం, ఆధ్యాత్మికతలపైనే తమ దేశ అసమానయుద్ధం ప్రధానంగా ఆధారపడి ఉందని, ఇకమీదట ఈ యుద్ధం ఎంతో ప్రభావవంతంగా ఉంటుందని షెకార్చీ స్పష్టం చేశారు. ఇకమీదట తక్షణ, వేగవంతమైన సమాచార వ్యవస్థకు ప్రాధాన్యత ఇస్తామని, రక్షణ విషయంలో ఇరాన్ తప్పుడు అంచనాలు వేసుకుందని శత్రువు భావించిందన్నారు. హోర్ముజ్‌లో జోక్యం చేసుకోవడంపై ఇకమీదట అమెకన్లు కలలు కనాలితప్ప ఆచరణలో నెరవేరదు, ఒకవేళ జోక్యం చేసుకుంటే పెద్ద దెబ్బతింటారు'' అని షెకార్చీ చెప్పారు. ఇరాన్ దారుణంగా ఓడిపోతున్నందువల్లనే ఏడు రోజుల ప్రణాళికను తెరమీదకు తెచ్చారని, ఇది తమకు ఆమోదయోగ్యం కాదని ట్రంప్ విమర్శించారు. హోర్ముజ్ జలసంధి పూర్తిగా అమెరికా అధీనలోనే ఉందని, భారీ పరిమాణంలో చమురు రవాణా జరుగుతోందని అన్నారు. ఆ తర్వాత అరాఘ్చీ స్పందిస్తూ, చర్చలు మాత్రమే ఈ యుద్ధాన్ని పరిష్కరించగలవన్నారు. అమెరికా నిర్ణయాత్మకమైన సానుకూల స్పందన కోసం ఇరాన్ వేచి చూస్తుందని, లేకపోతే యుద్ధంలో తేల్చుకుంటామన్నారు.గడచిన జూన్‌లో చేసుకున్న ''ఇస్లామాబాద్ ఒప్పందం''లోని షరతులే ఇప్పుడు కూడా సమస్య పరిష్కారానికి అందుబాటులో ఉన్నాయని చెప్పారు. జలసంధిని తెరవడం, శత్రుత్వాన్ని అంతం చేయడం అనే రెండు అంశాలనే అంతర్జాతీయ వేదికపై ఇరాన్ ప్రముఖంగా ప్రపంచం ముందుకు తీసుకువచ్చిందని చెప్పారు.

## హనుమకొండ ముస్తాబు

**(మొదటి పేజీ తరువాయి)**

విద్యారంగం ఎదుర్కొంటున్న సవాళ్లపై సెమినార్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సెమినార్‌లో ప్రముఖ విశ్లేషకులు మల్లేపల్లి లక్ష్మయ్య, కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కె.ప్రతాప్ రెడ్డి, రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ మార్క శంకర్ నారాయణ తదితరులు పాల్గొంటారు. మూడవ రోజు బుధవారం కాజీపేట బాల వికాస కేంద్రంలో రాష్ట్ర ప్రతినిధుల సభ జరుగుతుంది. ఈ సందర్భంగా రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగం సమస్యలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉట్కూరి ప్రణీత్ గౌడ్, బాషబోయిన సంతోష్ తెలిపారు.

**ఏఐఎస్ఎఫ్ ది 90 ఏళ్ల ఉద్యమ చరిత్ర**

స్వాతంత్ర్యోద్యమ కాలంలో ప్రారంభమైన ఎఐఎస్ఎఫ్ ప్రస్థానం 90 వసంతాలను పూర్తి చేసుకుంది.దేశచరిత్రలో విద్యార్థి ఉద్యమాలకు అగ్రగామిగా నిలిచిన అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) విద్యార్థి ఉద్యమ చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. స్వాతంత్ర్య పోరాటం మొదలుకొని నేటి వరకు విద్యారంగం సమస్యలపై అలుపెరుగని పోరాటం కొనసాగించింది. పాఠశాలలో, కళాశాలలో సమస్యలపై,విద్యార్థుల ఫీజు రీఎంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లపై, ఉపాధ్యాయుల కొరత, విద్యాసంస్థలలో మౌలిక సదుపాయాలపై ఉద్యమించింది. ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని పోరాటాల గడ్డ హనుమకొండ వేదికగా నిర్వహిస్తున్న ఈ త్రిదిన వేడుకలకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి ప్రతినిధులు, విద్యార్థి నాయకులు భారీ సంఖ్యలో తరలి వస్తున్నారు.

**హనుమకొండలో ఏర్పాట్లు పూర్తి**

అఖిల భారత విద్యార్థి సమాఖ్య 90వ వార్షికోత్సవ తెలంగాణ రాష్ట్ర స్థాయి ఉత్సవాలు నేటి (సెప్టెంబర్ 28) నుంచి మూడు రోజుల పాటు (సెప్టెంబర్ 28, 29, 30 తేదీలలో) హనుమకొండ జిల్లా కేంద్రంలో అత్యంత వైభవంగా ప్రారంభం కానున్నాయి. దీనికోసం గత కొన్ని రోజులుగా రాష్ట్ర, జిల్లా నాయకులు స్థానికంగా రాష్ట్ర వ్యాప్తంగా తరలి వచ్చే ప్రతినిధుల కోసం ఏర్పాట్లు పూర్తి చేసారు. ఇప్పటికే ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంట రెడ్డి, పుట్టా లక్ష్మ ణ్, తెలంగాణ రాష్ట్ర యూనివర్సిటీల ఇంచార్జ్ రెహమాన్ తదితరులు హనుమకొండకు విచ్చేసి ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

# కోహ్లీ, గిల్ శతకాలు.. తొలి వన్డేలో ఓడిన వెస్టిండీస్



వన్డే ప్రపంచకప్ సన్నాహక సిరీస్‌ను భారత జట్టు ఘనంగా మొదలెట్టింది. తిరువనంతపురంలో శివాలెత్తిన విరాట్ కోహ్లీ(139 నాటౌట్) వన్డేల్లో 55వ శతకంతో రెచ్చిపోగా.. కెప్టెన్ శుభ్‌మన్ గిల్(110) సెంచరీతో వెస్టిండీస్ బౌలర్ల భరతం పట్టాడు. రెండో వికెట్‌కు 151 పరుగుల భాగస్వామ్యంతో గెలుపు పునాది వేశారిద్దరూ. బౌండరీలతో దడ పుట్టించిన ఈ జోడీ విధ్వంసంతో 296 పరుగుల లక్ష్యం మంచు ముక్కలా కరిగిపోయింది. అలవోకగా గెలుపొందిన టీమిండియా మూడు వన్డేల సిరీస్లో అదిరే బోణీ కొట్టింది. విండీస్ నిర్దేశించిన 296 పరుగుల ఛేదనలో ఓపెనర్ రోహిత్ శర్మ(32) ఉన్నంతసేపు ఆకట్టుకున్నాడు. బౌండరీ వద్ద అల్జారీ జోసెఫ్ క్యాచ్ జారవిడవడంతో బతికిపోయిన హిట్‌మ్యాన్ పెద్ద స్కోర్ చేయలేదు. అతడు త్వరగా జెట్టైనా గిల్ దూకుడైన ఆటతో స్కోర్ బోర్డును ఉరికించాడు. తనదైన షాట్లతో అలరిస్తూ.. ఈ ఫార్మాట్‌లో 21వ ఫిఫ్టీ సాధించాడు గిల్. రోహిత్ ఔటయ్యాక విరాట్ కోహ్లీ(139 నాటౌట్) జతగా హాఫ్ సెంచరీ భాగస్వామ్యం నెలకొల్పాడు. అల్జారీ ఓవర్లో సిక్సర్తో విరాట్ యాభై పూర్తి చేసుకున్నాడు. రెండో వికెట్కు 151 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పిన ఈ జోడీని విడదీశాడు. గిల్ ఔటయ్యాక మరింత రెచ్చిపోయిన కోహ్లీ.. రోస్టన్ చేజ్ ఓవర్లో కళ్లు చెదిరే సిక్సర్లు బాదాడు. మోతీ ఓవర్లో బంతిని లాంగ్ ఆన్లో స్టాండ్స్‌కి పంపిన విరాట్.. వన్డేల్లో 55వ శతకం అందుకున్నాడు. సెంచరీ తర్వాత భీకరంగా ఆడిన కోహ్లీ.. షార్ట్ వేసిన 42వ ఓవర్లో సిక్సర్తో మ్యాచ్‌ను ముగించాడు. ఎనిమిది వికెట్ల తేడాతో గెలుపొందిన టీమిండియా మూడు వన్డేల సిరీస్‌లో సూపర్ బోణీ చేసింది.

# హై జంప్‌లో మెరిసిన పరుల్, తేజస్విన్



ప్రతిష్టాత్మక ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్లు పతకాల పంట పండిస్తున్నారు. ఎనిమిదో రోజు హై జంప్లో అన్నీ సోజన్ త్రుటిలో స్వర్ణం చేజార్చుకోగా, పురుషుల విభాగంలో సర్వేష్ కుశారే చరిత్రాత్మక వెండితో అదరగొట్టాడు. డెకథ్లాన్లో అంచనాలు అందుకున్న తేజస్విన్ శంకర్ కాంస్యం గెలుపొందాడు.. మహిళల 3వేల మీటర్ల స్టీపుల్ ఛేజ్లో పరుల్ చౌదరి అత్యుత్తమ వ్యక్తిగత ప్రదర్శనతో కంచు మోత మోగించింది.

నగోయాలో జరుగుతున్న ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్లు జోరు చూపిస్తున్నారు. మహిళల 200 మీటర్ల ఫైనల్లో హరిత భట్టా కంచు మోత మోగించిన కాసేపటికే లాంగ్ జంప్, డెకత్లాన్, స్టీపుల్ ఛేజ్లో పతకాలతో అదరగొట్టింది మన బృందం. మహిళల లాంగ్ జంప్ ఫైనల్లో సత్తా చాటిన అన్నీ సోజన్ అనూహ్యంగా రెండో స్థానంతో సరిపెట్టుకుంది. ఐదో ప్రయత్నంలో 6.53 మీటర్ల దూరం దూకిన తను పసిడి పక్కా అనుకుంది. కానీ, చైనా అథ్లెట్ హుయాంగ్ ఇంగింగ్ అందర్నీ ఆశ్చర్యపరుస్తూ 6.55 మీటర్ల జంప్తో స్వర్ణం ఎగరేసుకుపోయింది. ఇదే విభాగంలో కాంస్యంపై ఆశలు పెట్టుకున్న శైలిల్ సింగ్కు సైతం చుక్కెదురైంది. 6.41 మీటర్లతో మూడో స్థానంలో నిలిచిన ఆమెను 6.46 మీటర్లతో టాన్ మంగ్(జపాన్) వెనక్కి నెట్టి పతకం పట్టుకుపోయింది.

**చరిత్రాత్మక సిల్వర్...** పురుషుల హై జంప్లో సర్వేష్ కుశారే వెండి వెలుగులు విరజిమ్మాడు. ఫైనల్లో అతడు ఏకంగా 2.25 మీటర్లు జంప్ చేసి.. చరిత్రాత్మక పతకం ఒడిసిపట్టాడు. అయితే.. అతడు రెండో ప్రయత్నంలో ఈ దూరం అందుకోగా.. తొలి ప్రయత్నంలోనే ఇంత దూరం దూకిన సుహాన్ వు(చైనీస్ తైపీ) కు స్వర్ణం దక్కింది. డెకథ్లాన్లో తేజస్విన్ శంకర్ తనకు తిరుగులేదని చాటాడు. పది క్రీడల్లో సత్తా చాటిన అతడు చివరిదైన 1500 మీటర్ల పరుగులో అగ్ర స్థానం సాధించాడు. కానీ,7,934 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచిన అతడు దేశానికి కాంస్యం అందించాడు. ఇక మహిళల 3000 మీటర్ల స్టీపుల్ ఛేజ్లో పరుల్ చౌదరి అంచనాలు నిలబెట్టుకుంది. 9:08.67 సెకన్ల టైమింగ్తో లక్ష్యాన్ని పూర్తి చేసి తను కాంస్యంతో మురిసింది. ఇదే విభాగంలో భారత అథ్లెట్ అంకిత నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది.


## ఆరోగ్యం

# వ్యాధి ఒకరి సమస్య కాదు




## ఊపిరిని కబళిస్తున్న అభివృద్ధి

రాజస్థాన్‌లోని ఆరావళి పర్వత శ్రేణి చుట్టు పక్క ల గ్రామాల్లో గనుల తవ్వకం భూమి స్వరూపా న్ని మార్చేస్తున్నది. అక్కడి ప్రజల ఊపిరితిత్తులపై కూడా దాని ప్రభావం పడుతోంది. రాళ్లను తవ్వడం, పేల్చడం, డ్రిల్లింగ్ చేయడం, క్రషర్ యంత్రాల్లో రాళ్లను పగలగొట్టడం వంటి కార్యకలాపాలు పెద్ద మొత్తంలో సిలికా ధూళిని గాల్లోకి విడుదల చేస్తున్నాయి. ఈ అతి సూక్ష్మ కణాలు మనుషుల ఊపిరితో ఊపిరితిత్తుల్లోకి చేరి తీవ్రమైన శ్వాసకోశ వ్యాధులకు దారితీస్తున్నాయి. వాటిలో అత్యంత ప్రమాదకరమైనది సిలికోసిస్. సిలికా ధూళిని ఎక్కువకాలం పీల్చడం వల్ల ఈ వ్యాధి ఏర్పడుతుంది. ఒకసారి ఊపిరితిత్తుల కణజాలం దెబ్బతిన్న తర్వాత దాన్ని పూర్తిగా తిరిగి సాధారణ స్థితికి తీసుకురావడం దాదాపు అసాధ్యం. మొదట దగ్గు, ఛాతీలో ఇబ్బంది, శ్వాస తీసుకోవడంలో సమస్యలు కనిపిస్తాయి. వ్యాధి ముదిరే కొద్దీ సాధారణంగా నడవడం, పనిచేయడం కూడా కష్టమవుతుంది. చివరిదశల్లో రోగికి నిరంతరం ఆక్సిజన్ అవసరం కావచ్చు. గనుల ప్రాంతాల్లో పరిస్థితి మరింత తీవ్రమవుతుంది. వ్యాధి నిర్ధారణ, ధ్రువీకరణ ప్రక్రియలో ఎదురయ్యే ఇబ్బందులు ఇందుకు ప్రధాన కారణాల్లో ఒకటి. ఆసుపత్రులకు పలుమార్లు వెళ్లాలి, వైద్యపరీక్షలు చేయించుకోవాలి, పేద కుటుంబాలకు ఈ ప్రయాణాలు, వైద్యఖర్చులు, పనిమానేయాల్సిన పరిస్థితి భారం గా మారతాయి. ఫలితంగా అనేక మంది అధికారిక జాబితాల్లోకి రాకుండానే వ్యాధితో బాధపడుతున్నారు.



గనుల ప్రభావం సిలికోసిస్ వ్యాధి సోకడానికే పరిమితం కాదు. ఎందుకంటే, గనుల ప్రాంతాల్లో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఆస్తమా, కళ్లలో మంట, ముక్కు లో చికాకు, చర్మ సమస్యలు, అలర్జీలు, కీళ్ల నొప్పులు, వినికిడి సమస్యలు వంటి అనేక ఆరోగ్య సమస్యలు నమోదవుతున్నాయి. రాళ్లను పేల్చే శబ్దం, నిరంతర భారీ యంత్రాల వినియోగం శబ్ద కాలుష్యాన్ని కూడా పెంచుతుందనే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ప్రత్యేకించి పిల్లల్లో ఈ సమస్య తీవ్రత ఎక్కువగా ఉంటుంది. వారి ఊపిరితిత్తులు ఇంకా అభివృద్ధి చెందుతున్న దశలో ఉండటంతో ధూళి, సూక్ష్మ కణాల ప్రభావం దీర్ఘకాలికంగా ఉండవచ్చు. గనుల సమీప గ్రామాల్లో పిల్లలకు ఆస్తమా, తరచూ దగ్గు, శ్వాసలో ఇబ్బంది వంటి సమస్యలు ఎదురైతే వాటిని సాధారణ అనారోగ్యంగా చూడకూడదు. పర్యావరణ కాలుష్యంతో వాటికి ఉన్న సంబంధాన్ని శాస్త్రీయంగా పరిశీలించాలి. ఇక్కడ మరో తీవ్రమైన సామాజిక సమస్య కూడా ఉంది. గనుల్లో పనిచేసే వ్యక్తి అనారోగ్యానికి గురైతే కుటుంబ ఆదాయం తగ్గుతుంది. చికిత్స, మందులు, పరీక్షలు, ఆక్సిజన్ వంటి ఖర్చులు పెరుగుతాయి. చివరకు కుటుంబం అప్పుల్లో కూరుకుపోయే ప్రమాదం ఉంటుంది. అందువల్ల సిలికోసిస్‌ను కేవలం వైద్య సంబంధమైన సమస్యగా చూడటంతో సరిపోదు. ఇది జీవనోపాధి, పేదరికం, సామాజిక భద్రత, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన సమస్య కూడా. ఆక్సిజన్ అవసరమైన రోగుల పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. తీవ్రమైన దశలో రోజుకు అనేక సిలిండర్లు అవసరమైతే కుటుంబం ఆ ఖర్చును భరించడం సాధ్యం కాకపోవచ్చు. ఇలాంటి సమయంలో ప్రభుత్వ సహాయం ఆలస్యం అయితే చికిత్స అందుబాటులో ఉండదు. వ్యాధిని ముందుగానే గుర్తించి, ఉచిత వైద్యం, ఆక్సిజన్, పోషకాహారం, కుటుంబానికి ఆర్థిక సహాయం అందించే వ్యవస్థను బలోపేతం చేయాలి. సిలికోసిస్‌కు చికిత్స అందించడం అవసరమే. కానీ వ్యాధికి మూలకారణమైన సిలికా ధూళిని నియంత్రించకుండా కేవలం రోగులకు మందులు ఇవ్వడం సమస్యను పరిష్కరించదు. అందువల్ల గనుల ప్రాంతాల్లో మొదటి ప్రాధాన్యం ధూళి నియంత్రణకు ఇవ్వాలి. రాళ్లను కోయడం, పగలగొట్టడం, తరలించడం వంటి ప్రక్రియల్లో నీటి పిచికారీ, మూసివేసిన క్రషింగ్ వ్యవస్థలు, సమర్థమైన ఫిల్టర్లు, ధూళి నియంత్రణ పరికరాలు తప్పనిసరి చేయాలి. భారీ వాహనాలు తిరిగే రహదారులను క్రమం తప్పకుండా నీటితో తడపాలి. కార్మికులకు సరైన శ్వాస రక్షణ పరికరాలు ఇవ్వడమే కాకుండా వాటి వినియోగాన్ని నిరంతరం పర్యవేక్షించాలి.

# కేన్సర్ చికిత్సలో కార్ 'టి' కీలకం..



కేన్సర్ చికిత్సలో ఇమ్యూనోథెరపీ ఒక కీలక మలుపు కాగా, అందులో కార్ 'టి'సెల్ థెరపీ అత్యాధునిక విధానంగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. ఈ నేపథ్యంలో ఐఐటి బాంబే శాస్త్రవేత్తలు సాధించిన తాజా పరిశోధన ఫలితం భారతదేశానికి విశేష ప్రాధాన్యం సంతరించుకుంది. 'బయోమెటీరియల్స్ సైన్స్' జర్నల్‌లో ప్రచురితమైన ఈ అధ్యయనం, ప్రయోగశాలలో పెంచిన 'టి' సెల్‌లను సురక్షితంగా, సమర్థవంతంగా తిరిగి పొందడానికి కొత్త, మృదువైన పద్ధతిని నిరూపించింది. 'టి' సెల్‌లు మన రోగనిరోధక వ్యవస్థలో కీలకమైన శ్వేత రక్తకణాలు. ఇవి శరీరంలోకి ప్రవేశించిన వైరస్‌లు, బ్యాక్టీరియా లేదా అసాధారణంగా పెరిగే కేన్సర్ కణాలను గుర్తించి నాశనం చేస్తాయి లేదా ఇతర రోగనిరోధక కణాలకు సంకేతాలు ఇస్తాయి. కార్ 'టి'సెల్ థెరపీలో, రోగి నుంచి తీసుకున్న 'టి' సెల్‌లను ప్రయోగశాలలో జన్యుపరంగా మార్పులు చేసి, వాటికి కైమెరిక్ యాంటీజెన్ రిసెప్టర్లు అనే ప్రత్యేక రిసెప్టర్లను జోడిస్తారు. ఈ రిసెప్టర్లు కేన్సర్‌కణాలను ఖచ్చితంగా గుర్తించేలా 'టి' సెల్‌లను మారుస్తాయి. ఆ తర్వాత ఈ మార్పుచేసిన కణాలను మళ్లీ రోగి శరీరంలోకి పంపిస్తారు. ప్రస్తుతం ఈ చికిత్స ల్యూకేమియా, లింఫోమా వంటి కొన్ని రక్త క్యాన్సర్లకు అనుమతి పొందింది. ఐఐటి బాంబే అధ్యయనంలో ఒక ప్రధాన సమస్యపై దృష్టి పెట్టారు. 'టి' సెల్‌లను మానవ శరీరాన్ని పోలిన 3డి ఫైబ్రస్ స్కాఫోల్డ్స్‌లో పెంచితే అవి బాగా పెరుగుతాయి. కానీ అవి ఆ స్కాఫోల్డ్స్‌కు బలంగా అతుక్కుపోతాయి. సాధారణంగా వీటిని విడదీయడానికి ట్రిప్సిన్ వంటి కఠినమైన ఎంజైమ్‌లను వాడతారు. . తాజా పరిశోధన భారతదేశం బయోమెడికల్ ఇంజినీరింగ్‌లో సాధిస్తున్న పురోగతిని స్పష్టంగా చూపిస్తూ, అధునాతన కేన్సర్‌చికిత్సలను దేశంలో అందుబాటులోకి తెచ్చే దిశగా ఒక కీలక ముందడుగుగా నిలుస్తోంది.

# మైనింగ్ స్టాఫ్‌కు హక్కులు సాధించిన ఘనత ఎఐటియుసిదే

### సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సింగరేణిలో పనిచేస్తున్న మైనింగ్ స్టాఫ్‌కు హక్కులు సాధించిన చరిత్ర ఎఐటియుసిదేనని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం గోదావరిఖనిలోని భాస్కర్ రావు భవన్ లో జరిగిన రామగుండం రీజియన్ మైనింగ్ స్టాఫ్ జనరల్ బాడీ సమావేశంలో వారు మాట్లాడారు. సింగరేణిలో పని చేస్తున్న మైనింగ్ స్టాఫ్ కు చార్జి అలవెన్సులు, ప్రమోషన్లు, అండర్ గ్రౌండ్‌లో అన్ ఫిట్ అయిన వారికి సర్ఫేస్ లో సూటబుల్ జాబ్ ఇప్పించడం జరిగిందన్నారు. డిస్మిస్ అయిన జెఎంఇటిలకు తిరిగి ఉద్యోగాలు ఇప్పించడం జరిగిందన్నారు. మైనింగ్ ఇండస్ట్రీకి మైనింగ్ స్టాఫ్ ముఖ్యమన్నారు. మైనింగ్ స్టాఫ్ సమస్యల పరిష్కారంలో ఎఐటియుసినిరంతరం కృషి చేస్తుందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య పేర్కొన్నారు. సమావేశంలో ఎఐటియుసిఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, కవ్వంపల్లి స్వామి, పెర్క మహేందర్, కందుకూరి రాజారత్నం, రంగు శ్రీను, గంధం సాంబశివరావు, వంగ రాజేశ్వరరావు పాల్గొన్నారు.

# బ్యాంకర్ల సమ్మెకు సంపూర్ణ మద్దతు

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్



ప్రజాపక్షం /ఆసిఫాబాద్ : వారానికి ఐదు రోజుల పని విధానాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బ్యాంకు ఉద్యోగులు చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెకు ఎఐటియుసి సంపూర్ణ మద్దతు ప్రకటించిందని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ తెలిపారు. సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు మూడు రోజుల పాటు సాగే ఈ సమ్మెకు జిల్లాలోని కార్మిక వర్గమంతా అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్యాంకింగ్ రంగంలో పెరిగిన పని గంటలు, మితిమీరిన పనిభారం, నిరంతర లక్ష్యాల ఒత్తిడితో ఉద్యోగులు తీవ్ర మానసిక ఆందోళనకు గురవుతున్నారని బోగే ఉపేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల ఆరోగ్యం, కుటుంబ శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఐదు రోజుల పని విధానానికి ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలు ప్రభుత్వ రంగ బ్యాంకుల మనుగడను దెబ్బతీస్తున్నాయని విమర్శించారు. బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, అధిక లక్ష్యాల పేరుతో ఉద్యోగులపై వేధింపులు ఆపాలని నాయకులు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు టి. దివాకర్, ఉపాధ్యక్షుడు సుధాకర్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి చిరంజీవి, నాయకులు కదారి సునీల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## మతోన్మాద, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా

# యువత ఉద్యమించాలి

### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

### ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో హనుమకొండలో రక్తదాన శిబిరం

**ప్రజాపక్షం/హనుమకొండ :** స్వాతంత్ర్య సమరయోధులు షహీద్ భగత్ సింగ్ పోరాట స్ఫూర్తితో మతోన్మాద, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, అసమానతలు లేని సమాజ నిర్మాణానికి యువత ఉద్యమించాల సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం సుబేదారిలోని రెడ్ క్రాస్ సొసైటీలో భగత్‌సింగ్ 119వ జయంతి ఉత్సవాల సందర్భంగా ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయగా తక్కలపల్లి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో బ్రిటిష్ సామ్రాజ్య వాదులకు వ్యతిరేకంగా పోరాడి, దేశ స్వాతంత్ర్యం కోసం తన ప్రాణాలను తృణప్రాయంగా త్యాగం చేస్తూ బ్రిటిషర్ల ఉరికంబాన్ని ముద్దాడి అమరత్వం పొందిన విప్లవ ధృవతార షహిద్ భగత్ సింగ్ అని కొనియాడారు. వారి పోరాట స్ఫూర్తితో నేటి సమాజంలో అసమానతలపై, అందరికీ సమాన హక్కులకై, మతోన్మాదంపై, సామ్రాజ్యవాద విధానాలకు వ్యతిరేకంగా, దోపిడి, పీడన, అణిచివేత, కులమత లేని సమ సమాజ స్థాపనకై పోరాడుతూ అసమానతలు లేని సమాజ నిర్మాణానికి ముందుకు సాగుతూ యువత ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత సమాజంలో రక్తదానం చేయడం గొప్ప వరమన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి వ్యక్తి నాలుగు నెలల ఒకసారి రక్తదానం చేయవచ్చన్నారు. దేశంలో ఎంతో మంది మహిళలు రక్తహీనతతో ఉన్నారని, రక్తదానం చేయడానికి యువత ముందుకు రావడం సంతోషమన్నారు. నెట్ బ్లడ్ సేవ్ లైఫ్ పేరుతో ఎఐవైఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారికి శ్రీనివాసరావు సర్టిఫికెట్ అందజేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు అదరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి, నాయకులు ఎన్‌ఎ.స్టాలిన్, ఎదునూరి వెంకట్రాజం, గుంటి రాజేందర్, పొనుగోటి రాముగోపాల్ చారి, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు నోముల కిశోర్, జిల్లా ఆఫీస్ బేరర్స్ తాటికంటి మమత, పల్లకొండ శ్రీకాంత్, పెనుకుల మధు, నాయకులు జెట్టి కృష్ణ, ఈర్ల లావణ్య, మోతె సతీష్, ఐదుపురం ప్రదీప్, మేకల రంజిత్, ఒరుగంటి విజయ్, మాచర్ల సతీష్, దుగ్యాల సందీప్, మురళి కృష్ణ, నిమ్మల వెన్నెల, వల్లం కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.





# 'కొండా లక్ష్మణ్' సేవలు చిరస్మరణీయం

### సిపిఐ జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం

**ప్రజాపక్షం/కోరుట్ల :** స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, సామాజిక హక్కుల కోసం పోరాడిన నాయకుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఆదర్శాలు, స్ఫూర్తితో నేటి యువత ముందుకు సాగాలని సిపిఐ జగిత్యాల జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం పిలుపునిచ్చారు. కోరుట్లలోని శ్రీ ప్రభాకర్ స్మారక గ్రంథాలయం కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తొలి దశ నుంచి తుది దశ వరకు బాపూజీ అనేక పోరాటాలు నిర్వహించారని గుర్తు చేశారు. తన ఇంటినే ఉద్యమ కేంద్రంగా మార్చి ప్రజా ఉద్యమాలకు అండగా నిలిచారని పేర్కొన్నారు ఆయన చేసిన సేవలు,పోరాటాలు నేటితరానికి ఆదర్శంగా నిలుస్తాయమన్నారు. ప్రస్తుత రాజకీయ నాయకులు, యువత కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను ఆదర్శంగా తీసుకొని ప్రజాసమస్యల పరిష్కారం కోసం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు జువ్వాడి కృష్ణారావు, అన్నం ఎడ్ల రమేష్, మాజీ కౌన్సిలర్లు, రాస భూమయ్య, సుతారి రాములు, పాతాళ విజయ్, మహమ్మద్ మౌలానా, రాచకొండ పెద్ద దేవయ్య, ఓటరుకారి శ్రీనివాస్, గంగాధర్, అడ్వకేట్ కొంతం రాజం, రామిళ్ల రాంబాబు, కొంచెం శంకర్, ఎండి ముక్రం, అందే వంశీకృష్ణ పాల్గొన్నారు.

# ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసిన జ్ఞానేష్‌కుమార్ రాజీనామా చేయాలి

### సిపిఐ నేతలు డిమాండ్

**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** దేశవ్యాప్తంగా సర్ పేరు తో 13 కోట్ల మంది ఓటర్లు, తెలంగాణ వ్యాప్తంగా 92 లక్షల మందికి నోటీసులు ఇచ్చి ఓట్లు గల్లంతుకు కారణమైన జ్ఞానేష్ కుమార్‌ను తక్షణమే తొలగించాలి, సర్ ప్రక్రియను తక్షణమే రద్దు చేయాలి సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయ సారథి డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం ఎదుట సర్ ప్రక్రియను రద్దు చేయాలని, దేశ వ్యాప్తంగా సర్ ప్రక్రియ ద్వారా 13 కోట్ల మంది ఓట్లు గల్లంతు కావడానికి కారణమైన భారత ఎన్నికల ప్రధాన కార్యదర్శి జ్ఞానేష్ కుమార్ ను తక్షణం తొలగించాలని సిపిఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయ సారథి మాట్లాడుతూ రాష్ట్రాలల్లో జరిగే అటువంటి ఎన్నికల్లో ఎలాగైనా బిజెపి పార్టీ గెలవాలని కుట్రలతో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, అమిత్ షా, లు కలిసి భారత ఎన్నికల ప్రధాన కార్యదర్శి జ్ఞానేష్ కుమార్ ను వెంటపెట్టుకుని సర్ ప్రక్రియను తీసుకొచ్చి ఓట్లను తొలగించడం సిగ్గుచేటు అన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 92 లక్షల మందికి నోటీసులు ఇచ్చి ఓట్ల గల్లంతుకు కారణమైనటువంటి ఎన్నికల ప్రధాన కార్యదర్శిని తొలగించాలి, తక్షణమే నోటీసుల సరఫరా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కూడా బిజెపి ప్రభుత్వం తొలగించడానికి కుట్రలు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. ఈ ఆందోళన కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్ సారధిరెడ్డి, పట్టణ సహాయ కార్యదర్శులు రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, నాయకులు కట్లోజు పాండురంగ చారి, వీరవిల్లి రవి, నర్రా శ్రావణ్, భానోత్ లింగానాయక్, అజ్మీర వేణు కేదాసురమేష్, కూరాకుల పాల్, గారే రవిచంద్ర బోస్, తండా శ్రీనాథ్, నిదిగొండ సత్యం, ఉస్మాన్, నీలం వెంకటేశ్వర్లు, గాదెం శ్యాంప్రసాద్, తోట రమేష్, మల్లి కార్జున్, మల్లయ్య, భద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.



**నిజామాబాద్ :** ప్రజల విశ్వాసాన్ని దెబ్బ తీసిన జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని వామపక్షా డిమాండ్ చేశారు. ఆదివారం సిపిఐ జిల్లా కార్యాలయంలో సిపిఐ, సిపిఎం, సిపిఐ, ఎంఎల్ న్యూడెమోక్రసీ, సిపిఎంఎల్ మాస్‌లైన్, ఆర్‌ఎస్‌పి, ఎంసిపిఐల సమావేశం జరిగింది. అనంతరం జరిగిన ఈ విలేకరుల సమావేశంలో సుధాకర్ మాట్లాడారు. సర్ పేరుతో ఓట్లను తొలగించడంపై ప్రధాన ఎన్నికల అధికారి జ్ఞానేష్‌కుమార్ ప్రజల విశ్వాసాన్ని ఘోరంగా దెబ్బ తీశారని ఆయన వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఓటరు లిస్ట్‌లో ఉన్న ఓటర్లలో చనిపోయిన ఒకటి కన్న ఎక్కువ ఉన్న ఓట్లను తొలగించడానికి వామపక్ష పార్టీలు స్వాగతిస్తున్నాయని తెలిపారు. గతంలో ఈడీ, సీబీఐ పేరుతో ప్రతిపక్షాలపై దాడులు చేసిన సంఘటనలు చూస్తామని కానీ ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఎస్ఐఆర్ పేరుతో ఎన్నికలు జరగబోతున్న రాష్ట్రాల్లో ఎన్నికల కమీషన్ ముందు పెట్టి ఓటర్లను తొలగించడం సరికాదని ధ్వజమెత్తారు. ఎస్ఐఆర్‌లు నిలిపివేయాలని, తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలని డిమాండ్‌తో అక్టోబర్ 1న ధర్నాచౌక్‌లో జరిగే నిరసనలో పెద్ద ఎత్తున వామపక్ష నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు రమేష్‌బాబు, పాపయ్య, రాములు, ఓమయ్య, అలీ ఇమ్రాన్, శ్రీనివాస్, ఖాజా మొహినుద్దీన్ , రాజన్న పాల్గొన్నారు.



## 'అమ్మకు అక్షరమాల' కార్యక్రమం



ప్రజాపక్షం/హైదరాబాద్: 'అమ్మకు అక్షరమాల' కార్యక్రమంలో బాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ అసెస్మెంట్ టెస్ట్( ఉల్లాస్)కు 6.32 లక్షల మంది వయోజనులు హాజరయ్యారు. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లో 5.32 లక్షల మంది మహిళలు, పట్టణ ప్రాంతంలో లక్ష మంది వరకు పరీక్ష రాశారు. రాష్ట్రంలోని 124 పట్టణ స్థానిక సంస్థలు, జిహెచ్ఎంసి, ఎం ఎంసి, సిఎంసి పరిధిలోని సర్కిళ్లలో పరీక్షను నిర్వహించారు.ఈ పరీక్షకు 98,324 మంది స్వయం సహాయక సంఘాల సభ్యులు, 720 మంది వీధి వ్యాపారులు వయోజన విద్యాశాఖ సమన్వయంతో పరీక్ష రాసినట్లు సెర్ప్ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా పరీక్ష రాసిన స్వయం సహాయక సంఘాల మహిళలు, ఇతర వయోజన అభ్యాసకులకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అభినందనలు తెలిపారు. అక్షరం నేర్చుకోవడమంటే కేవలం చదవడం, రాయడం రావడం కాదని, అదొక ఆత్మవిశ్వాసాన్ని సంపాదించుకోవడమేనని అన్నారు. ఒక మహిళ అక్షరాస్యురాలైతే ఒక్క వ్యక్తి మాత్రమే చదువుకున్నట్టు కాదని, ఒక కుటుంబానికి వెలుగు వస్తుందని, తద్వారా తన పిల్లల చదువును పట్టించుకుంటుందని, బ్యాంకు లావాదేవీలను అర్థం చేసుకుంటుందని వివరించారు.

# 'సర్' ప్రక్రియ విపత్తుగా మారిందని అంగీకరించారు

**నష్టనివారణ చర్యలపై ఇసి నిస్సహాయ ప్రయత్నం**
**ఇఆర్ఒలదే తుది నిర్ణయమని ఇప్పటికీ చెప్పలేదు**
**అరకొర చర్యలవల్ల ప్రయోజనం లేదు**
**విమర్శల దాడి పెంచిన కాంగ్రెస్‌పార్టీ**



న్యూఢిల్లీ: సమస్యలు ఎదుర్కొంటున్న ఓటర్ల ఇళ్లకు బిఎల్ఒలు వెళతారని ఎన్నికల సంఘం ఇప్పుడు ప్రకటించడం''సర్ ప్రక్రియ''ఒక విపత్తుగా మారిందని అంగీకరించడమేనని కాంగ్రెస్‌పార్టీ విమర్శించింది.ఇప్పటికే బట్టబయలైన నిజస్వరూపాన్ని ఒక రహస్యంగా దాచిపెట్టడం కోసం ఎన్నికల సంఘం అర్థరహితమైన అరకొర పాక్షిక చర్యలు ప్రకటించిందని కాంగ్రెస్‌పార్టీ ప్రధాన కార్యదర్శి కమ్యూనికేషన్స్ ఇన్‌ఛార్జి జైరామ్ రమేశ్ విమర్శించారు. ప్రతి పౌరుడికీ ఇబ్బందిగా మారిన,ప్రజావనరులను భారీగా వృథాచేసిన 'సర్ ప్రక్రియ'వల్ల ప్రయోజనం ఏమిటని నిలదీశారు.ఓటర్ల జాబితాలో ''తొలగింపు ప్రమాదం''అంచున నిలబడి ఉన్న 5.43 కోట్ల మంది ఓటర్ల కోసం,వారిపట్ల జరిగిన తప్పొప్పులను సరిదిద్దడంకోసం బిఎల్ఒలు(బూత్ స్థాయీ అధికారులు) ఇళ్లకు వెళతారని శనివారం ఎన్నికల సంఘం చేసిన ప్రకటనను ఆయన తప్పుపట్టారు.ఓటర్లను లెక్కించేటప్పుడే చేయాల్సినపని ఇప్పుడు చేస్తామని ప్రకటించడంలో విశ్వసనీయత లేదని, మొదట్లో చేయాల్సి పనిని బిఎల్ఒలు ఎంతవరకూ చిత్తశుద్ధితో ఇళ్లకు వెళ్లి పూర్తిచేయగలరన్న విషయం సందేహాస్పదంగా మారిందన్నారు. బయటపడిన విషయాలన్నింటినీ దాచిపెట్టేందుకు,ఏమీ చెప్పకుండా ఉండటంకోసం నష్టనివారణ చర్యలు తీసుకోవడం ఒక నిస్సహాయ ప్రయత్నమని ఆయన ఎక్స్ వేదికగా విమర్శించారు.జాబితాలో తొలగింపు ప్రమాదం అంచున ఉన్న ఓటర్ల సమస్యలు పరిష్కరించడానికి, ప్రజల ఓటు హక్కును సామూహికంగా రద్దుకాకుండా అడ్డుకోవడానికి ఈ దశలో ప్రకటించిన విడివిడి చర్యలు ఎంతమాత్రం ఉపయోగపడబోవని ఎక్స్ వేదికగా జైరామ్ రమేశ్ విమర్శించారు. ఇప్పుడు ప్రకటించిన చర్యలు మొదట్లోనే తీసుకుని ఉండాల్సిందన్నారు. ప్రభుత్వ ధనం, సమయాన్ని పూర్తి వృథాచేసిన ఇలాంటి చర్యలు సమస్యను పరిష్కరించదన్నారు. ''సర్ ప్రక్రియ'' మూడు దశలలో ఇప్పటివరకూ దేశంలో 14 కోట్లమంది ఓటర్ల పేర్లను జాబితాల నుండి తొలగించారు.రహస్యం బయటపడ్డాక ఇప్పుడు ఆ ఓటర్లందరినీ మళ్లీ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ల(ఇఆర్ఒ)కు దరఖాస్తులు పెట్టుకోమని చెబుతున్నారు,బిజెపికి మేలు చేయడంకోసం అణగారిన,నోరెత్తి అడగలేని ఓటర్లను జాబితాల నుండి తొలగించారని చెప్పడానికి చాలా ఆధారాలు ఉన్నాయి,ఈ ఆరోపణలపై ఎన్నికల సంఘం,బిజెపి స్పందించడం లేదు'' అని ఎక్స్ వేదికగా జైరామ్ రమేశ్ విమర్శలు గుప్పించారు.1950 నాటి ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం ఓటర్ల జాబితాలపై ఇఆర్ఓ(ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లు)లదే తుది నిర్ణయమని ఇప్పటికీ ఎన్నికల సంఘం స్పష్టమైన ప్రకటన చేయలేదని,ఇఆర్ఓలను పట్టించుకోకుండా అర్హులైన ఓటర్లను 'ఇసిఐ నెట్' చట్టవిరుద్ధంగా తిరస్కరించిందని ఈ సమస్య పరిష్కారానికి ఎన్నికల సంఘం ఎలాంటి ప్రతిపాదనా చేయలేదని విమర్శించారు. దేశవ్యాప్తంగా ''సర్ ప్రక్రియ'' అమలులో ఇసిఐ నెట్‌ను ఉపయోగించిన తర్వాత ఇప్పుడు మళ్ళీ ఇఆర్ఓలకు దరఖాస్తులు చేసుకోమని ఓటర్లకు చెప్పడం 'ఇసిఐ నెట్' చట్టబద్ధత చెల్లుబాటు కాదని,ఈ విషయంలో చాలా సందేహాలు ఉన్నాయని ఒప్పుకున్నట్టే అవుతుందని,వీటికి సమాధానాలు చెప్పాలని నిలదీశారు.ఇసిఐనెట్‌ను ఎవరు నిర్వహిస్తున్నారన్న విషయంపై ఎన్నికలసంఘం రహస్యం పాటిస్తోందని,బాహాటత్వ విధానం అనుసరించడం లేదని విమర్శించారు.ప్రజలకు సంబంధించిన విషయంలో బహిరంగ విధానం ఎందుకు పాటించడంలేదని ప్రశ్నించారు.ఫారం–6లో అక్రమంగా మార్పులు చేశారని విమర్శించారు.సర్ ప్రక్రియకు సంబంధించి ఉత్తర్వులను ఎన్నికల సంఘం ఏకాభిప్రాయ సమ్మతితో జారీ చేసిందని,ఎన్నికల సంఘంలో ఉన్న ముగ్గురు అధికారులు ఏకాభిప్రాయంతోనే సర్ ప్రక్రియ ఉత్తర్వులు ఇచ్చారని, ఫారం–6లో మార్పులను కూడా సుప్రీంకోర్టు సమర్థించిందని ఎన్నికల సంఘం చెప్పిన తర్వాత జైరామ్ రమేశ్ ఇసిఐపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఎన్నికల సంఘంలో ఉన్న మిగిలిన ఇద్దరు అధికారులు సుఖ్‌బీర్ సింగ్ సంధు,వివేక్ జోషి గడచిన పదినెలల కాలంలో 14 సార్లు జ్ఞానేష్ కుమార్ (సిఇసి) నిర్ణయాలకు అభ్యంతరాలు తెలియజేశారని 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' ఆంగ్ల పత్రిక తన పరిశోధనాత్మక వ్యాసంలో స్పష్టం చేసింది.కానీ ఇప్పుడు జ్ఞానేష్ కుమార్ మాత్రం ఈ విభేదాలు విధానపరమైన ఓటర్లకు సంబంధించినవి కాదని, ఆఫీసర్ డెప్యుటేషన్‌కు సంబంధించినదని చెబుతున్నారు.కానీ సర్ ప్రక్రియ చేపట్టేందుకు ఉద్దేశించిన ఉత్తర్వులు తమకు తెలియకుండానే జారీ చేశారని సుఖ్‌బీర్ సింగ్ సంధు,వివేక్ జోషి చెప్పినట్లు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రిక తన కథనంలో స్పష్టం చేసింది.

## జనగణన ప్రక్రియ తక్షణమే నిలిపివేయాలి

**ఓబిసి కాలమ్ కోసం అక్టోబర్ 8న**
**ఢిల్లీలో అఖిలపక్ష సమావేశం: జాజుల**



ప్రజాపక్షం/హైదరాబాద్: దేశవ్యాప్తంగా చేపడుతున్న జనగణనలో ఎస్‌సి, ఎస్‌టి కాలమ్‌లతో పాటు ఓబిసి కాలమ్‌ను కూడా చేర్చాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 8న ఢిల్లీలో అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించనున్నట్లు బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో జాతీయ స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, సామాజిక నిపుణులు, మేధావులతో ఈ సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. బిసి కులాల గణన చేపడతామని కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ, ఆ హామీని అమలు చేయకుండా బిసిలను మోసం చేస్తోందని జాజుల ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన రాజకీయ పార్టీలు ఓబిసి కాలమ్ అంశంపై స్పం దించకుండా మౌనం వహిస్తున్నాయని విమర్శించారు. ఓబిసి కాలమ్‌పై స్పష్టమైన వైఖరి ప్రకటించని రాజకీయ పార్టీలను వచ్చే ఎన్నికల్లో ప్రజలు ప్రశ్నించాలని ఆయన పిలుపునిచ్చా రు. బిసిల పట్ల కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే దేశవ్యాప్తంగా కొనసాగుతున్న జనగణన ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని జాజుల డిమాండ్ చేశారు. ఆగస్టు 14న కేంద్ర ప్రభుత్వం 40 ప్రశ్నలతో జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను రద్దు చేసి, ఓబిసి కాలమ్‌ను చేర్చాలని కోరారు. ఈ డిమాండ్లపై కేంద్రం స్పందించకపోతే దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపడతామని జాజుల శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు.

**వచ్చే ఏడాది గిన్నిస్ రికార్డు సాధించేలా..**

## బతుకమ్మ వేడుకలు: కవిత



ప్రజాపక్షం/హైదరాబాద్: వచ్చే ఏడాది గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సాధించే విధంగా బతుకమ్మ సంబురాలు నిర్వహిస్తామని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షులు, తెలంగాణ జా గృతి వ్యవస్థాపక అధ్యక్షులు కల్వకుంట్ల కవిత తెలిపారు. హైదరాబాద్‌లోని టిఆర్ఎస్ కార్యాలయంలో బతుకమ్మ సం బురాలు పోస్టర్, తెలంగాణ జాగృతి రూపొందించిన బతుక మ్మ పాటల సీడిని ఆమె ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ జాగృతి రాష్ట్ర,జిల్లా కమిటీలను ప్రకటించా రు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ప్రభుత్వాలు గిన్నిస్ రికార్డు సాధించేలా బతుకమ్మ వేడుకలు నిర్వహించేందుకు ప్రయత్నించినప్పటికీ స ఫలం కాలేదన్నారు. ఈ ఏడాది తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల్లో, విదేశాల్లో జాగృతి ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తామని, వచ్చే ఏడాది బతుకమ్మ ఔన్నత్యాన్ని చాటేలా రెండున్నర లక్షల మందితో బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తామని, ఇందుకు గ్రామ గ్రామ బతుకమ్మ కమిటీలు, కోలాటం కమిటీలు వేస్తామని చెప్పారు. తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు మారిపెల్లి మాధవి మాట్లాడుతూ వచ్చే ఏడాది రెండున్నర లక్షల మందితో బతుకమ్మ నిర్వహించి, గిన్నిస్ రికార్డ్ సాధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి రాష్ట్ర కమిటీ అధ్యక్షురాలు మారిపెల్లి మాధవి, ఉపాధ్యక్షుడు జాడి శ్రీనివాస్, పర్శ చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగుంటి సుందర్, కార్యదర్శులు కన్నం శారద, దొండి స్వర్ణలత, మస్తాన్, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షులు మానుకోట సునీత పాల్గొన్నారు.

## బిజెపి ఎన్నడూ ఓట్లను చోరీ చేయబోదు

**కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి**



ప్రజాపక్షం/హైదరాబాద్: బిజెపి ఎన్నడూ ఓట్లను చోరీ చేయబోదని, దేశ ప్రజల మనసులను గెలుచుకుంటుందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపారు. ఎన్నికల్లో గెలిస్తే తమ ఘనతగా చెప్పుకోవడం, ఓడిపోతే ఈవీఎంలు, ఎన్నికల సంఘంపై నిందలు వేయడం కాంగ్రెస్ దిగజారుడు రాజకీయాలకు, ద్వంద్వ వై ఖరికి నిదర్శనమని మండిపడ్డారు. హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఏ ర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కర్నాటక, హిమాచల్ ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఎన్నికల సంఘం చాలా బాగా పనిచేసినట్టుగా, కే రళలో కాంగ్రెస్ సీనియర్ నేత చెప్పినట్టు ఎస్ఐఆర్ ద్వారా దొంగ ఓట్లను తొలగిస్తే ఈసీ మంచిదైనట్టు ప్రచారం చేసుకున్నారన్నారు. రాజ్యాంగం గు రించి మాట్లాడే నైతిక హక్కు కాంగ్రెస్‌కు ఏ మాత్రం లేదని, 1975లో దేశంలో ఎమర్జెన్సీ వి ధించి, పత్రికా స్వేచ్ఛను హరించి, పౌర హక్కుల ను కాలరాసి, ప్రతిపక్ష నేతలను జైళ్లలో పెట్టి చీకటి రాజ్యాన్ని నడిపిన చరిత్ర కాంగ్రెస్‌దేనని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఇందిరా పార్క్ వద్ద ధర్నాలు చేయాలన్నా కోర్టులకు వెళ్లి అనుమతులు తెచ్చుకోవాల్సిన దౌర్భాగ్య పరిస్థితి నెలకొన్నదని, అలాంటి వారు ప్రజాస్వా మ్యం గురించి మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. 'రాహుల్ గాంధీ ఏ ఒక్క వ్యవస్థనూ వదిలిపెట్టలేదని, ఆర్మీ చీఫ్, ఎయిర్‌ఫోర్స్,, సర్జికల్ స్ట్రైక్స్, ఎన్ఎస్ఎ అజిత్ దోవల్, లోక్‌సభ స్పీకర్, సిజెఐ, ఇడి, సి బిఐ, ఇంటెలిజెన్స్ బ్యూరో, మీడియా హౌస్‌లతో పాటు చివరకు పార్లమెంట్, జిఎస్‌టి వ్యవస్థలపై కూడా అనుమానాలు వ్యక్తం చేస్తూ విష్రప చారం చేస్తున్నారని కిషన్ రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఇప్పటికైనా వాస్తవాలు గ్ర హించి ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. రాబోయే రోజుల్లో మూడు రాష్ట్రాల్లోనూ కాంగ్రెస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు.

## తెలంగాణ యువత రాష్ట్రఅధ్యక్షుడు ఇమ్మడి సతీష్‌కు 'డాక్టరేట్ 'ప్రదానం



ప్రజాపక్షం /హైదరాబాద్ : తెలంగాణ యువత రాష్ట్ర అధ్యక్షులు ఇమ్మడి సతీశ్‌కు ఏసియా ఇంటర్నేషనల్ కల్చర్ అండ్ రీసెర్చ్ యూనివర్సిటీ నుంచి విశేష గౌరవం లభించింది. ఆయన సేవలకు గుర్తింపుగా ఇటీవల బెంగళూరులో జరిగిన ఒక ప్రధాన కార్యక్రమంలో సతీశ్‌కు ఈ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ పట్టా ప్రదానం చేసింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు ప్రసంగిస్తూ ఇమ్మడి సతీశ్ చేసిన విశిష్ట సేవల కృషిని ప్రశంసించారు. అనంతరం 'స్మారక అవార్డు', మెడల్‌ను అందజేశారు. అవార్డు ప్రదానం సందర్భంగా సతీశ్ ప్రసంగిస్తూ తాను అందించిన సేవల కృషిని గుర్తించి ఏసియా ఇంటర్నేషనల్ కల్చర్ అండ్ రీసెర్చ్ యూనివర్సిటీ ఈ అవార్డు ప్రదానం చేయడం పట్ల సంతోషం వ్యక్తంచేశారు. ఈ గుర్తింపు సాధించడం పట్ల సతీష్ మిత్రులు, కుటుంబ సభ్యులు, పలువురు రాజకీయ, విద్యావేత్తలు హర్షం వ్యక్తం చేశారు.



హైదరాబాద్ నాగోల్‌లోని శుభం కన్వెన్షన్‌లో ఆదివారం జరిగిన స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ (ఎస్‌టియుటిఎస్) 80వ వసంతోత్సవంలో సంఘం అధ్యక్షుడు జి.సదానందంగౌడ్, ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్‌కు సన్మానం.

**ఆరోగ్య పరిరక్షణ పట్ల ప్రజల్లో**

## అవగాహన పెంచాలి: సీతక్క





ప్రజాపక్షం/హైదరాబాద్: ఆరోగ్య పరిరక్షణ పట్ల ప్రజల్లో అవగాహన పెంచేందుకు కృషి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరిఅనసూయ సీతక్క తెలిపారు.' పింక్ పవర్ రన్'లో యువత పెద్ద సంఖ్యలో పాల్గొనడం అభినందనీయమన్నారు. మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ సుధా రెడ్డి ఫౌండేషన్ సంయుక్తంగా హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్‌లో ఆదివారం 'పింక్ పవర్ రన్' నిర్వహించారు. ఈ కార్యక్రమాన్నిడిజిపి సివి ఆనంద్, ఎంఈఐఎల్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ పివి కృష్ణారెడ్డి, సుధా రెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు సుధా రెడ్డి, హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ జనరల్ లారా విలియమ్స్, ఓలెక్ట్రా గ్రీన్టెక్ ఉపాధ్యక్షుడు వివి లక్ష్మీ నారాయణతో కలిసి సీతక్క జెండా ఊపి పింక్ రన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సినీ నటుడు సిద్ధు జొన్నలగడ్డ, మాజీ ప్రపంచ సుందరి ఓపల్ సుచేత, భారత ప్రొఫెషనల్ బాక్సర్ విజేందర్ సింగ్, నారాయణ గ్రూప్ విద్యాసంస్థల డైరెక్టర్ పునీత్, అవినాష్ గ్రూప్ సంస్థల చైర్మన్ అవినాష్ తదితరులు పింక్ రన్‌లో పాల్గొన్నారు. పింక్ పవర్ రన్‌లో నాలుగు విభాగాల్లో పోటీలు నిర్వహించారు. 21 కిలోమీటర్ల హాఫ్ మారథాన్, 10 కిలోమీటర్లు, 5 కిలోమీటర్లు, 3 కిలోమీటర్ల పరుగులు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ సమాజంలో ఆరోగ్యంపై చైతన్యం పెంచేందుకు ఇలాంటి కార్యక్రమం ఎంతో దోహదపడుతాయన్నారు. పివి కృష్ణారెడ్డి మాట్లాడుతూ జీవనశైలి వ్యాధులను నివారించేందుకు రోజువారీ వ్యాయామం ఎంతో అవసరమన్నారు. సుధా రెడ్డి మాట్లాడుతూ పింక్ పవర్ రన్ మూడో ఏడాదికి చేరుకోవడం ఆనందంగా ఉందన్నారు. విజేందర్ సింగ్ మాట్లాడుతూ మహిళలకు సాధికారత కల్పించేందుకు పింక్ పవర్ రన్ దోహదపడుతుందన్నారు. కాగా వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు నిర్వాహకులు మొత్తం రూ.75 లక్షల విలువైన నగదు బహుమతులు అందించారు. నగదుతోపాటు మెడల్స్, ట్రోఫీలను అందజేశారు. 21కే హాఫ్ మారథాన్ పురుషుల విభాగంలో సునీల్ కుమార్ ప్రథమ స్థానంలో నిలవగా, మహిళల విభాగంలో సోనమ్ విజేతగా నిలిచారు.

## రంనాయక్‌సాగర్‌ను సందర్శించిన మాజీమంత్రి హరీష్‌రావు



ప్రజాపక్షం/ సిద్ధిపేట : కాళేశ్వరం మోటార్లు తరచూ ఆన్ అప్ పద్ధతిలో నడిపితే అవి దెబ్బతింటాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. ఆదివారం సిద్ధిపేట నియోజకవర్గంలోని రంగనాయక సాగర్ ను ఆయన సందర్శించారు. రంగనాయక సాగర్‌లో జలకళను చూసి సంతోషం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం మోటార్లను ఎనిమిది గంటలు నడిపి 16 గంటలు బంద్ చేస్తుందని, దీని ప్రభావం మోటార్ల పై పడి బేరింగులు దెబ్బతింటాయని చెప్పారు.. 24 గంటలు నడిపి రిజర్వాయర్లను నింపాలని ఈ సందర్భంగా కోరారు. రంగనాయక సాగర్‌ను పూర్తిస్థాయిలో నింపి రైతుల పంట పొలాలకు సాగునీరు అందించాలన్నారు. ఇప్పటికే రంగనాయక సాగర్ కుడి కాలువ ద్వారా నంగునూరు మండలంలోని నర్మెట గ్రామం లోగల ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీకి గోదావరి జలాలు అంది నీటి కొరత తీరిందన్నారు. వచ్చే యాసంగికి సాగునీరు అందించేల ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు.

**ఆచార్య కొండా లక్ష్మ ణ్ బాపుజీ అందరికి స్ఫూర్తి..**

ఆదివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో కొండా లక్ష్మ ణ్ బాపూజీ విగ్రహానికి మాజీ మంత్రి హరీష్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన మలిదశ ఉద్యమంలో కూడా వయస్సును లెక్కచేయకుండా తెలంగాణ కోసం తన గొంతును వినిపించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడాలన్న ఆకాంక్షతో చివరి వరకు నిలబడ్డారన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత దొడ్డి కొమురయ్య, కొండా లక్ష్మ ణ్ బాపూజీ, చాకలి ఐలమ్మ, సర్వాయ్ సర్దార్ పాపన్న వారి జయంతి, వర్ధంతి లను అధికారికంగా నిర్వహించిన ఘనత కెసిఆర్‌ది అన్నారు. రెండవ దశ ఉద్యమం ప్రారంభం అయినప్పుడు కూడా తన ఇంటిని టి ఆర్ ఎస్ పార్టీ కీ ఇచ్చి ఆశీర్వదించారు. చేయూత నందించారన్నారు. వారి సేవలు నిరంతరం కొనసాగాలని, ప్రభుత్వాలు కూడా వారి పేరిట కార్యక్రమాలు చేయాలన్నారు.

## యుపిలో వరుణుడి బీభత్సం..

**మూడు రోజుల్లో 56 మంది మృతి**

లక్నో: ఉత్తరప్రదేశ్ రాష్ట్రాన్ని వర్షాలు వణికిస్తున్నాయి. మూడు రోజుల వ్యవధిలో భారీ వర్షాలు, వర్షాలవల్ల జరిగిన ప్రమాదాల్లో రాష్ట్రవ్యాప్తంగా 56 మంది మృతిచెందారు. మరో 46 మంది గాయపడ్డారు. సీతాపూర్ జిల్లాలో అత్యధికంగా ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. ఇంకా పలు జిల్లాలు వరద పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. సాధారణ వర్షపాతం 1.8 మిల్లీమీటర్లతో పోల్చితే.. గత 24 గంటల వ్యవధిలో రాష్ట్రంలో ఏకంగా 45.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని అధికారులు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం వెయ్యికిపైగా ఇళ్లు ధ్వంసమయ్యాయి. ఘాఘ్రా, రాప్తి నదుల్లో నీటిమట్టం క్రమంగా పెరుగుతోందని, దీనివల్ల లోతట్టు ప్రాం తాలకు వరద ముప్పు పొంచి ఉందని సెంట్రల్ వాటర్ కమిషన్ హెచ్చరించింది. ఉన్నావ్‌లోని సోనిక్ టోల్‌ప్లాజా వద్ద గంగా ఎక్స్‌ప్రెస్‌వేపై భారీగా వర్షపు నీరు నిలిచిపోయింది. దీనికి సంబంధించిన వీడియోను షేర్ చేస్తూ.. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ యుపి ప్రభుత్వంపై వ్యంగ్యాస్త్రాలు విసిరారు. ఆ రహదారి పేరును 'గంగా ఎక్స్‌ప్రెస్ వాటర్‌వే' గా మార్చాలని ఎద్దేవా చేశారు.

# ప్రాణాల మీదకు తెస్తున్న సర్వీస్ వెపన్స్

**ఆయుధాల నిర్వహణలో మరింత..**
**కఠినమైన భద్రతా ప్రమాణాలు అవసరం**



ప్రజాపక్షం/హైదరాబాద్: పోలీసుల చేతిలో ప్రజల రక్షణకు ఆయుధం.. అదే ఆయుధం ఏమాత్రం అప్రమత్తత లోపించినా వారి ప్రాణాలనే బలితీసుకునే ప్రమాదం. నిజామాబాద్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో శుక్రవారం చోటు చేసుకున్న ఘటన దీనికి మరో విషాదకర ఉదాహరణగా నిలిచింది. ఎన్ఎస్ఒ డ్యూటీ ముగించుకుని హెడ్‌క్వార్టర్స్‌కు వచ్చిన రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ హెచ్. సతీష్, తన సర్వీస్ ఆయుధాన్ని శుభ్రం చేస్తుండగా ప్రమాదవశాత్తు తుపాకీ పేలడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఘటనపై పోలీస్ కమిషనర్ సాయి చైతన్య సంఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణకు ఆదేశించారు.

**గతంలోనూ వరుస ఘటనలు..**

ఇది తెలంగాణలో ఆయుధాల ప్రమాదవశాత్తు పేలుడుకు సంబంధించిన ఒంటరి ఘటన కాదనే విషయం గత రికార్డుల్లో కనిపిస్తోంది. 2020 జూన్‌లో నిర్మల్‌లో విధుల్లో ఉన్న ఆర్మ్‌డ్ రిజర్వ్ హెడ్ కానిస్టేబుల్ శంకర్ గౌడ్ ఎస్ఎల్ఆర్‌ను శుభ్రం చేస్తుండగా తుపాకీ మిస్‌ఫైర్ అయి ఛాతిలోకి బుల్లెట్ దూసుకెళ్లింది. ఆయన ప్రాణాలతో బయటపడ్డారు. అదే ఘటనపై వచ్చిన నివేదిక ప్రకారం, ఆ ఏడాదే తిర్యాణి పోలీస్‌స్టేషన్ పరిధిలో మరో ఏఆర్ సిబ్బంది ఆయుధం శుభ్రం చేస్తుండగా ప్రమాదవశాత్తు కాల్పులు జరిగి మృతి చెందారు. అంతకుముందు 2016లో మంచిర్యాల జిల్లా మందమర్రి పోలీస్‌స్టేషన్‌లో పనిచేసిన మరో ఏఆర్ కానిస్టేబుల్ కూడా ఇలాంటి ఘటనలో మృతి చెందినట్లు అప్పటి నివేదిక పేర్కొంది. 2022 నవంబర్‌లో కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల పోలీస్‌స్టేషన్‌లో సెంట్రీ డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ ఎస్. రాజినీకుమార్ వద్ద ఉన్న ఎస్ఎల్ఆర్ ప్రమాదవశాత్తు పేలడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందారు. 2023 ఆగస్టులో హైదరాబాద్ హుస్సేనీ ఆలంలోని కబూతర్‌ఖానా పోలీస్ అవుట్‌పోస్ట్‌లో గార్డ్ ఇన్‌చార్జిగా ఉన్న టీఎస్ఎస్‌పీ హెడ్ కానిస్టేబుల్ భూపతి శ్రీకాంత్ వద్ద ఉన్న కార్బన్ ప్రమాదవశాత్తు పేలడంతో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన విశ్రాంతి గదిలో నిద్రిస్తున్న సమయంలో పక్కనే ఉన్న ఆయుధం మిస్‌ఫైర్ అయినట్లు అప్పటి పోలీసులు తెలిపారు. ఇక 2025లో హైదరాబాద్ మసాబ్‌ట్యాంక్‌లోని పోలీస్ ఆఫీసర్స్ మెస్‌లో ఓ కానిస్టేబుల్ ఎస్ఎల్ఆర్‌ను శుభ్రం చేస్తుండగా మిస్‌ఫైర్ అయింది. ఈ ఘటనలో ఎవరూ గాయపడకపోవడంతో పెను విషాదం తప్పింది.

**'క్లీన్ చేస్తున్నాం'.. కానీ బుల్లెట్ లోపలే ఉంటే?**

ఆయుధాన్ని శుభ్రం చేసే ముందు అది పూర్తిగా ఖాళీగా ఉందో లేదో నిర్ధారించుకోవడం అత్యంత ప్రాథమిక భద్రతా చర్య. కానీ శిక్షణ పొందిన సిబ్బంది వద్ద కూడా ఇలాంటి ఘటనలు పునరావృతం కావడం ఆయుధాల నిర్వహణలో 'చెక్ – రీచెక్ – క్లీన్' విధానాన్ని మరింత కఠినంగా అమలు చేయాల్సిన అవసరాన్ని సూచిస్తోంది. ప్రత్యేకించి ఎస్ఎల్ఆర్, కార్బన్, పిస్టల్, రివాల్వర్ వంటి వేర్వేరు ఆయుధాలకు వేర్వేరు ఆపరేటింగ్ విధానాలు ఉంటాయి. డ్యూటీ నుంచి తిరిగి వచ్చిన వెంటనే అలసటలో ఆయుధాన్ని హ్యాండిల్ చేయడం, మ్యాగజైన్ లేదా చాంబర్‌ను పూర్తిగా తనిఖీ చేయకపోవడం, ట్రిగ్గర్‌పై అనవసర ఒత్తిడి పడటం, శుభ్రం చేసే సమయంలో ఆయుధం నోరు మనిషి వైపు ఉండటం వంటి అంశాలు ప్రమాదాన్ని పెంచే అవకాశముంది.

**ఇక భద్రతకు 'జీరో రిస్క్' విధానం అవసరం..**

పోలీసు ఆయుధాల విషయంలో కేవలం వ్యక్తిగత జాగ్రత్తలకే పరిమితం కాకుండా సిస్టమ్ ఆధారిత భద్రతా విధానం అవసరం. ఆయుధాన్ని శుభ్రం చేసే ముందు తప్పనిసరిగా అన్‌లోడ్ చేసి, చాంబర్ ఖాళీగా ఉందని రెండుసార్లు తనిఖీ చేయడం, ఆయుధం ఎప్పుడూ సురక్షిత దిశలోనే ఉండేలా చూడడం, శుభ్రపరిచే ప్రాంతాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేయడం, ఆయుధాల నిర్వహణ సమయంలో ఇతర సిబ్బందిని అవసరంలేకుండా దగ్గరకు రానివ్వకపోవడం వంటి చర్యలు కీలకం. అదే సమయంలో ప్రతి పోలీస్ స్టేషన్, రిజర్వ్ పోలీస్ లైన్స్, బెటాలియన్, హెడ్‌క్వార్టర్స్‌లో నిర్దిష్ట ఆయుధ భద్రతా ప్రోటోకాల్ అమలు చేయాలి. కేవలం కొత్తగా నియమితులైన సిబ్బందికే కాకుండా సంవత్సరాల అనుభవం ఉన్న అధికారులకు కూడా నిరంతర రిఫ్రెషర్ ట్రైనింగ్ ఇవ్వాల్సిన అవసరం ఉంది.డ్యూటీ ముగించుకుని వచ్చిన వెంటనే ఆయుధాన్ని శుభ్రం చేయడం వంటి సందర్భాల్లో సిబ్బంది అలసటలో ఉండే అవకాశం ఉంటుంది. అందువల్ల ఆయుధాల శుభ్రపరిచే ప్రక్రియను వ్యక్తిగతంగా కాకుండా, అవసరమైన చోట పర్యవేక్షణలో నిర్వహించే విధానం అమలు చేయడం ద్వారా మానవ తప్పిదాలను తగ్గించే అవకాశం ఉంటుంది. నిజామాబాద్ ఘటనపై దర్యాప్తులో అసలు మిస్‌ఫైర్‌కు దారితీసిన పరిస్థితులు ఏమిటి? ఆయుధంలో బుల్లెట్ ఎలా ఉంది? ఆయుధాన్ని శుభ్రం చేసే ముందు ఎలాంటి భద్రతా చర్యలు తీసుకున్నారు? ప్రామాణిక విధానం పాటించబడిందా? వంటి అంశాలు వెలుగులోకి రావాల్సి ఉంది.



## ఉమ్మడి జిల్లా తైక్వాండో క్రీడాకారులు సీఎం కప్‌లో మెడల్స్ సాధించాలి

నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఉమ్మడి నల్గొండ జిల్లా తైక్వాండో క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో సీఎం కప్ పోటీలలో రాణించి పతకాలు సాధించాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆకాంక్షించారు.నల్గొండ జిల్లా కేంద్రంలోని పాత గ్రామర్ స్కూల్ లో నిర్వహిస్తున్న ఉమ్మడి నల్లగొండ జిల్లా తైక్వాండో శిక్షణ శిబిరాన్ని కలెక్టర్ సందర్శించారు.క్రీడాకారులతో మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి అక్బర్ అలీ కలెక్టర్ కు వివరిస్తూ నల్లగొండ,యాదాద్రి భువనగిరి,సూర్యాపేట జిల్లాల నుండి సుమారు 200 మంది బాలురు,100 మంది బాలికలు వివిధ కేటగిరీల్లో ఈ శిక్షణలో పాల్గొంటున్నారని తెలిపారు. రాబోయే రాష్ట్ర స్థాయి, సీఎం కప్ పోటీలకు వీరికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని చెప్పారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. అన్ని క్రీడల్లా కాకుండా తైక్వాండో భిన్నమైనదని, ఇది శారీరక, మానసిక దారుఢ్యాన్ని పెంపొందిస్తుందని అన్నారు. పోటీలను బాగా అభ్యసించి అన్ని స్థాయిల్లో మెడల్స్ సాధించడమే కాకుండా రాష్ట్ర స్థాయి సీఎం కప్ లో కూడా పతకాలు సాధించి ఉమ్మడి జిల్లా ఖ్యాతిని ఇనుమడింపచేయాలని పిలుపునిచ్చారు.క్రీడాకారులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, ప్రభుత్వం తరపున పూర్తి సహకారం ఉంటుందని కలెక్టర్ హామీ ఇచ్చారు.

## డబ్బుల వివాదంలో తోటి కూలీ దారుణ హత్య

ఓ అపార్ట్‌మెంట్‌లో హత్య తీవ్ర కలకలం



**ప్రజాపక్షం/నల్లగొండ :** పట్టణంలోని మీర్బాగ్ కాలనీ రోడ్ నంబర్ 6లో దారుణ హత్య కలకలం రేపింది. షా రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌లోని 4వ ఫ్లోర్ లోని 402 నంబర్ రూమ్‌లో తమిళనాడుకు చెందిన కూలీ మరియన్ ముత్తు దారుణ హత్యకు గురయ్యాడు.పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న చెన్నై షాపింగ్ మాల్ నిర్మాణ పనుల కోసం తమిళనాడు (చెన్నై) నుండి వచ్చిన కూలీల మధ్య జరిగిన ఘర్షణలోనే ఈ హత్య జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. వివాదానికి కారణం కూలీ డబ్బు లేనా కూలీ డబ్బులు, వేతనాల విషయంలో మాటా మాటా పెరిగి తీవ్ర ఘ ర్షణగా మారిందని,ఆ గొడవ తారస్థాయికి చేరడంతో జుట్టు పట్టుకుని నేల కేసి కొట్టి హత్య చేసిన ఆనవాళ్లు ఉన్నాయని స్థానికులు,పోలీసులు తెలిపా రు. ఆర్థిక లావాదేవీల వివాదమే ఈ దారుణానికి దారితీసి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు.సమాచారం అందుకున్న వెంటనే డీఎస్పి శివరామరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. టూ టౌన్ సీఐ ఆదిరెడ్డి,ఎస్ఐ సైదాబాబు ఆధ్వర్యంలో క్లూస్ టీమ్‌తో కలిసి ఆధా రాలు సేకరించారు. కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలింపు చేపట్టారు.


## అమ్మయాది ఫౌండేషన్ 14వ వార్షికోత్స వేడుకలు



**ప్రజాపక్షం/గుండాల:** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం బ్రహ్మణపల్లి గ్రామంలో ఆదివారం అమ్మయాది పెండెం ఫౌండేషన్ 14వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. పెండెం సోమక్క సత్తయ్య దంపతుల పేరిట స్థాపించిన ఈ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పెండెం సత్యనారాయణ లక్ష్మి దంపతులు ఆధ్వర్యంలో నిర్వీరామంగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ 14వ వార్షికోత్సవాన్ని జరుపుకోవడం ఆనందంగా ఉందని ఫౌండేషన్ వ్యవస్థాపకులు సత్యనారాయణ తెలిపారు. ఆదివారం నిర్వహించిన ఈ 14వ వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా సిని గేయరచయిత,పద్మశ్రీ డా. సుద్దాల అశోక్ తేజ, ప్రముఖ కవి మిట్టపల్లి సురేందర్‌లు హాజరై మాట్లాడుతూ అమ్మ యాది ఫౌండేషన్ ఆధ్వర్యంలో కవులను, కళాకారులను, వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారిని సన్మానించడం అభినందనీయం అని, అమ్మయాది ఫౌండేషన్ సేవలు మరువలేనివని వారు అన్నారు. అదే విధంగా గ్రామంలో పదవ తరగతిలో ప్రతమ స్థానంలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సహకం అందజేశారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ ఆలకుంట్ల సుధాకర్‌రెడ్డి, రెడ్ క్రాస్‌చైర్మన్ డా. లక్ష్మి నర్సింహారెడ్డి, ప్రముఖ పారిశ్రామిక వేత్త వెంకట్‌రెడ్డి, సినియర్ జర్నలిస్ట్ ఎస్ఎన్‌చారి, ఉప సర్పంచ్ పెద్దిరాజు, గ్రామస్తులు ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## మద్యం బాటిల్‌లో సాలీడు

వైన్‌షాప్ నిర్వాహకులపై వినియోగదారుడి ఫిర్యాదు



**ప్రజాపక్షం/మునుగోడు:** మండల కేంద్రంలోని ఓ వైన్‌షాప్‌లో కొనుగోలు చేసిన మద్యం ఫుల్ బాటిల్‌లో సాలీడు పురుగులు కనిపించాయని ఓ వినియోగదారుడు ఆరోపించాడు.వినియోగదారుడి వివరాల ప్రకారం.మండల కేంద్రంలోని వైన్ షాప్‌లో 'ఆల్ సీజన్స్' బ్రాండ్‌కు చెందిన మద్యం ఫుల్ బాటిల్‌ను కొనుగోలు చేశాడు. ఇంటికి తీసుకెళ్లి బాటిల్‌ను తెరిచి పరిశీలించగా అందులో సాలీడు పురుగులు కనిపించడంతో ఒక్కసారిగా అవాక్కయ్యాడు. వెంటనే బాటిల్‌ను తీసుకుని వైన్‌షాప్ నిర్వాహకులను సంప్రదించి,మద్యం బాటిల్‌లో పురుగులు ఎలా వచ్చాయని ప్రశ్నించినట్లు వినియోగదారుడు తెలిపాడు. అయితే, బాటిల్‌లో పురుగులు రావడానికి తమకు ఎలాంటి సంబంధం లేదని, తయారీ సంస్థపైనే ఫిర్యాదు చేసుకోవాలని నిర్వాహకులు చెప్పినట్లు ఆరోపించాడు.ఈ క్రమంలో వినియోగదారులతో నిర్వాహకులు దురుసుగా ప్రవర్తించినట్లు కూడా ఆయన పేర్కొన్నాడు. ఘటనపై సంబంధిత అధికారులు సమగ్రంగా విచారణ జరిపి,బాటిల్‌లో పురుగులు ఎలా వచ్చాయనే విషయాన్ని నిర్ధారించాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

# సన్నబియ్యం పథకం సంతృప్తికరం

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

సూర్యాపేట జిల్లాలో మొత్తం కలిపి 3,72,658 రేషన్ కార్డులు




**ప్రజాపక్షం/నేరేడుచర్ల :** పేదలకు కడుపునిండా అన్నం పెట్టే సన్న బియ్యం పథకం ఎంతో సంతృప్తినిచ్చిందని రాష్ట్ర పౌర సరఫరాల, భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం నేరేడుచర్ల పట్టణంలోని ఎస్‌కెఎస్ ఫంక్షన్ హాల్‌లో నేరేడుచర్ల, గరిడేపల్లి, పాలకవీడు మండలాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌తో కలిసి ఆయన స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ పార్టీ అధికారంలోకి వచ్చాక 16,32,810 కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశామన్నారు. తెలంగాణలో మొత్తం 1,06,28,092 రేషన్ కార్డులు ఉన్నాయని, దీంతో 3,42,57,109 మంది ఆహార భద్రత లబ్ధి పొందుతున్నట్లు తెలిపారు. సూర్యాపేట జిల్లాలో మొత్తం కలిపి 3,72,658 రేషన్ కార్డులు ఉన్నాయన్నారు. హుజూర్‌నగర్ నియోజక వర్గంలో మొత్తం రేషన్ కార్డులు 1,08,011 ఉండగా కొత్తగా గరిడేపల్లి మండలంలో 20,258, పాలకీడు మండలంలో 9,095, నేరేడుచర్ల మండలంలో 14,035 రేషన్ కార్డులు పంపిణీ చేయడం జరిగిందని వివరించారు. సన్న బియ్యం పంపిణీతో పేద ప్రజలకు కడుపునిండా భోజనం పెడుతున్నామని గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన దొడ్డు బియ్యం కోళ్ల ఫారాలు, బీర్ల తయారీ, రైస్ మిల్లర్లు అక్రమాలకు పాల్పడడానికి ఉపయోగపడ్డాయన్నారు. తమ ప్రభుత్వం అర్హులైన ప్రతి పేదవాడికి తెల్ల రేషన్ కార్డు ఇచ్చి ప్రతి ఒక్క మనిషికి 6 కిలోల చొప్పున ఉచిత బియ్యం అందిస్తున్నామని రాష్ట్రంలో 85 శాతం మంది జనాభాకు కడుపునిండా అన్నం పెట్టే పథకం పెట్టడం చాలా సంతృప్తినిచ్చిందన్నారు. జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మాట్లాడుతూ సన్న బియ్యం పథకం హుజూర్‌నగర్‌లో అదేవిధంగా కొత్తరేషన్ కార్డులను తిరుమలగిరి నుండి రెండు మన జిల్లా నుండి ప్రారంభించుకోవడం చాలా సంతోషకరమైన విషయమన్నారు. ఈ కార్యక్రమంలో పేరిక కార్పోరేషన్ చైర్మన్ దొంగరి వెంకటేశ్వర్లు, రాష్ట్ర అగ్రికల్చర్ కమిటి సభ్యులు చెవిటి వెంకన్న, జిల్లా ఎస్పి కె. నరసింహ, హుజూర్‌నగర్ ఆర్‌డిఓ శ్రీనివాసులు, నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్ కొణతం చిన వెంకట్‌రెడ్డి, వైస్ చైర్మన్ నూకల సందీప్ కుమార్ రెడ్డి, నేరేడుచర్ల, పాలకవీడు, గరిడేపల్లి తహశీల్దారులు సైదులు పాల్గొన్నారు.

**పేదలకు కడుపునిండా అన్నంపెట్టే సన్న బియ్యం**

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** పేదలకు కడుపునిండా అన్నంపెట్టే సన్న బియ్యం పథకం ఎంతో సంతృప్తినిచ్చిందని రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం హుజూర్ నగర్ వివిఎం స్కూల్‌లో హుజూర్‌నగర్, మఠంపల్లి మండలాలకు చెందిన అర్హులైన ప్రజలకు కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ తో కలిసి ఆయన స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. సూర్యాపేట జిల్లాలో మొత్తం కలిపి 3,72,658 రేషన్‌కార్డులు ఉన్నాయని తెలిపారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలో మొత్తం రేషన్‌కార్డులు1,08, 011 ఉండగా, ఈ రోజు కొత్తగా హుజూర్‌నగర్ మండలంలో 21395, మఠంపల్లి మండలంలో 16203 కొత్త స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు.



## ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవం


**ప్రజాపక్షం/యాదాద్రి :** పర్యాటక రంగంలో డిజిటల్ సాంకేతికత, కృత్రిమ మేధస్సును విస్తృతంగా వినియోగించాలని జిల్లా ఇంచార్జి కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. ఆదివారం సెప్టెంబర్ 27ను ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని పర్యాటకాన్ని పునఃరూపకల్పన చేయడానికి డిజిటల్ ఎజెండా , కృత్రిమ మేధస్సు అనే అంశంపై జిల్లా యువజన మరియు క్రీడల శాఖ ఆధ్వర్యంలో భువనగిరి ఖిల్లాపై ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యాదాద్రి భువనగిరి జిల్లా ఇంచార్జి కలెక్టర్ భాస్కర్ రావు, మున్సిపల్ చైర్మన్ తంగళ్లపల్లి రవికుమార్, వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మరిన్ని టూరిజం క్లబ్బు, పర్యాటక గమ్య స్థానాలను అభివృద్ధి చేసి యాదాద్రి భువనగిరి జిల్లాను ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఆర్‌డిఓ కృష్ణారెడ్డి, డిఆర్‌డిఏ పీడీ నాగిరెడ్డి పాల్గొన్నారు.

# ఐలమ్మ స్ఫూర్తితో పోరాడుదాం

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం , ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో స్వాతంత్ర సమరయోధుడు తెలంగాణ ఉద్యమ నేత కొండా లక్ష్మ ణ్ బాపూజీ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వెంకటేశ్వర రజక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి చిట్యాల ఐలమ్మ స్ఫూర్తితో పోరాడాలని అన్నారు. చాకలి ఐలమ్మ ధైర్యం ఆత్మగౌరం పోరాట స్ఫూర్తి నేటి తరాన్ని ఆదర్శమని అన్నారు. సామాజిక అసమానతలు దోపిడికి వ్యతిరేకంగా ఆమె సాగించిన పోరాటం తెలంగాణ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించబడి ఉన్నదని పేర్కొన్నారు. వెనుకబడిన మునుగోడు ప్రాంతాని సస్యశ్యామలం చేసేందుకు పోరాటానికి సిద్ధం కావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి, ఉపసర్పంచ్ పల్లె మల్లారెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ జిల్లా నాయకులు, మాజీ ఎంపీపీలు ,జెడ్పిటిసిలు, ఎంపీటీసీలు, సర్పంచులు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చనగోని గాలయ్య, కె. శ్రీనివాస్ , సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్ ,కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కే శ్రీను నాయక్, సిపిఐ కాంగ్రెస్ పార్టీల మండల నాయకులు పాల్గొన్నారు.



## ఉపాధ్యాయుల సేవలు సమాజ నిర్మాణానికి పునాది

ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

**ప్రజాపక్షం/యాదాద్రి :** సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని, వారి సేవలే భావి భారత నిర్మాణానికి బలమైన పునాదని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పేర్కొన్నారు. తెలంగాణ గుర్తింపు పొందిన ప్రైవేట్ యాజమాన్యాల సంఘం (ట్రాస్మా) యాదాద్రి భువనగిరి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 'గురుపూజోత్సవ' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం బీర్ల అయిలయ్య సరస్వతి దేవి చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా విద్యాబోధనలో విశేష సేవలుందించిన పలువురు ఉపాధ్యాయులను ఆయన పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాలు బోధించడమే కాకుండా వారిలో క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యత, దేశభక్తిని పెంపొందించడంలో గురువుల పాత్ర అద్భుతమైనదని కొనియాడారు. ప్రజా ప్రభుత్వం విద్య, విద్యావేత్తలు, విద్యార్థుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని తెలిపారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రాస్మా జిల్లా ప్రతినిధులు, వివిధ విద్యాసంస్థల నిర్వాహకులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## న్యాయవాదుల రక్షణకు కేంద్రం ప్రత్యేక చట్టం తీసుకురావాలి


ఐఏఎల్ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ డిమాండ్



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** న్యాయవాదుల రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని, న్యాయవాదుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగినన్ని నిధులు కేటాయించాలని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ధర్మబిక్షం భవన్‌లో ఐఏఎల్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. న్యాయవాదుల సంక్షేమం, వృత్తిపరమైన భద్రతకు ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన కోరారు. ముఖ్యంగా వృత్తిలోకి కొత్తగా ప్రవేశిస్తున్న జూనియర్ న్యాయవాదులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున వారికి నెలకు రూ.10వేల స్టైఫండ్ అందించాలన్నారు. ఇటీవల రంగారెడ్డి జిల్లా అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో న్యాయవాదులపై అనుచిత ప్రవర్తన, దాడులు, బెదిరింపులు వంటి సంఘటనలను వారు ఖండించారు. తక్షణమే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ దాడులను అరికట్టేందుకు దేశవ్యాప్తంగా అమలు అయ్యే రక్షణ చట్టం అవసరమని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే పలు రాష్ట్రాల్లో న్యాయవాదుల రక్షణకు సంబంధించిన చట్టపరమైన చర్యలు చేపట్టిన నేపథ్యంలో కేంద్ర స్థాయిలో కూడా సమగ్ర చట్టం తీసుకురావాలని అన్నారు. అలాగే న్యాయవాదుల సంక్షేమ నిధులకు ప్రభుత్వాలు తగిన నిధులు సమకూర్చి, వైద్యం, కుటుంబ సంక్షేమం, వృత్తి ప్రారంభ దశలో ఆర్థిక సహాయం వంటి అంశాల్లో భరోసా కల్పించాలని కోరారు. యువ న్యాయవాదులకు ఆర్థిక సహాయం కల్పించాల్సిన అవసరాన్ని సుప్రీం కోర్టు కూడా 2026లో ప్రస్తావించినప్పటికి న్యాయవాదుల రక్షణ సంక్షేమానికి ప్రభుత్వాలు స్పష్టమైన విధానాన్ని రూపొందించి, వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షులు బొమ్మగాని శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లా కోర్టు భవనాలు నిర్మాణం పూర్తి కాకుండా ఉన్న వాటిని తక్షణమే నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి తొగిటి మురళి జిల్లాకు సంబంధించిన సభ్యత్వం సమీక్షను వివరించారు. ఈ సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## దళిత యువకులపై పోలీసుల దాడి హేయం

బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రామచంద్రారెడ్డి తీవ్ర ఆగ్రహం



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** యాదగిరిగుట్ట మండలం సైదాపురం గ్రామంలో బిఆర్ఎస్ పార్టీకి చెందిన దళిత యువకులపై పోలీసులు విచక్షణారహితంగా భౌతిక దాడులకు పాల్పడటం అత్యంత హేయమైన చర్య అని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కల్లూరి రామచంద్రారెడ్డి తీవ్రంగా ఖండించారు. ఆదివారం బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించి మనోధైర్యం కల్పించి బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అధికార కాంగ్రెస్ పార్టీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి పోలీసులు దళితులపై దౌర్జన్యానికి దిగడం ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేయడమేనని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

సైదాపురంలో అసలు ఏం జరిగింది?

గణేష్ నిమజ్జనం శోభాయాత్ర సందర్భంగా సైదాపురం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ దళిత యువకులు తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాటలు పెట్టుకుని డ్యాన్స్ చేశారు. దీనిని జీర్ణించుకోలేని స్థానిక కాంగ్రెస్ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, హుటాహుటిన శోభాయాత్ర వద్దకు చేరుకున్న యాదగిరిగుట్ట పోలీసులు 9 మంది దళిత యువకులను బలవంతంగా పోలీస్ స్టేషన్కు తరలించారు. స్టేషన్లో యువకులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ చితకబాదారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న కల్లూరి రామచంద్రారెడ్డి తక్షణమే స్పందించి, తన అనుచరులతో పాటు బాధితులను యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ ఆకాంక్ష్ యాదవ్ వద్దకు పంపించి, దాడికి పాల్పడిన పోలీసులపై ఫిర్యాదు చేయించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## తూఫ్రాన్‌పేటలో వృద్ధురాలు హత్య?

మెడలో బంగారు గొలుసు, 8 తులాల బంగారం ఎత్తుకెళ్లిన దుండగులు

కేసు చేసి దర్యాప్తు చేస్తున్న చౌటుప్పల్ పోలీసులు



**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** వృద్ధురాలు అనుమానాస్పదంగా మృతిచెందిన సంఘటన చౌటుప్పల్ మండలం తూఫ్రాన్‌పేట గ్రామంలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం తుఫ్రాన్ పేట గ్రామానికి చెందిన ఒంటరి వృద్ధురాలు మంటిపల్లి యాదమ్మ(70) వివాహం తర్వాత భర్త నుండి దూరంగా ఉంటూ,పుట్టింటి గ్రామం తుఫ్రాన్‌పేట గ్రామంలో సుమారు 50సంవత్సరాల నుండి నివాసం ఉంటుంది. కూలీ చేసుకుంటు జీవనం సాగించింది. వయస్సు మీద పడడంతో ఇంటి వద్దే ఉం టుంది. ఈ క్రమంలో శనివారం సాయంత్రం ఇంటి చుట్టు ప్రక్కల వారితో మాట్లాడింది. ఆమెకు ఎలాంటి అనారోగ్య సమస్యలు లేవు. అయితే ఆదివారం ఉదయం యాదమ్మ ఇంటి తలుపులు తీయకపోవడంతో పక్కనే ఉన్న మంటిపల్లి శ్రీశైలం తలుపులు తెరిచి చూడగా మంచంలో మృతి చెంది ఉంది.దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వగా సిఐ మన్మథకుమార్ సంఘటన స్థలానికి చెరుకోని మృతదేహాన్ని పరిశీలించారు.మృతి చెందిన యాదమ్మ శరీరంపై గాయాలు,మెడ దగ్గర గోర్లతో గీసినట్లు గాయాలు ఉన్నాయి.అనుమానస్పందంగా మృతిగా భావించిన పోలీసులు మృతదేహంపై గాయాలు ఉండడంతో గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేశారా అనే కోణంలో దర్యాప్తు ముమ్మ రం చేశారు. ఇదిలా ఉండగా ఒంటరిగా ఉంటున్న వృద్ధురాలును టార్గెట్ చేసుకోని బంగారు నగలు ఎత్తుకెళ్ళేందుకు ఎకంగా హత్యనే చేసినట్లు గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నా రు. యాదమ్మ మెడలో ఉన్న గోలుసుతో పాటు ఇంట్లో ఉన్న 8తులాల బంగారం లేదు.మృతదేహంపై గాయాలు ఉండడంతో గుర్తుతెలియని దుండగులు హత్య చేసి ఉంటారని గ్రామస్తులు చెప్తున్నారు.దీంతో మృతదేహానికి పోస్ట్‌మార్టం చేయడానికి హైద్రాబాద్ లోని ఉస్మానియా ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించారు. పోస్ట్‌మార్టం అనంతరం ఆదివారం రాత్రి అంత్యక్రియలు పూర్తి చేశారు.మృతురాలి బంధువు మంటిపల్లి దర్శన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ మన్మథకుమార్ తెలిపారు.యాదమ్మను హత్య చేశారనే అనుమానంతో గ్రామస్తులు భయాందోళనలో ఉన్నారు. యాదమ్మ మృతిపై విచారణ జరపాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## ఏఐఎస్ఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా నూతన అధ్యక్ష కార్యదర్శులుగా మధు, శాంతి కుమార్ ఏకగ్రీవంగా ఎన్నిక



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** ఆలేరు పట్టణంలో జరిగిన ఏఐఎస్ఎఫ్ జిల్లా 4వ మహాసభ లో యాదాద్రి భువనగిరి జిల్లా ఏఐఎస్ఎఫ్ నూతన అధ్యక్ష కార్యదర్శులుగా కందుల మధు ఉప్పల శాంతి కుమార్ ఉపాధ్యక్షులుగా చిప్పలపల్లి నవీన్ సహాయ కార్యదర్శి గా లోకేష్ కోశాధికారిగా జిట్టా గౌతం 19మంది నూతన కౌన్సిల్ సభ్యులతో జిల్లా సమితి ఏకగ్రీవంగా ఎన్నిక జరిగిందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్టా లక్ష్మ ణ్ తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కందుల మధు ఉప్పల శాంతి కుమార్ లు మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లాలో విద్యార్థులు ఎదుర్కొంటున్న విద్యారంగ సమస్యలపై ఏఐఎస్ఎఫ్ పక్షాన పోరాటాలు నిర్వహించి మండలాలలో ఏఐఎస్ఎఫ్ నిర్మాణం చేసి యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా విద్యారంగ సమస్యలపై పోరాడుతామని తెలిపారు. ఎన్నికకు సహకరించిన ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మ ణ్‌కి సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డికి జిల్లా కార్యవర్గానికి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు.

## దివ్యాంగుల గుర్తింపునకు ప్రత్యేక శిబిరాలు

**ప్రజాపక్షం/నల్లగొండ:** జిల్లాలోని 33 మండలాలకు చెందిన వివిధ రకాల దివ్యాంగులకు అవసరమైన ప్రత్యేక ఉపకరణాల అందజేత కోసం భారతీయ కృత్రిమ అవయవముల తయారీ సంస్థ (అలిమ్కో),హైదరాబాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక గుర్తింపు శిబిరాలను నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి ఎస్‌టి.లావణ్యకుమారి తెలిపారు.దివ్యాంగుల అవస రాలను గుర్తించి బ్యాటరీ మోటరైజ్డ్ ట్రైసైకిళ్లు,వీల్‌చైర్లు,శ్రవణ యంత్రాలు, చంక కర్రలు, ఎంఎస్ఐఈడీ కిట్లు,బ్రెయిలీ కిట్లు,స్మార్ట్ కేన్‌లు,ట్రైసైకిళ్లు తదితర సహాయక ఉపకరణాలను అందించేందుకు ఈ శిబిరాలను నిర్వహి స్తున్నట్లు పేర్కొన్నారు.ఈనెల 28న నల్లగొండ,29న మిర్యాలగూడ,30న దేవరకొండ,అక్టోబర్ 1నచండూర్ డివిజన్‌లోశిబిరం నిర్వహిస్తారు.శిబిరాలకు హాజరయ్యే దివ్యాంగులు తప్పనిసరిగా సదరం డాక్టర్ సర్టిఫికెట్, ఆదాయ ధ్రువపత్రం లేదా రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఒక పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, యూడీఐడీ కార్డు తదితర పత్రాలను వెంట తీసుకురావాలని అధికారులు సూచించారు.అర్హత కలిగిన దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సంబంధిత తేదీల్లో నిర్వహించే శిబిరాలకు హాజరై తమ అవసరాలకు అనుగుణమైన సహాయక ఉపకరణాల కోసం

12 ప్రజాపక్షం Telugu National Daily
హైదరాబాద్
సోమవారం
28-09-2026
www.prajapaksham.in

"సందీప్ కిషన్ యాక్షన్-అడ్వెంచర్ హీస్ట్ కామెడీ ఎంటర్‌టైనర్ 'సిగ్మా'. ఈ సినిమాతో జేసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఫారియా అబ్దుల్లా హీరోయిన్. ప్రతిష్టాత్మక లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సుభాస్కరన్ నిర్మించారు."



## కొత్త తరహా ప్రేమ కథ 'చకోర'

'ట్రైలర్ రిలీజ్' ఈవెంట్‌లో ఆకాష్ పూరి



హాయ్ జాయ్ కమర్షియల్స్ బ్యానర్‌పై డా. చింతాడ హేమారావు నిర్మాతగా, వింటేజ్ ఐకానిక్ పిక్చర్స్ నిర్మాణ సారథ్యంలో మంగా శ్రీనివాస్ రచన దర్శకత్వంలో రూపొందిన మాస్ పోయెట్రీ మ్యూజికల్ లవ్ స్టోరీ 'చకోర లూనార్ లవ్ బర్డ్'. శ్రవణ్, మలైకా టి. వాసుపల్‌ను సరికొత్త ప్రేమ జంటగా పరిచయం చేస్తూ తెరకెక్కిన ఈ ప్రేమ కథ చిత్రం శ్రీ లక్ష్మి పిక్చర్స్ ద్వారా అక్టోబర్ 9న వరల్ వైడ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. హీరో ఆకాష్ జగన్నాథ్ అతిథిగా ఈ సినిమా ట్రైలర్‌ను హైదరాబాద్‌లో జరిగిన ఈవెంట్‌లో రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ మంగా శ్రీనివాస్ మాట్లాడుతూ నాకు జీవితంలో పోరాటం నేర్పిన నా తండ్రికి, నాకు స్ఫూర్తిగా నిలిచిన మా అమ్మకు, నా ఇండస్ట్రీ గురువు పూరి జగన్నాథ్ కి థ్యాంక్స్. ఈ సినిమా రూపకల్పనలో నాకు అండగా నిలబడిన మా ప్రొడ్యూసర్ చింతాడ హేమారావుకు థ్యాంక్స్. ఇండస్ట్రీలో నాకున్న అనుభవంతో వీలైనంత తక్కువ బడ్జెట్ లో హై క్వాలిటీలో ఈ సినిమాను రూపొందించాను. పేరున్న హీరోలను అప్రోచ్ అయి వారితో సినిమా చేయడం సులువుకాదు. అందుకే కొత్త వాళ్లకు అవకాశం ఇవ్వాలని నిర్ణయించుకుని శ్రవణ్, మలైకా టి.వాసుపల్ ను హీరో హీరోయిన్స్‌గా పరిచయం చేస్తున్నాం. వీరిద్దరు నేను అనుకున్న విజన్‌కు తగినట్లు మంచి పర్ ఫార్మెన్స్ ఇచ్చారు. మా సినిమా అక్టోబర్ 9న థియేటర్స్ లోకి రాబోతోంది అన్నారు. హీరో ఆకాష్ జగన్నాథ్ మాట్లాడుతూ ఈ సినిమా చూశాను చాలా చాలా బాగుంది. ప్రతి ఫ్రేమ్ చాలా బాగుంది. క్వాలిటీలో చూస్తే ప్రతి క్రాఫ్ట్ అద్భుతంగా ఉంది. ఈ చిత్రంలో హీరో శ్రవణ్, హీరోయిన్ మలైకా ను చూస్తే ఈ కథకు వీళ్లు తప్ప మరెవరూ యాప్ట్ కాదు అనిపించింది. అంత బాగా నటించారు. డైరెక్టర్ మంగా శ్రీనివాస్ కి ఈ సినిమా పెద్ద విజయాన్ని అందించాలి. అలాగే ఇలాంటి యంగ్ టీమ్ ను ఎంకరేజ్ చేస్తూ సినిమా నిర్మించిన హేమారావుని అభినందిస్తున్నా. మ్యూజిక్ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణ. ఒక కొత్త తరహా ప్రేమ కథతో వస్తున్న ఈ సినిమా మీ అందరినీ ఎంటర్ టైన్ చేస్తుందని నమ్ముతున్నా అన్నారు.హీరో శ్రవణ్, డిస్ట్రిబ్యూటర్ బాపిరాజు, హీరోయిన్ మలైకా టి. వాసుపల్, ప్రొడ్యూసర్ డా. చింతాడ హేమారావు పాల్గొన్నారు.

## శ్రీకాంత్ పని చేసినప్పుడు దాసరి గుర్తొచ్చారు

'ప్యారడైజ్' సక్సెస్ మీట్‌లో మోహన్ బాబు



మీడియా ములాఖాత్లో కలెక్షన్ కింగ్ మోహన్ బాబు మాట్లాడుతూ దర్శకుడిపై భారం వేసి, సినిమాను నిర్మించిన వాళ్లలో ఒకరిద్దరినే చూశా. మా గురువుగారు దాసరిపై కూడా ఇలాగే నిర్మాతలు నమ్మకం పెట్టుకునేవారు. ఇప్పుడు శ్రీకాంత్‌పై సుధాకర్ చెరుకూరి అదే నమ్మకం ఉంచారు. సుధాకర్ లాంటి నిర్మాత సినిమా పరిశ్రమకు కావాలి. నిర్మాత ఆయన పదికాలాలపాటు చల్లగా ఉండాలని కోరుకుంటున్నాను. దర్శకుడు శ్రీకాంత్ ఈ కథని నాకు చాలా ధైర్యంగా చెప్పాడు. చాలా సులువుగా అర్థమయ్యేలాగా అద్భుతంగా చెప్పాడు. నా సుదీర్ఘ సినీ కెరీర్‌లో 500లకు పైగా చిత్రాల్లో నటించాను కానీ, సికంజ మాలిక్లాంటి భయంకరమైన చేయడం నా లైఫ్‌లో ఫస్ట్ టైం. నన్ను ఇంత భయంకరంగా చూపిస్తాడని అనుకోలేదు. నా లైఫ్‌లో ఎక్కువ తీసుకున్న దర్శకుడు శ్రీకాంత్. మా గురువుగారు దాసరి నారాయణరావు కూడా చాలా తీసుకునేవారు. నువ్వు చేసినవన్నీ బాగున్నాయి. కానీ ఇంకా అద్భుతంగా వస్తుందని చెప్పేవారు. శ్రీకాంత్ తో పనిచేస్తున్నప్పుడు నాకు మా గురువు గుర్తొచ్చారు. శ్రీకాంత్ ఎక్స్‌ట్రార్డినరీ డైరెక్టర్. పాత్రని ఆ పాత్రగానే చూశాడు. ఒక నటుడిగా తనలో ఉన్న టాలెంట్‌ను చూసి గర్వించాను. తను దర్శకుడిగా ఇప్పటికే నిరూపించుకున్నాడు. తను దేశంలోనే టాప్ డైరెక్టర్ అవుతాడు. సినిమా పరిశ్రమ అందరిదీ. ఎవరికి ప్రతిభ ఉంటే వాళ్లని ముందుకు తీసుకెళుతుంది. శ్రీకాంత్‌ను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను అని అన్నారు. హీరో నాని మాట్లాడుతూ నేచురల్ స్టార్ నాని మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఈ సినిమా విషయంలో అన్నీ కొత్తగానే జరిగాయి. ఫిలిం మేకింగ్, లొకేషన్స్‌లో సిచువేషన్, ట్రైలర్ లేకపోవడం, రిలీజ్ ముందు ఉండే సిచువేషన్.. ఇవన్నీ కొత్తగా ఉన్నాయి. ఒక కొత్త సినిమా చేస్తున్నాం, ఒక కొత్త ఎక్స్‌పీరియన్స్ ఇస్తున్నాం అనుకున్నాం. కానీ ఇలా రెస్పాన్స్ కూడా ఇంత కొత్తగా ఉంటుందని అనుకోలేదు. ఇది నాకు చాలా కొత్త ఎక్స్‌పీరియన్స్. నేను ఎన్నో సినిమాలు చేశాను. ఈ మధ్యకాలంలో సినిమాలు రిలీజ్ అయిన ఉదయం చాలా పాజిటివ్ రెస్పాన్స్ ఉంటుంది. సాయంత్రానికి మిక్స్డ్ రెస్పాన్స్‌గా మారిపోతుంది. 'ప్యారడైజ్' కి రివర్స్‌లో జరిగింది. రిలీజ్ రోజున ప్రీమియర్స్‌కు ఒకలాగా మొదలైంది. ఆ తర్వాత ప్రతి షోకి పాజిటివిటీ పెరుగుతుంది, ఇంకా బెటర్ అవుతుంది. ఈ మధ్యకాలంలో ఇలాంటి రెస్పాన్స్‌ను నేను చూడలేదు. మేమందరం చాలా నిబద్ధతతో ఈ సినిమా చేశాం అని చెప్పారు. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల మాట్లాడుతూ మోహన్ బాబుతో పని చేయడం లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డుగా భావిస్తాను. ఆయన నుంచి పర్సనల్‌గా చాలా విషయాలు నేర్చుకున్నాను. సుధాకర్ ప్రొడక్షన్ హౌస్‌కు కోవిడ్ సమయంలో వచ్చాను. ఇంకా ఇక్కడే ఉండిపోయాను. నేను ఏం ఫీల్ అవుతానో ఆయనకి క్లియర్‌గా అర్థమవుతుంది. నన్ను భరించినందుకు ఆయనకి థాంక్యూ. నాని అన్నది నాది 'దసరా', 'ప్యారడైజ్' సినిమాలకు సంబంధించిన అనుబంధం కాదు. మా ఎమోషన్ని సినిమాలతో ముడి పెట్టకూడదు. కచ్చితంగా ఆయన నన్ను భరించాలి. ఆయన నన్ను మోయాలి. మరో ఆప్షన్ లేదు. మా ఇద్దరి అనుబంధం ఇక్కడితో ఆగిపోయేది కాదు అని అన్నారు.

## సంజయ్ గొప్ప స్థాయికి వెళ్లాలని కోరుకుంటున్నా




'సిగ్మా' ప్రీరిలీజ్ ఈవెంట్‌లో చిరంజీవి

సందీప్ కిషన్ యాక్షన్‌అడ్వెంచర్ హీస్ట్ కామెడీ ఎంటర్‌టైనర్ 'సిగ్మా'. ఈ సినిమాతో జేసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఫారియా అబ్దుల్లా హీరోయిన్. ప్రతిష్టాత్మక లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సుభాస్కరన్ నిర్మించారు. కోస్తాంధ్ర, తెలంగాణలో మైత్రి మూవీ డిస్ట్రిబ్యూటర్స్ లిమిటెడ్ ఈ చిత్రాన్ని విడుదల చేస్తుండగా, సీడెడ్ ప్రాంతంలో ఎస్వీఆర్ సినిమా విడుదల చేస్తుంది. అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరైన ఈ వేడుక చాలా గ్రాండ్‌గా జరిగింది.ప్రీరిలీజ్ ఈవెంట్‌లో మెగాస్టార్ చిరంజీవి మాట్లాడుతూ ఈ దర్శకుడు జేసన్ సంజయ్ తాత నాకు 'చట్టానికి కళ్లులేవు', 'దేవాంతకుడు' లాంటి అద్భుతమైన చిత్రాలు ఇచ్చారు. ఆయన మనవడు డైరెక్ట్ చేస్తున్నాడు అంటే కచ్చితంగా ఈ వేడుకకు రావాలనిపించింది. అలాగే విజయ్ సినిమాలకు కూడా మేము ముహూర్తానికి వెళ్లడం జరిగింది. సంజయ్ని చూస్తే విజయ్ని చూసినట్టుగా ఉంటుంది. తను ఎందుకు హీరో కాకూడదు అని అడిగినప్పుడు, నాకు దర్శకత్వం, రచన అంటే ఇష్టం అని చెప్పాడు. అక్టోబర్ 2న రిలీజ్ అవుతున్న ఈ సినిమా ఖచ్చితంగా విజయం సాధించాలని కోరుకుంటున్నాను అని అన్నారు. హీరో సందీప్ కిషన్, డైరెక్టర్ జేసన్ సంజయ్ మ్యూ, సంగీత దర్శకుడు తమన్ నిర్మాత నవీన్ ఎర్నేని, హీరోయిన్ ఫారియా అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు,

## అక్టోబర్ 1న 'సంచారి'



నివిన్ పౌలీ, సూరి, అంజలి ప్రధాన పాత్రల్లో నటించిన తమిళ సినిమాను తెలుగులో 'సంచారి' పేరుతో డబ్ చేసి రిలీజ్ చేయనున్నారు. సంచారి సినిమాను కలర్స్ అండ్ క్లాప్స్ ఎంటరటైర్‌మెంట్స్ బ్యానర్‌పై ఎం.సుబ్బారెడ్డి ఈ సినిమాను తెలుగులో గ్రాండ్ గా అక్టోబర్ 1న విడుదల చేస్తున్నారు. ఇటీవల విడుదలైన ఈ సినిమా ట్రైలర్‌కు మంచి రెస్పాన్స్ వస్తోంది, ఇటీవల విడుదలైన మందాడి సినిమాతో సక్సెస్ సాధించిన సూరి అలాగే బెతలహేమ్ కుటుంబ యూనిట్ సినిమాతో సంచలన విజయం సాధించిన నివీన్ పులె ఈ సినిమాలో నటించడం విశేషం. రొమాంటిక్ సైకాలాజికల్ థ్రిల్లర్ నేపథ్యం లో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది తమిళ్‌లో తంగ మీన్కల్, తారమణి, పెరంబు వంటి హిట్ చిత్రాలకు దర్శకత్వం వహించిన రామ్ ఈ సినిమాను డైరెక్ట్ చేశాడు, యువన్ శంకర్ రాజా ఈ సినిమాకు సంగీతం అందించారు.




## డాక్యుమెంటరీ సిరీస్‌గా 'రణబాలి'

విజయ్ దేవరకొండ, రశ్మిక మందన్న జంటగా నటించిన భారీ పాన్ ఇండియా మూవీ 'రణబాలి'. ఈ సినిమాకు రాహుల్ సంకృత్యన్ దర్శకత్వం వహిస్తున్నారు. టిసిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై 'రణబాలి' సినిమాను ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ హ్యూజ్ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. అక్టోబర్ 16న విజయదశమి పర్వదినం సందర్భంగా 'రణబాలి' సినిమా వరల్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. 'రణబాలి' నెవర్ ఫర్ గెట్ ది ట్రూత్ పేరుతో 4 ఎపిసోడ్స్ డాక్యుమెంటరీ సిరీస్ తీసుకొస్తున్నట్లు ప్రకటించారు. నెట్ ఫ్లిక్స్ వేదికగా ఈ నెల 28వ తేదీన ఫస్ట్ ఎపిసోడ్ 'ది ఫెమైన్ వి ఫర్ గాట్' స్ట్రీమింగ్ కు రానుంది. ఈ నెల 30న సెకండ్ ఎపిసోడ్ 'ది హిస్టరీ వి ఫర్ గాట్', అక్టోబర్ 2న మూడో ఎపిసోడ్ 'ది మెన్ వి ఫర్ గాట్' స్ట్రీమింగ్ కు రాబోతున్నాయి. నాలుగో ఎపిసోడ్ 'ది లాస్ట్ లోడ్' స్ట్రీమింగ్ డేట్ ను త్వరలో ప్రకటించనున్నారు.చరిత్రకు రెండు పార్శ్వాలు ఉన్నాయి. ఒకటి మనకు చెప్పింది, మరొకటి ఎవరికీ తెలియకుండా సమాధి చేయబడింది.

మనకు తెలియకుండా చరిత్రలో కనుమరుగు చేసిన ఆ నిజాలను చెప్పబోతోంది 4 ఎపిసోడ్ల రణబాలి ట్రూత్ సిరీస్. రణబాలి ప్రపంచం నుంచి ఎక్స్ క్లూజివ్ బిహైండ్ ది సీన్స్ కంటెంట్‌తో ఈ డాక్యుమెంటరీ సిరీస్ రాబోతోంది.





(మొదటి పేజీ తరువాయి)

## భయాందోళనలుండొద్దు

ఎన్నటికీ మరువబోదని స్పష్టం చేశారు. స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ (ఎస్‌టియు టిఎస్) ఎనభై వసంతాల వైభవోత్సవం హైదరాబాద్ నాగోల్‌లోని శుభం కన్వెన్షన్‌లో ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి మంత్రి శ్రీధర్‌బాబుతోపాటు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఓపెన్ స్కూల్స్ డైరెక్టర్ కె.లింగయ్య, టిజిఇజెఎసి చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సమావేశానికి ఎస్‌టియు టిఎస్ అధ్యక్షుడు జి.సదానందంగౌడ్, అధ్యక్షత వహించగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్ ఆహ్వాన ప్రసంగం చేశారు. అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఆగిపోయిన ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు తమ ప్రభుత్వ హయాంలోనే జరిగాయని, మెగా డీఎస్సీ నిర్వహించామని, ఉద్యోగ, ఉపాధ్యాయ, రిటైర్డ్ ఉద్యోగులతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందన్నారు. ఉద్యోగులకు చేయాల్సింది ఇంకా చాలా ఉన్నాయన్నారు. ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. నిజాం ప్రభుత్వంలో అసంబద్ధ విధానాలపై గళమెత్తి, ఆత్మాభిమానం కోసం ఉదయించిన నాటి నుండి అదే స్ఫూర్తితో కొనసాగుతూ హక్కుల కోసం పోరాడుతూ, విద్యా విధానాలపై స్టేట్ టీచర్స్ యూనియన్ అత్యంత విలువైన సలహాలు, సూచనలతో నిజమైన ప్రజాస్వామికవాదిగా నిలబడిందని కొనియాడారు. నిరంతరం ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలు సాగించే కమ్యూనిస్టు యోధుల పోరాట పటిమను చూసి తాము ఎంతో నేర్చుకున్నామన్నారు.

**ఉపాధ్యాయ సంఘాలకు ఎస్టీయూనే 'మూలపుటమ్మ': కూనంనేని**

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కొనసాగుతున్న సకల ఉపాధ్యాయ సంఘాలకు మాతృత్వం ప్రసాదించిన 'ముగ్గురమ్మల మూలపుటమ్మ' ఎస్‌టియు అని అన్నారు. అధికారం ఎక్కడుంటే అక్కడ చేరడం కొన్ని సంఘాలకు అలవాటుగా మారిందని, కానీ ఎస్‌టియు మాత్రం ఏనాడూ అధికార పీఠాల ఒడిలోకి చేరలేదని, కేవలం ప్రజా ఉద్యమాల ఒడిలోనే నిలిచిందని అన్నారు. పోరాటం, చరిత్ర, సామాజిక వికాసం వైపు ముందుకు సాగాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎస్‌టియు ఏకంగా 10 మంది శాసనమండలి సభ్యులను గెలిపించిందని, కాళోజీ నారాయణరావు, నల్లగొండ నరసింహులు, తొలి ఎమ్మెల్సీ మనోహరరావు, రాము శ్రీరామమూర్తి, రాఘవాచారి, ప్రొఫెసర్ జయశంకర్ వంటి మహామహులను అందించిన ఘనత ఈ సంఘానిదేనన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత శాసనమండలిలో ఎస్‌టియు ప్రతినిధి లేకపోవడం లోటుగా మారిందని, రాబోయే రోజుల్లో శాసనమండలికి ఎస్‌టియు నాయకుడిని గెలిపించుకోవాలని సూచించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట రెడ్డి మాట్లాడుతూ మనిషిని శాస్త్రీయ, సాంకేతిక పరిజ్ఞానంతో వెలిగించే శక్తి ఒక్క విద్యకే ఉందన్నారు. సమాజంలో ఎవరైనా సరే ఎదగడానికి ప్రాథమిక పునాది వేసేదే పాఠశాల అని అన్నారు. ఎస్‌టియు మరింత బలోపేతం కావాలని, ఉపాధ్యాయ లోకానికి అండగా నిలువాలని ఆకాంక్షించారు. మానవాళి ఉన్నంత వరకు ప్రజాస్వామిక ఉద్యమాలకు ఎస్‌టియు దిక్సూచిగా నిలుస్తుందని చెప్పారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ సమాజంలో ప్రైవేటు విద్యాసంస్థలకు పోటీగా నిలబడాల్సిన బాధ్యత ప్రభుత్వ ఉపాధ్యాయులపై ఉందన్నారు.టిజిఇజెఎసి చైర్మన్ మారం జగదీశ్వర్ మాట్లాడుతూ చలో హైదరాబాద్ పేరుతో నిరసన వ్యక్తం చేయకముందే ముఖ్యమంత్రి స్పందించారన్నారు. మార్చి నాటికి రూ.11 వేల కోట్ల బకాయిలు విడుదల చేయాలని, పెండింగ్ డీఏలతో పాటు పీఆర్సీ నివేదికను తెప్పించి వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గత పదేళ్ల కాలంలో హైదరాబాద్‌లో చిన్న ధర్నా సెక్రెటరీ జనరల్ ముఖ్యమంత్రితో పూర్తి స్థాయి చర్చలు పూర్తి కాలేదన్నారు. గత ప్రభుత్వంలో ఉద్యోగ సంఘాలకు అస్తిత్వం లేకుండాపోయిందన్నారు. ప్రభుత్వం, ఉద్యోగ సంఘాల మధ్య దూరం పెంచేందుకు కొన్ని రాజకీయ పార్టీలకు చెందిన ఉద్యోగ సంఘాలు ప్రయత్నిస్తున్నాయన్నారు. జి.సదానందం గౌడ్ మాట్లాడుతూ నాటి ఎస్‌టియు పోరాటాలు, నాయకుల త్యాగాలతో ప్రస్తుతం ఎన్నో ప్రయోజనాలను, హక్కులను పొందుతున్నామని, వారి బాటలో నడ వడమే వారికిచ్చే నివాళిగా భావించాలన్నారు.జుట్టు గజేందర్ మాట్లాడుతూ మలి దశ తెలంగాణ ఉద్యమంలో తెగించి పోరాడిన ఏకైక సంఘం ఎస్‌టియు అని, అందుకు ఈ సంఘం గుర్తింపు కోల్పోయిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అష్టపది సంపాదకుడు దాసరి శ్రీధర్, ఎస్‌టియు పూర్వ అధ్యక్షులు పర్వత్ రెడ్డి, ఆర్థిక కార్యదర్శి సాబేర్ ఆలీ, ఉమ్మడి రాష్ట్ర పూర్వ అధ్యక్షులు కత్తి నరసింహారెడ్డి, పత్రిక సంపాదకులు ప్రసాద్, ప్రవీణ్, వెంకటేశ్వర్లు, హరిప్రసాద్, కృష్ణారెడ్డి, పరమేశతో పాటు ఎపి, ఇతర రాష్ట్రాల నాయకులు పాల్గొన్నారు.

## సమ్మె (మొదటి పేజీ తరువాయి)

రంగ బ్యాంకులు, ఇతర సంస్థలు సమ్మె గురించి, తద్వారా వినియోగదారులకు కలగబోయే అసౌకర్యం గురించి తమ ఖాతాదారులకు సూచనలు జారీ చేశాయి. వినియోగదారులకు జారీ చేసిన సూచనలో, శాఖలు/కార్యాలయాల వద్ద అత్యవసర బ్యాంకింగ్ సేవలను అందించడానికి బ్యాంక్ అన్ని విధాలా ప్రయత్నిస్తుందని ఎస్‌బిఐ పేర్కొంది. అయితే, సమ్మె సమయంలో కొన్ని సేవలకు అంతరాయం కలగవచ్చని, దీనివల్ల విలువైన వినియోగదారులకు అసౌకర్యం కలగవచ్చని తెలిపింది. ఏడు బ్యాంక్ ఉద్యోగులు, అధికారుల సంఘాలకు ప్రాతినిధ్యం వహించే 'యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్' (యుఎఫ్‌బియు) ఈ సమ్మెకు పిలుపునిచ్చింది. తమ డిమాండ్లు నెరవేరకపోతే అక్టోబర్ 26 నుండి నిరవధిక సమ్మెకు దిగుతామని కూడా ఆ సంఘం హెచ్చరించింది. వారానికి ఐదు రోజుల పని విధానం డిమాండ్ చాలా ఏళ్లుగా పరిష్కారం కాకుండానే ఉంది. చీఫ్ లేబర్ కమిషనర్ సమక్షంలో ఇటీవల జరిగిన సయోధ్య సమావేశాల్లో, వారానికి ఐదు రోజుల పని విధానాన్ని అమలు చేయడంపై ప్రభుత్వం ఎటువంటి హామీ ఇవ్వలేదని సంఘం నాయకులు తెలిపారు. అనేక ప్రభుత్వ, ఆర్థిక సంస్థలలో ఇప్పటికే వారానికి ఐదు రోజుల పని విధానం అమలులో ఉందని సంఘాలు వాదిస్తున్నాయి. 'కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు, ఆర్‌బిఐ, ఎల్ఐసి, జిఐసి, నాబార్డ్, అనేక ఇతర సంస్థలు ఇప్పటికే ఐదు రోజుల పని విధానాన్ని అనుసరిస్తున్నాయి. స్టాక్ మార్కెట్, మనీ మార్కెట్, విదేశీ మారకపు మార్కెట్ కూడా ఐదు రోజుల పని విధానంపైనే పనిచేస్తాయి' అని నేషనల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ బ్యాంక్ ఎంప్లాయీస్ (ఎన్‌సిబిఇ) ప్రధాన కార్యదర్శి ఎల్. చంద్రశేఖర్ అన్నారు. ఐదు రోజుల పని విధానంతో పాటు, పెన్షన్ ప్రయోజనాల నవీకరణ, మెరుగుదల, పెన్షనర్లందరికీ ఒకే విధమైన కరువు భత్యం (డిఏ) విధానం, నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పిఎస్) పరిధిలోని ఉద్యోగులకు పాత పెన్షన్ విధానానికి (ఒపిఎస్) మారే అవకాశం కల్పించడం వంటి అనేక ఇతర సమస్యల పరిష్కారాన్ని కూడా సంఘాలు కోరుతున్నాయి.

## లవ్లీ ప్రొఫెషనల్ వర్సిటీలో ఉద్రిక్తత

(మొదటి పేజీ తరువాయి)

దర్యాప్తు చేసేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని కూడా ఏర్పాటు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. అయితే ఈ వదంతులలో ఏమాత్రం నిజం లేదని లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ (ఎల్‌పియు) ఒక ప్రకటనలో పేర్కొంది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోల్లో పెద్ద సంఖ్యలో ఎల్‌పియు విద్యార్థులు కిటికీ అద్దాలను, మట్టి పూల కుండీలను పగలగొడుతూ, కొన్ని వస్తువులకు నిప్పు పెడుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. 'మాకు న్యాయం కావాలి' అని విద్యార్థులు నిరసనలు తెలుపుతున్నారు. ఆ వీడియోలలో, కొందరు నిరసనకారులు తమ ముఖాలను చేతిరుమాళ్లతో కప్పుకుని, యూనివర్సిటీ మాల్‌లోని దుకాణాలను, ఇతర ఆస్తులను ధ్వంసం చేస్తూ కనిపించగా, మరికొందరు ఒక కిరాణా దుకాణం నుండి కొన్ని వస్తువులను తీసుకువెళుతున్నట్లుగా కనిపించారు. బయటపడిన వీడియోలలో క్యాంపస్‌లో ఒక దెబ్బతిన్న ఎటిఎం కియోస్క్, కొన్ని వాహనాలు కనిపించాయి. ఆదివారం మధ్యాహ్నం వరకు దిగ్బంధం కొనసాగడంతో, ఫగ్వారా హైవే మార్గం నుండి జలంధర్ వైపు వెళ్లే ఫగ్వారా–జండియాలా రోడ్డుకు, అలాగే ప్రధాన రహదారుల మీదుగా ట్రాఫిక్‌ను మళ్లించారు. జాతీయ రహదారిపై వాహనాలు బారులు తీరడంతో ప్రయాణికులు రోడ్డుపైనే చిక్కుకుపోయారు. మూడు రోజుల క్రితం యూనివర్సిటీ హాస్టల్‌లో ఉంటున్న ఒక విద్యార్థినిపై ప్లంబర్ అత్యాచారం చేశాడని విద్యార్థులు ఆరోపించడంతో, తెల్లవారుజామున సుమారు 1 గంటకు యూనివర్సిటీ బాలికల హాస్టల్ సమీపంలో ఈ నిరసనలు ప్రారంభమయ్యాయి. ఈ విషయం గురించి హాస్టల్ వార్డెన్‌కు తెలియజేసినప్పటికీ ఎలాంటి చర్య తీసుకోలేదని కూడా వారు ఆరోపించారు. ఈ విధ్వంసంపై వచ్చిన నివేదికల నేపథ్యంలో, కపుర్తలా, జలంధర్ రూరల్, హోషియార్‌పూర్‌ల నుండి భారీ పోలీసు బలగాలను మోహరించారు. తెల్లవారుజామున 1.45 గంటలకు ఎల్‌పియు క్యాంపస్‌లో విద్యార్థులు గుమిగూడి రహదారిని దిగ్బంధించారని పోలీసులకు సమాచారం అందిందని కపుర్తలా సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్ఎస్‌పి) గౌరవ్ తూరా తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకున్న డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (జలంధర్ రేంజ్) నవీన్ సింగ్లా, ఆ పరిధిలోని ఎస్ఎస్‌పిలందరినీ, పోలీసు బలగాలను రంగంలోకి దించినట్లు తెలిపారు. క్యాంపస్‌లోని జిహెచ్3 హాస్టల్‌లో ఉంటున్న ఆ విద్యార్థిని ఆ తర్వాత తన



ఇంటికి వెళ్లిపోయిందని, ఈ విషయంలో ఎటువంటి చర్యలూ తీసుకోలేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారని ఆయన చెప్పారు.

**విద్యార్థుల వాంగ్మూలం ఆధారంగా ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు సింగ్లా తెలిపారు**

ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని కూడా ఏర్పాటు చేశామని, విద్యార్థుల ప్రతినిధులతో కలిసి దర్యాప్తు నిర్వహిస్తామని ఆయన చెప్పారు. ఈ కేసును శాస్త్రీయ పద్ధతిలో దర్యాప్తు చేస్తామని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులకు మరికొన్ని డిమాండ్లు కూడా ఉన్నాయని, వాటిపై చర్చించేందుకు మధ్యాహ్నం 12 గంటలకు ఎల్‌పియు యాజమాన్యంతో సమావేశం ఏర్పాటు చేశామని డిఐజి తెలిపారు. ఎఫ్ఐఆర్ కాపీని విద్యార్థులకు అందజేస్తామని సింగ్లా చెప్పారు. హాస్టల్ సిబ్బంది అంతా మహిళలే ఉండాలని కూడా విద్యార్థినులు డిమాండ్ చేస్తున్నారని డిఐజి ఒక ప్రశ్నకు సమాధానంగా, తెలిపారు. ఈ డిమాండ్లను యాజమాన్యం పరిష్కరిస్తుందని ఆయన చెప్పారు. ఎల్‌పియులో చదువుతున్న తెలంగాణకు చెందిన ఒక విద్యార్థిని 15 రోజుల క్రితం ఆత్మహత్య చేసుకుందని మరొక ప్రశ్నకు సమాధానంగా డిఐజి తెలిపారు. ఆ విద్యార్థిని మొబైల్ ఫోన్‌ను ఫోరెన్సిక్ విశ్లేషణకు పంపారు. ఏదైనా అనుమానాస్పద చర్య జరిగినట్లు విద్యార్థులు చెబితే, తప్పక చర్య తీసుకుంటాం అని ఆయన అన్నారు. అత్యాచారం జరిగిందన్న విద్యార్థుల ఆరోపణల గురించి అడిగినప్పుడు, ఎల్‌పియు వైస్ ఛాన్సలర్ జస్పాల్ సింగ్ స్పందిస్తూ, అటువంటి సంఘటన గురించి తమకు ఎటువంటి సమాచారం లేదని చెప్పారు.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com